fb/prajasakti, www.prajasakti.com

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 42 | విజయవాడ, సోమవారం 12 ఫిబ్రవరి 2018 | 12 + 12 పేజీలు వెల : 4.00



ఇంకా 'లెక్కలు' తేల్లేదు !

రద్దయిన నోట్లపై ఆర్‌బిఐ

8

విభజన చట్టంలోని అంశాలన్నీ అమలు చేయాలి, ప్రత్యేక హోదా ఇవ్వాలి

సిపిఎం 25వ మహాసభ తీర్మానం

ప్రజాశక్తి- పర్స సత్యనారాయణ నగర్ (భీమవరం)

2014 జూన్ 2న అమల్లోకి వచ్చిన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పేర్కొన్న అన్ని అంశాలనూ అమలు చేయాలనీ, వెంటనే ప్రత్యేక హోదా ఇవ్వాలనీ సిపిఎం రాష్ట్ర 25 వ మహాసభ డిమాండ్ చేసింది. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరుగుతున్న ఆ పార్టీ రాష్ట్ర మహాసభల్లో రెండో రోజైన ఆదివారం ఈ తీర్మానాన్ని మాజీ శాసనమండలి సభ్యులు కె ఎస్ లక్ష్మణరావు ప్రవేశపెట్టగా, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కె ఓబులు బలపరిచారు విభజన చట్టంలోని 13 వ షెడ్యూల్‌లో ఐఐటి., ఐఐఎం., పెట్రోలియం, సెంట్రల్, గిరిజన విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు సుమారు 9600 కోట్ల రూపాయలు కేటాయించాల్సి ఉండగా, కంటితుడుపుగా నిధులు కేటాయించారు. దీంతో ప్రహరీగోడల నిర్మాణానికీ నిధులు సరిపోక వాటిని తాత్కాలికంగా అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. విభజనపై పార్లమెంట్‌లో చర్చ జరిగినప్పుడు ప్రతిపక్షంగా ఉన్న బిజెపి ప్రత్యేక హోదా ఐదేళ్లు కాదు పదేళ్లు అని చెప్పింది. అధికారంలోకి వచ్చిన తరువాత చంద్రబాబు పదేళ్లు కాదు పదిహేనేళ్లు కావాలని చెప్పి ఆ తరువాత ప్యాకేజీకి ఒప్పుకుని రాష్ట్రానికి బిజెపితో కలిసి ద్రోహం చేశారు. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న వైసిపి కూడా కేంద్రానికి వంతపాడుతూ తను నిర్వర్తించాల్సిన కర్తవ్యాన్ని కూడా నిర్వహించలేకపోతుంది. ఈ నేపథ్యంలో వామపక్షాలు ఈ నెల 8న నిర్వహించిన బంద్‌కు కాంగ్రెస్, వైఎస్ఆర్‌సిపి మద్దతునిచ్చాయి. రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి సంవత్సరానికి రూ.1000 కోట్లు ఇస్తామని చెప్పి కేవలం రూ.50 కోట్లు ఇచ్చి సరిపుచ్చింది. రైల్వే జోన్ ఊసే ఎత్తడం లేదు. రాజధాని అమరావతిని ఢిల్లీస్థాయిలో నిర్మించడానికి సహకరిస్తామని నరేంద్ర మోడీ ఇచ్చిన హామీని తుంగలో తొక్కారు. నవ్యాంధ్రకు రూ.16 వేల కోట్లు లోటు పూడ్చాల్సిన కేంద్రం ఆ వాగ్దానం నుండి వైదొలిగింది. ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని అంశాల అమలు చేయించుకోవడం అనేది ఆంధ్ర ప్రజల హక్కు. ఈ హక్కును సాధించుకునే వరకూ ప్రజా ఉద్యమం కొనసాగించాలని మహాసభ నిర్ణయించింది. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లాలూచీ వదిలి ప్రజలను మోసగించడం మానుకోవాలని, వెంటనే హోదా, విభజన చట్టంలోని అంశాలన్నీ అమలు చేయాలని మహాసభ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేసింది.



సిపిఎం రాష్ట్ర మహాసభల సందర్భంగా ఆదివారం నాడు భీమవరంలో పత్రికలవారితో మాట్లాడుతున్న పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్

కార్పొరేట్ సేవలో మోడీ సర్కార్

ప్రకాశ్ కరత్

ప్రజాశక్తి - భీమవరం

దేశ ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం పట్ల మోడీ సర్కారుకు చిత్తశుద్ధి లేదని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్ విమర్శించారు. మోడీ ప్రభుత్వం పేదల పేరు చెబుతూ ఆచరణలో కార్పొరేట్లకు సేవ చేస్తోందన్నారు.. పార్టీ 25వ మహాసభల్లో పాల్గొనడానికి భీమవరం వచ్చిన ఆయన పర్స సత్యనారాయణ నగర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశ పెట్టిన బడ్జెట్‌ను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. ఈ బడ్జెట్ ద్వారా రైతులకు కనీస మద్దతు ధర

మిగతా 9లో

వామపక్ష ప్రజాతంత్ర ప్రత్యామ్నాయం

సిపిఎం రాష్ట్ర మహాసభ పిలుపు



మహాసభ వేదికపై ఏచూరి, కరత్

ప్రజాశక్తి-పర్స సత్యనారాయణ నగర్ (భీమవరం)

ఆంధ్రప్రదేశ్ ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు అభ్యుదయ, ప్రజానుకూల, లౌకిక విధానాలతో ప్రజలకు ఊరట కలిగించగలిగే వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల ఐక్యతే ప్రత్యామ్నాయం' కోసం కృషి చేయాలని పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరుగుతున్న సిపిఎం రాష్ట్ర 25వ మహాసభ తీర్మానించింది. మహాసభలో రెండోరోజైన ఆదివారం ఈ మేరకు తీర్మానాన్ని సిపిఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు ఎంవిఎస్ శర్మ ప్రవేశపెట్టగా, మరో కార్యదర్శివర్గ సభ్యులు కె ప్రభాకరరెడ్డి బలపరిచారు. సభ్యుల సూచనలు, చర్చల్లో పాల్గొన్న అనంతరం ఈ తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. తీర్మానం దిగువ విధంగా ఉంది. ఆరు దశాబ్దాలు ఐక్యంగా ఉన్న తెలుగుజాతి 2014లో రెండు రాష్ట్రాలుగా చీలిపోయింది. విభజనను సమర్థించిన తెలుగుదేశం తాము అధికారంలోకి వస్తేనే నవ్యాంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి సాధ్యం అన్న ప్రచారంతో గెలిచి అధికారాన్ని చేపట్టింది. రాష్ట్రం నూతనం అయినా, విధానాలు మాత్రం పాతవే. రాష్ట్రానికి ప్రత్యేకహోదా, రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ప్రత్యేక ప్యాకేజీలు, రైల్వే జోన్ ఏర్పాటు, ఉక్కు పరిశ్రమ నిర్మాణం, రాజధాని నిర్మాణానికి నిధులు, బడ్జెట్ లోటును భర్తీ చేయడానికి ప్రత్యేక నిధుల విడుదల వంటి హామీలను అమలు చేయకుండా బిజెపి రాష్ట్ర ప్రజలను దారుణంగా వంచించింది. బిజెపికి మిత్ర పక్షంగా ఉంటూ విభజన హామీల అమలును

మిగతా 3లో

రష్యాలో కూలిన విమానం

71 మంది మృతి




మాస్కో : రష్యాలో విమానం కూలిన ప్రమాదంలో 71 మంది మృతి చెందారు. వీరిలో 65 మంది ప్రయాణీకులు కాగా, ఆరుగురు సిబ్బంది. మాస్కోలోని డుమెడెడ్వో అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రష్యాలోనే ఓరస్క్ నగరానికి ఆదివారం బయలుదేరిన సరతోవ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన అనతోనోవ్ ఏఎన్ 148 విమానం టేకాఫ్ అయిన 10 నిమిషాల్లోనే అదృశ్యమయింది. మాస్కో సమీపంలో ఆర్గునోవ్ అనే గ్రామం సమీపంలో కూలిపోయినట్లు అధికారులు గుర్తించారు. మంచులో కూరికుపోయిన శిథిలాలను కనుగొన్నా మని, ఒక్కరు కూడా ప్రాణాలతో లేరని అని అధికారులు తెలిపారు. రష్యా టెలివిజన్ కూడా విమాన ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలను ప్రసారం చేసింది. ఆకాశం నుంచి విమానం కూలిపోతున్న దృశ్యాలను చూసినట్లు ఆర్గునోవ్ గ్రామానికి చెందిన వ్యక్తులు తెలిపారు. ప్రమాదానికి కారణాలను ఇంకా గుర్తించలేదు. అయితే వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడం, లేదా పైలెట్ పొరపాటుతో విమానం కూలిపోయి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనలో మృతులకు

మిగతా 9లో

ఆ లెక్కల నిగ్గు తేల్చండి

- బిజెపిది అంకెల మాయాజాలం
- సమగ్ర వివరాలతో ప్రచారం
- టిడిపి ఎంపిలకు, ముఖ్యనేతలకు చంద్రబాబు ఆదేశం



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎపికి అన్ని విధాలా సాయం చేశామంటూ బిజెపి చెబుతున్న లెక్కల నిగ్గుతేల్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలుగుదేశం పార్టీ ఎంపీలు, ముఖ్యనేతలను ఆదేశించారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కళా వెంకట్రావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు కుటుంబరావు టిడిపి ఎంపిలు తదితర ముఖ్య నేతలతో ఆయన ఆదివారం ఉండవల్లిలోని తన నివాసంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రానికి ఇప్పటికే ఎంతో చేశామని, భారీ ఎత్తున నిధులు విడుదల చేశామని బిజెపి చేస్తున్న ప్రచారాన్ని తేలిగ్గా తీసుకోవాల్సిన అవసరం లేదని అన్నారు. 'బిజెపి అంకెల మాయాజాలం చేస్తోంది. అవాస్తవాలను చెబుతోంది. ఈ విషయం పై ప్రచారం చేయండి. సమగ్ర వివరాలతో ప్రజల్లోకి వెళ్లండి" అని ఆదేశించారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై పార్లమెంటులో సమర్థంగా గొంతు వినిపించిన తీరుపై

మిగతా 9లో

యుద్ధం ప్రారంభమైంది

- హరిబాబు ప్రకటన పచ్చి అబద్ధం: ఎంపి జయదేవ్
- మన్మోహన్ హామీలు లేకుంటే విభజన చట్టం లేనట్లే

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



విభజన హామీల అమలు కోసం కేంద్రంతో యుద్ధం ఇప్పుడే ప్రారంభమైం దని, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు హరిబాబు ప్రకటన పచ్చి అబద్ధమని ఎంపి గల్లా జయదేవ్ పేర్కొన్నారు. ప్రధాని నేరుగా స్పందిస్తే మినహా రాష్ట్రానికి న్యాయం జరగదని, ఆయన స్పందన లేనందున టిడిపి కార్యకర్తలు, నాయకులు మరో

మిగతా 9లో

దుబాయ్ చమురు కంపెనీల్లో వాటా

- భారత్-యుఎఇల మధ్య ఐదు ఒప్పందాలు
- అబుదాబి రాజుతో మోడీ విస్తృత చర్చలు



అబుదాబి రాజు మహ్మద్ బిన్ జయేద్ అల్ నహ్యాన్‌తో ప్రధాని మోడీ కరచాలనం

అబుదాబి/దుబాయ్ : దుబాయ్‌లోని చమురు క్షేత్రాలలో భారతీయ చమురు కంపెనీలకు 10 శాతం వాటాను ఇచ్చేందుకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ) అంగీకరించింది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ పర్యటనలో భాగంగా ఆదివారం ఈ మేరకు రెండు దేశాలూ ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఎంఓయుపై సంతకాలు చేశాయి. దీనిని చారిత్రాత్మక ఒప్పందంగా భారత ప్రభుత్వ వర్గాలు అభివర్ణిస్తున్నాయి. దీనితో పాటు మరో నాలుగుఒప్పందాలపై కూడా రెండు దేశాలు సంతకాలు చేశాయి. ఇంధన, రైల్వే, మానవ వనరులు, ఆర్థిక సేవలకు సంబంధించిన ఒప్పందాలు వీటిలో ఉన్నాయి. అంతకుముందు అబుదాబి రాజు మహ్మద్ బిన్ జయేద్ అల్ నహ్యాన్‌తో విస్తృత చర్చలు జరిపారు. చర్చల అనంతరం ఈ ఐదు ఒప్పందాలపై ఇరు పక్షాలు సంతకాలు చేశాయి. ఇండియన్ కన్సార్టియం (ఓవిఎల్, బిపిఆర్ఎల్ అండ్ ఐఓసిఎల్), అబుదాబి నేషనల్ ఆయిల్ కంపెనీ (ఎడిఎన్ఓసి) మధ్య

మిగతా 9లో



పదో తరగతి నామినల్ రోల్స్ విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పదో తరగతి విద్యార్థుల నామినల్ రోల్స్‌ను ఎస్ఎస్‌సి బోర్డు ఆదివారం విడుదల చేసింది. పదో తరగతి విద్యార్థులకు మార్కుల జాబితాలో ఈ వివరాలే ఉంటాయి. ఈ వివరాలను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఎస్ఎస్‌సి బోర్డు సూచించింది. విద్యార్థుల సమాచారాన్ని ఆయా ప్రధానోపాధ్యాయులు ఆన్‌లైన్ ద్వారా ఎస్ఎస్‌సి బోర్డుకు పంపించారు. ఈ వివరాలను ఖరారు చేస్తూ ఎస్ఎస్‌సి బోర్డు విడుదల చేసింది. విద్యార్థి పేరు, తండ్రి పేరు, పుట్టిన తేదీ తదితర వివరాలు ఇందులో ఉంటాయి. పదో తరగతి పరీక్షల హాల్ టికెట్, ఫలితాలతో వచ్చే మార్కుల జాబితాలోనూ ఇదే విధంగా ఇస్తారు. వీటిలో పొరపాటు ఉంటే, ఆయా విద్యార్థులు సరైన వివరాలను సంబంధిత డిప్యూటీ విద్యాశాఖ అధికారికి లిఖిత పూర్వకంగా అందజేయాల్సి ఉంటుందని బోర్డు సూచించింది.

మరో ఇద్దరు జవాన్ల మృతి

- 36 గంటలకు పైగా కొనసాగిన ఎదురు కాల్పులు
- ముగ్గురు ఉగ్రవాదులు హతం
- ఐదుగురు సైనికులతో పాటు ఒక పౌరుడు మృతి
- 9 మందికి గాయాలు
- యురి సైనిక శిబిరంపై దాడిని తలపించిన ఘటన



సంజువాన్ (జమ్మూ) : జమ్మూలోని సంజువాన్ సైనిక శిబిరంలో 36 గంటలకుపైగా కొనసాగిన ఎన్‌కౌంటర్ ఎట్టకేలకు ఆదివారం సాయంత్రానికి ముగిసింది. ఈ ఎన్‌కౌంటర్‌లో జైష్ ఎ మొహమ్మద్‌కు చెందిన ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారని సైనిక వర్గాలు తెలిపాయి. ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన ముగ్గురు ఉగ్రవాదులు శనివారం ఉదయం సైనిక శిబిరంపై దాడిపాల్పడిన వారేనని తెలిపారు. ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఐదుగురు సైనికులు, ఒక పౌరుడు మృతి చెందారు. సుమారు 9 మంది పౌరులు గాయాలపాలయ్యారు. యురిలో 2016లో జరిగిన భీకర ఉగ్రవాద దాడి తరువాత అతి భయానకంగా జరిగిన ఉగ్రవాద దాడి ఇదే. యురి సైనిక శిబిరంపై ఉగ్రవాదులు జరిపిన దాడిలో 19 మంది సైనికులు మృతి చెందిన సంగతి తెలిసిందే. సంజువాన్ సైనిక శిబిరం వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు శనివారం సాయంత్రం మృతి చెందగా, మరొకరు ఆదివారం మృతి చెందారు. ఇక్కడ ఆదివారం కూడా ఎన్‌కౌంటర్ కొనసాగడంతో ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్ పరిస్థితిని సమీక్షించారు. సంజువాన్ సైనిక శిబిరంలో ఉగ్రవాదులు దాగి ఉండవచ్చుననే సందేహంతో సైనికులు శిబిరమంతటా

మిగతా 9లో

సిఎం చంద్రబాబుకు సుస్థిరాభివృద్ధి సదస్సు ఆహ్వానం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఢిల్లీలో నెల 15 నుంచి మూడు రోజులపాటు జరిగే ప్రపంచ సుస్థిర అభివృద్ధి సదస్సుకు హాజరై ప్రసంగించాల్సిందిగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కేంద్ర ఇంధన వనరుల సంస్థ నుంచి ఆహ్వానం అందింది. పునరుత్పాదక ఇంధనం, పొదుపు అంశాల్లో మందుచూపుతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సిఎం ఆ సదస్సులో వివరిస్తారని రాష్ట్ర ఇంధన శాఖ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వాతావరణ మార్పులను తట్టుకునేందుకు, హరిత ఇంధనాన్ని ప్రపంచ వ్యాప్తంగా ప్రోత్సహించడంతోపాటు సుస్థిర అభివృద్ధి దిశగా కార్యాచరణను ఈ సదస్సులో రూపొందిస్తారన్నారు. అమరావతి, తిరుపతి, విజయవాడ నగరాల్లో పర్యావరణ హిత వాహనాల వినియోగాన్ని ప్రారంభిస్తామని, అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తామని ఈ సందర్భంగా అధికారులు వెల్లడించారు.



సన్మానం

రాగసప్త స్వరం సాంస్కృతిక సంస్థ, టి.సుబ్బిరామిరెడ్డి లలితకళా పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం మాజీ ముఖ్యమంత్రి రోశయ్యకు జీవన సాఫల్య పురస్కారం అందజేస్తున్న ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

రాజనీతిజ్ఞుడు రోశయ్య

ఉప రాష్ట్రపతి వెంకయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ కొణిజేటి రోశయ్య రాజనీతిజ్ఞుడని ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు కొనియాడారు. రోశయ్యకు సన్మానం చేయడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని చెప్పారు. రాగసప్త స్వరం సాంస్కృతిక సంస్థ, టి.సుబ్బిరామిరెడ్డి లలితకళా పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం ఇక్కడ పార్క్‌హయత్ హోటల్‌లో రోశయ్యకు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ, రోశయ్య పరిణితి చెందిన రాజకీయ నాయకుడని కార్యదక్షత, విషయ పరిజ్ఞానం, క్రమశిక్షణతో అందరి మన్ననలను పొందారన్నారు.

రోశయ్య మాట్లాడుతూ తాను 35 ఏళ్ల రాజకీయ జీవితం గడిపానని, ఏ హోదాలో పనిచేసినా తనకు అప్పగించిన బాధ్యతలకు న్యాయం చేయాలనే ధ్యేయంతోనే పనిచేశానని చెప్పారు. ఈ సన్మానం జీవితంలో మర్చిపోలేనన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, ఎంపి సుబ్బిరామిరెడ్డి, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు కెవి రమణా చారి, ఎపి మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపునేని రాజకుమారి, ప్రముఖ నవలా రచయిత్రి యద్దనపూడి సులోచనారాణి, సీనియర్ జర్నలిస్టు పి.విజయబాబు పలువురు రాజకీయ నేతలు, సినీ నటులు పాల్గొన్నారు.



పొడి వాతావరణం

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

ఆగ్నేయ అరేబియాలో కేరళ తీరానికి ఆనుకుని స్థిరంగా అల్పపీడనం కొనసాగుతోంది. దక్షిణ మహారాష్ట్ర, పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. వీటి ప్రభావంతో రాయలసీమలో అక్కడక్కడా శనివారం చిరు జల్లులు కురిశాయి. ఆదివారం ఆకాశం మేఘావృతమైంది. సోమవారం నుంచి మూడు రోజుల పాటు కోస్తా, రాయలసీమల్లో పొడి వాతావరణం నెలకొంటుందని హైదరాబాద్ వాతావరణ శాఖ పేర్కొంది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగ పడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

ప్రజ్ఞ

1. యునాని వైద్య విధానంపై అంతర్జాతీయ సదస్సు ఎక్కడ జరుగుతుంది?
2. జాతీయ యునాని దినోత్సవం ఎప్పుడు నిర్వహిస్తారు?
3. ఏ రైల్వే జోన్‌లో పూర్తి స్థాయిలో ఎల్‌ఈడి లైటింగ్‌ను ఏర్పాటు చేశారు?
4. ఎస్‌బిఐ కార్డ్‌కు నూతన ఎండి, సిఈఓగా ఎవరు నియమితులయ్యారు?
5. ఇటీవల మరణించిన చంద్రశేఖర్ రాత్ ఏ రంగానికి చెందినవారు?

సమాధానాలు 7లో

కేంద్ర నిధులపై శ్వేతపత్రం

పవన్ కల్యాణ్ డిమాండ్
మాజీ ఎంపి ఉండవల్లితో భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎపికి కేంద్రం ఇచ్చిన నిధులపై ప్రజలతో పాటు తనకూ అనుమానాలు ఉన్నాయని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. ఇంతవరకు వచ్చిన నిధులు, ఖర్చుల వివరాలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే శ్వేత పత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పవన్ ఆదివారం మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్‌కుమార్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. జనసేన పార్టీ కార్యాలయంలో సుమారు గంట పాటు జరిగిన ఈ సమావేశంలో విభజన హామీల అమలు, సాధనకు ఏం చేయాలనే దానిపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం ఇరువురు నేతలూ మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర విభజనతో నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌ను అన్ని విధాలా ఆదుకునేందుకు 2014 ఎన్నికల్లో బిజెపి-టిడిపిలకు మద్దతు తెలిపానని పవన్ అన్నారు. విభజన హామీల అమలు నెరవేర్చే విషయంలో వచ్చిన ఇబ్బందులపై చాలా సార్లు మాట్లాడే అవకాశం వచ్చినా, ప్రతి చిన్న విషయానికి గొడవ చేసి ఇబ్బంది పెట్టడం ఎందుకని సంయమనం పాటిస్తూ వచ్చానని చెప్పుకొచ్చారు. హోదా, హామీలు నెరవేర్చకపోవడంపై అందరిలాగే తనకూ అసంతృప్తి ఉందన్నారు. ఇటీవల తాను పోలవరం ప్రాజెక్టు నిధుల విడుదల, ఖర్చుపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేసినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదని తెలిపారు. వెబ్‌సైట్‌లో పెట్టాం చూసుకోవాలని సూచించారని, అయితే ఆ వెబ్‌సైట్ ఎక్కడా కనిపించలేదని తెలిపారు. ప్రజలకు అన్ని వాస్తవాలూ తెలియాల్సి ఉందని, అందుకే పార్టీలకు అతీతంగా నిజాయితీగా వాస్తవాలను వెల్లడించగలిగే వారితో ప్రత్యేకంగా నిజ నిర్ధారణ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని తెలిపారు. ఈ కమిటీలో జనసేన పార్టీ కూడా ఉండబోదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వివరాలు సేకరించిన వివరాలు కమిటీకి అందజేయడం మాత్రమే చేస్తుందని చెప్పారు. నిధుల విడుదల విషయంలో ఎవరో ఒకరు అబద్ధం చెబుతున్నారని, అయితే కమిటీ అన్ని అంశాలు పరిశీలించి నిజాలను వెల్లడిస్తుందన్నారు. ఇప్పటికే వివరాలు బిజెపిని కోరామని, రాష్ట్ర ప్రభుత్వాన్ని కూడా వివరాలు ఇవ్వాలని కోరుతున్నామని తెలిపారు. వీలైతే కేంద్రం నుంచి వచ్చిన నిధులు, ఖర్చు వివరాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.



ప్రభుత్వాలు అబద్ధాలు చెప్పవు.. నిజాలు దాస్తాయి..! : ఉండవల్లి అరుణ్ కుమార్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎప్పుడూ లేనంత గడ్డు పరిస్థితుల్లో ఉందని, ప్రజలకు అసలు నిజాలు తెలియాల్సిన అవసరముందని మాజీ ఎంపీ ఉండవల్లి అన్నారు. పవన్ తనతో రాజకీయాలు మాట్లాడలేదని, కేవలం విభజన హామీల అమలులో ఏర్పడిన గందరగోళంపై ఏం చేయాలని మాత్రమే చర్చించారని తెలిపారు. నిధుల విడుదల విషయంలో ఏ ప్రభుత్వమూ అబద్ధం చెప్పదని... అయితే నిజాలను మాత్రమే దాస్తాయని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో జవాబుదారీతనం అవసరమని, ఈ దిశగా పవన్ చర్యలతో ఇప్పుడు నిజమైన రాజకీయాలు మొదలయ్యాయనిపిస్తుందని అభిప్రాయపడ్డారు. నిజనిర్ధారణ కమిటీలో తనకు స్థానం కల్పించడం సంతోషంగా ఉందని, పవన్‌తో కలిసి పని చేయాలనుకుంటున్నాని చెప్పారు.

మోడీ ఆస్కార్‌కి మించిన నటుడు

అద్వానీపై సిబిఐ కేసు పెట్టించాడు
రాష్ట్ర విభజనలో బిజెపిదే ఎక్కువ పాత్ర
మీడియా సమావేశంలో కెవిపి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రధాని నరేంద్ర మోడీ ఆస్కార్‌కి మించిన నటుడని రాజ్యసభ ఎంపి, కాంగ్రెస్ సీనియర్ నేత కెవిపి రామచంద్రరావు వ్యాఖ్యానించారు. ఆదివారం నాడిక్కడ ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మోడీ లోక్ సభలో కాంగ్రెస్‌ని ఉద్దేశించి అసత్యాలు మాట్లాడారని, ఏపికి చెందిన మాజీ ముఖ్యమంత్రులను కాంగ్రెస్ పార్టీ అవమానించిందనే విషయం శుద్ధ అబద్ధమని అన్నారు. అంజయ్యని కాంగ్రెస్ చాలా అవమానించిందని మోడీ చెబుతున్నారని, లక్ష రూపాయల సూట్, కళ్ల అద్దాలు పెట్టుకుని అంజయ్య ఎప్పుడూ లేరని అన్నారు. అంజయ్య సామాన్యుడిగా బ్రతికేవారని చెప్పారు. ఆయనకి కుల బలం లేదని, కానీ ప్రజాబలం ఉందని వ్యాఖ్యానించారు. అంజయ్య చనిపోయాక కూడా ఆయనను కాంగ్రెస్ పార్టీ గౌరవించిందన్నారు. ఎస్సీ అయిన అంజయ్యని అవమానించారని మోడీ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. అద్వానీకి మన కంటే ఎక్కువ మోడీ గురించి తెలుసునని, అలాంటి ఆయనను బొటన వేలితో తొక్కి పెట్టారని ఆరోపించారు. అద్వానీ మీద సిబిఐ కేసు పెట్టి ఈ వయసులో కూడా కోర్టుల చుట్టూ తిప్పుతున్నారని అన్నారు. అద్వానీ ఆ రోజు చేపట్టిన పనుల వల్లే బిజెపికి జవసత్వాలు వచ్చాయని గుర్తు చేశారు. రాష్ట్రాన్ని విడగొట్టేటప్పుడు బిజెపి పనికి రాని డాక్యుమెంట్లు ఇచ్చిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీకి అప్పుడు 202 సీట్లు మాత్రమే ఉన్నాయని, కానీ బిజెపి అప్పుడు అడ్డుపడి ఉంటే రాష్ట్ర విభజన బిల్లు ఆమోదం పొందేది కాదని స్పష్టం చేశారు. రాజ్యసభలో తాను, తన మిత్రులు కలిసి బిజెపి వారిని బిల్లుని అడ్డుకోమని వేడుకున్నామని గుర్తు చేశారు. ఆరోజు కాంగ్రెస్ పాత్ర చాలా చిన్నదని, బిజెపి పాత్ర చాలా పెద్దదని వ్యాఖ్యానించారు. వారి సవరణలు అన్నీ ఉపసంహరించుకుని బిల్లుకు మద్దతు పలికారని చెప్పారు.

రైతులు, వ్యాపారులకు అనుకూలంగా ఈ-నామ్

మంత్రి పత్తిపాటి పుల్లారావు

ప్రజాశక్తి-దుగ్గిరాల (గుంటూరు జిల్లా)

ఈ-నామ్ విధానాన్ని ఎలా సవరిస్తే రైతులకు, వ్యాపారులకు లాభమో ఆ విధంగా అనుసంధానిస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి పత్తిపాటి పుల్లారావు అన్నారు. గుంటూరు జిల్లా దుగ్గిరాలలో పసుపు మార్కెట్‌యార్డు నూతన పాలకవర్గం ఇటీవల బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో ఆదివారం అభినందన సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి పుల్లారావు మాట్లాడుతూ రైతులకు వైద్యశిబిరాలతో పాటు గోడౌన్, మౌలిక వసతులనూ అభివృద్ధి చేయాలని పాలకవర్గానికి సూచించారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ఎమ్‌డి హిదాయత్, ఎమ్మెల్సీ ఎఎస్ రామకృష్ణ, తెనాలి ఎమ్మెల్యే ఆలపాటి తదితరులు పాల్గొన్నారు.

ఏపికి అన్యాయంలో కంభంపాటీ పాత్రధారుడే

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ ప్రజలకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అన్యాయంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కంభపాటి హరిబాబు పాత్ర కూడా ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ విమర్శించారు. ఈ మేరకు ఆయన హరిబాబుకు ఆదివారం బహిరంగ లేఖ రాశారు. పరస్పర విరుద్ధ ప్రకటనలతో 44 మాసాలుగా కేంద్రం ఎపికి తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. మోడీ, అరుణ్‌జైట్లీ, అమిత్‌షా, కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు వెంకయ్యనాయుడు తదితరులంతా పూటకోమాట చెప్పి, అమలుకు నోచుకోని ప్రకటనలతో ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ఎపి ప్రజలను మరోసారి ఫూల్స్ చేసేందుకు బిజెపి పావులు కదుపుతోందని హరిబాబు తాజా ప్రకటనలతో అర్థమవుతోందన్నారు. రాష్ట్ర ప్రజల ఆశలను, ఆకాంక్షలను తుంగలో తొక్కిన బిజెపి విధానాలపై రాష్ట్ర ప్రజల తరపున తాము అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలన్నారు. అధికారంలోకి వస్తే రాష్ట్రానికి పదేళ్లు ప్రత్యేక హోదా కల్పిస్తామని బిజెపి 2014 ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన మాట వాస్తవం కాదా? ఈ హామీని అడ్డుపెట్టుకొని రాష్ట్రంలో 2 ఎంపి, 4 ఎమ్మెల్యే సీట్లను బిజెపి గెలిచిన విషయం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. కేంద్ర రైల్వే మంత్రి సురేష్‌ప్రభు రాష్ట్రం నుండి రాజ్యసభకు ఎన్నికైన తర్వాత విశాఖకు ప్రత్యేక రైల్వేజోన్ ఇస్తామన్నారని, కానీ ఇంతవరకు రైల్వేజోన్ ఊసేలేదని పేర్కొన్నారు. ఇది రాష్ట్ర ప్రజల ఆశలపై నీళ్లు చల్లడంకాదా అని ప్రశ్నించారు. కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామన్నారని, దీని విషయంలో కనీసం ప్రస్తావనే లేకపోవడం రాయలసీమ ప్రజలను మోసగించడమేనని పేర్కొన్నారు. ఎపి విభజన హామీల అమలుపై ఆయా శాఖలతో చర్చలు జరుపుతున్నామని అరుణ్‌జైట్లీ పార్లమెంట్‌లో చెప్పారని, 44 నెలలుగా చర్చల స్థాయిలోనే ఉందని చెప్పడం అతిశయోక్తి కాదా అని ప్రశ్నించారు. వాస్తవాలను మరుగుపరచే విధంగా కాకి లెక్కలు ప్రకటించడాన్ని మోసం కాక ఇంకేమనాలని హరిబాబును ప్రశ్నించారు. ఈ మోసానికి నైతిక బాధ్యత వహిస్తూ రాష్ట్రం నుండి గెలిచిన ఇద్దరు బిజెపి ఎంపిలు, నలుగురు ఎమ్మెల్యేలు తక్షణమే రాజీనామాలు చేసి రాజకీయ విలువలు కాపాడాలని కోరారు.

నేటి నుంచి 'ఉత్తరాంధ్ర జనఘోష'

మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ

ప్రజాశక్తి - అనకాపల్లి (విశాఖ)

రాష్ట్ర విభజన చట్టంలోని అంశాలను అమలు చేయాలని, ఉత్తరాంధ్రకు న్యాయం చేయాలని 'ఉత్తరాంధ్ర జనఘోష' పేరుతో ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఉత్తరాంధ్ర చర్చావేదిక కన్వీనర్, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ తెలిపారు. అనకాపల్లిలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనఘోష సందర్భంగా విద్యార్థులతో చర్చాగోష్టిలు, ట్రేడ్ యూనియన్లతో సమావేశాలు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ వంటి సంస్థలతో సదస్సులు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఎవరి స్థాయిలో వారు ఏర్పాటు చేసే కార్యక్రమాల్లో పాల్గొని, విభజన చట్టంలో ఇచ్చిన హామీలు అమలు కాకపోవడం వల్ల జరిగిన నష్టాన్ని ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. మార్చి 5వ తేదీన రెండో విడత పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమయ్యే వరకూ విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో పర్యటించనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రాంతంపై కేంద్ర ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందని, ఈ ప్రాంతానికి ఆర్థిక ప్యాకేజీ ఇవ్వాలని విభజన చట్టంలో ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో ఉన్న రెండున్నర కోట్ల ప్రజల మనోభావాలను గౌరవించి విభజన చట్టం హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

పిఠాపురం శ్రీపాద సంస్థానంలో ఆర్‌జెసి విచారణ

ప్రజాశక్తి - పిఠాపురం (తూర్పుగోదావరి)

దేవాదాయశాఖ స్వాధీనం చేసుకున్న పిఠాపురం శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానంలో ఆదివారం ఆ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ (ఆర్‌జెసి) వేండ్ర త్రినాధరావు విచారణ చేపట్టారు. ప్రస్తుతం పనిచేస్తున్న అన్నవరం ఇఒ జితేంద్ర, ఎఇఒగా ఉన్న పాదగయ దేవస్థానం ఇఒ సందక దారబాబు మధ్య పాలనా వ్యవహారాలు, సంస్థానంలో ఇతర సంఘటనల విషయంలో శనివారం వివాదం చోటు చేసుకున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో సంస్థానం కార్యాలయంలో ఎఇఒ దారబాబు, ఇతర సిబ్బంది నుంచి ఆయన వివరాలను అడిగి తెలుసుకున్నారు. సుమారు గంటపాటు ఇక్కడ జరుగుతున్న సంఘటనల వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా త్రినాధరావు విలేకర్లతో మాట్లాడారు. శ్రీపాద శ్రీవల్లభ సంస్థానాన్ని అన్నవరం దేవస్థానం దత్తత తీసుకుందా? అన్న విలేకర్ల ప్రశ్నకు తమ శాఖ స్వాధీనం మాత్రమే చేసుకుందని బదులిచ్చారు. ఈ సంస్థానంలో జరిగిన, జరుగుతున్న మొత్తం వ్యవహారాలపై విచారణ జరుగుతుందన్నారు. దీనిపై కొందరు పెత్తనం చెలాయిస్తున్నారన్న వాదనల్లో వాస్తవం లేదన్నారు. దేవాదాయశాఖ నిబంధనల ప్రకారం ఇక్కడ సిబ్బంది పనిచేయాలని సూచించారు. అన్ని దేవాయాల్లో శివరాత్రి ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయని తెలిపారు. క్యూలైన్‌లో నిల్చునే సందర్శకుల కోసం తాగునీరు, చిన్నపిల్లలకు పాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట ఆ శాఖ డిసి రమేష్‌బాబు, సిబ్బంది ఉన్నారు.

బడ్జెట్‌లో అగ్రిగోల్డ్ బాధితులకు రూ.4 వేల కోట్లు కేటాయించాలి

ప్రజాశక్తి - కాకినాడ

రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో రూ.4 వేల కోట్లు కేటాయించాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తిరుపతిరావు డిమాండ్ చేశారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ సుందరయ్య భవన్‌లో అగ్రిగోల్డ్ బాధితుల జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడేళ్లుగా అసోసియేషన్ పోరాటాల ఫలితంగా మృతి చెందిన 96 కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించిందన్నారు. బాధితుల డిపాజిట్ సొమ్ము చెల్లింపులో ప్రభుత్వం జాప్యం చేస్తోందని విమర్శించారు. దీనివల్ల ఇప్పటివరకు 180 మంది మనోవేదనతో మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో బాధితులకు సత్వరమే న్యాయం చేస్తామన్న పాలకులు నేటికీ సమస్యను పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో మరోసారి రాష్ట్రవ్యాప్త ఆందోళనకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఇందులో భాగంగా మార్చి ఒకటో తేదీ నుంచి గడపగడపకు అగ్రిగోల్డ్ బాధితులు కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు.

మాయ మాటలు చెప్పారు

ఏపి ప్రజల ఆత్మగౌరవానికి అవమానం
ప్రధానికి రఘువీరా రెడ్డి లేఖ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



ఏపి ప్రజలు నిరాశతో ఉన్నారని, మోడీ చెప్పేవన్నీ మాయ మాటలని ఎపిసిసి అధ్యక్షుడు ఎన్.రఘువీరా రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు ఆయన ఆదివారం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి లేఖ రాశారు. పార్లమెంట్‌లో రాష్ట్రపతి ఉపన్యాసానికి ధన్య వాదాలు తెలిపే సందర్భంలో ప్రధాని నరేంద్ర మోడీ చేసిన అసందర్భ ఉపన్యాసం పట్ల, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజనకు సంబంధించి చేసిన వ్యాఖ్యల పట్ల తాము తీవ్ర అభ్యంతరాన్ని, నిరసనను తెలియ జేస్తున్నామని పేర్కొన్నారు. తనను బిజెపి జాతీయ అధ్యక్షుడిగా భావించుకుని రాజకీయ ప్రత్యారోపణల ప్రసంగం చేసారే తప్ప, దేశ ప్రధానినన్న విషయాన్ని విస్మరించారని వ్యాఖ్యానించారు. దేశ భవిష్యత్తుకు సంబంధించి కానీ, ప్రజల ఆకాంక్షలకు సంబంధించి కానీ దేశ ప్రధాని హోదాతో మాట్లాడకపోవడం ఆ పదవిని కళంక పర్చడమేనని భావిస్తున్నామని లేఖలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ విభజన జరిగిన నాలుగేళ్లు గడుస్తున్నా రాష్ట్రానికి తగిన న్యాయం జరగలేదని, పునర్వవస్థీకరణ చట్టంలోని అంశాలు అమలు కావడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం చివరి పూర్తిస్థాయి (ఐదో)బడ్జెట్‌లో కేటాయింపులు లేకుండా మోసం చేశారని రాష్ట్ర ప్రజలు తీవ్ర ఆందోళనను వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు.

రాజ్యాధికారం వైపు అడుగులు

గిరిజన జాగృతి వేదిక రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - నెల్లూరు సిటీ

గిరిజనులు రాజ్యాధికారం వైపు అడుగులు వేయాలని గిరిజన జాగృతి వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షులు బాపట్ల వెంకటపతి, శ్రీనివాసమూర్తి పిలుపునిచ్చారు. నెల్లూరు నగరంలోని వెన్నెలకంటి రాఘవయ్య భవనంలో ఆ వేదిక రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి సమాజంలో గిరిజనులు అభివృద్ధి వైపు పయనించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీలు అమలు పరచడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్రంలో గిరిజనులు సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు ఎస్‌టి కమిషన్ చైర్మన్‌ను, గిరిజన ట్రైకార్ చైర్మన్‌ను నియమించలేదని విమర్శించారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కమిటీలో గిరిజనులకు ప్రాతినిథ్యం ఇవ్వలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి నిజంగా గిరిజనులపై ప్రేమ ఉంటే బిసిలుగా ఉన్న బోయ, వాల్మీకిలను గిరిజన జాబితాలో చేర్చే నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర యువత ప్రధాన కార్యదర్శి రావూరు రమేష్, ఉపాధ్యక్షుడు శ్రీనివాసమూర్తి, రాష్ట్ర ప్రధాన మహిళ అధ్యక్షురాలు ప్రభావతి, సుజాతమ్మ, గోవిందమ్మ పాల్గొన్నారు.

ప్రత్యేకం

నీళ్లలా సాంబారు, పెరుగు

అన్న క్యాంటీన్‌లో నాణ్యత లేమి
అధికారుల హెచ్చరించినా అదే తీరు
సచివాలయ సందర్శకుల్లో అసంతృప్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వెలగపూడిలోని రాష్ట్ర తాత్కాలిక సచివాలయం వద్ద అన్న క్యాంటీన్‌లో పదార్థాల నాణ్యత నానాటికీ తీసికట్టుగా మారింది. అక్కడిచ్చే పెరుగన్నం, సాంబాన్నం తినేందుకు వీల్లేకుండా ఉంటున్నాయి. పెరుగన్నాన్ని మజ్జిగ చారన్నం మాదిరిగా వడ్డిస్తున్నారు. సాంబారన్నం రసంతో కూడిన అన్నంలా ఉంటోంది. నాణ్యత లేమితో పాటు పరిమాణం కూడా తగ్గిపోయి, ఆకలి తీరని పరిస్థితి ఏర్పడుతోందని ఆ కాంటీన్‌లో భోం చేసే సచివాలయ సందర్శకులు పేర్కొంటున్నారు. ఈ సచివాలయానికి నిత్యం వేల సంఖ్యలో రాష్ట్ర నలుమూలల నుంచి సందర్శకులు వచ్చి వెళుతుంటారు. వారిలో కొందరు సచివాలయం లోపల మూడో బ్లాక్‌లోని ఉద్యోగుల సహకార సంఘం ఆధ్వర్యాన ఏర్పాటైన క్యాంటీన్‌లో భోజనం చేస్తుంటారు. సామాన్య, మధ్య తరగతి వారి కోసం సచివాలయం వెలుపల అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేశారు. వీరంతా అన్న క్యాంటీన్‌లోనే భోజనం చేస్తుంటారు. అక్కడ రూ.15 ధరకే పులిహోర, సాంబాన్నం, పెరుగన్నం లభ్యమవుతాయనే ఆశతో అధికశాతం సందర్శకులు దీనికే ప్రాధాన్యం ఇస్తుంటారు. క్యాంటీన్ ప్రారంభించిన తొలి రోజుల్లో ఈ మూడు రకాల భోజనం తగినంత పరిమాణంతోపాటు నాణ్యంగా అందజేస్తుండేవారు. దీంతో సచివాలయ ఉద్యోగులు, స్థోమత గల వారూ అన్న క్యాంటీన్‌లో భోజనం చేసేందుకు మొగ్గు చూపేవారు. క్యాంటీన్ ప్రారంభించిన సంవత్సరం తర్వాత క్రమక్రమంగా ఈ భోజనంలో పెరుగన్నం, సాంబారు, పులిహోర పరిమాణాన్ని తగ్గించేశారు. నాణ్యత తగ్గిపోయింది. ఈ పరిస్థితిపై సందర్శకుల నుంచి పౌర సరఫరాలశాఖ ఉన్నతాధికారులకు ఇప్పటికే ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో వారు అన్న కాంటీన్ నిర్వాహకులను హెచ్చరించారు. స్వయంగా పౌర సరఫరాలశాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్న క్యాంటీన్‌ను సందర్శించి అందజేసే పదార్థాలను పరిశీలించారు. ఆ సమయంలోనూ ఆ మూడు రకాల పదార్థాలు నాణ్యంగా లేవు. దీంతో పద్ధతులు మార్చుకోవాలని, లేకుంటే ఈ కాంటీన్ బాధ్యతను వేరే వారికి అప్పగించాల్సి ఉంటుందని మంత్రి నిర్వాహకులను తీవ్రంగా హెచ్చరించారు. ఆ తర్వాత కొన్ని రోజులపాటు పదార్థాలు సరిగానే చేశారు. మళ్లీ రెండు నెలలుగా పదార్థాల నాణ్యత, పరిమాణం పతనమైపోయాయి. సందర్శకులు ప్రశ్నిస్తే తమకు ఇచ్చే కమీషన్ సరిపోవడం లేదని, అందువల్లే చారు తరహాలో అందజేస్తున్నామని చెబుతున్నట్లు తెలిసింది. సచివాలయం చెంతనే ఈ కాంటీన్ ఇలావుంటే ఇక వీటిని రాష్ట్రంలో విస్తరించినా అవి పేదల ఆకలి తీర్చలేవని ఆక్షేపిస్తున్నారు. చెన్నైలో 203 అమ్మ క్యాంటీన్లలో నిత్యం పెద్ద సంఖ్యలో పేదలు ఈ పథకాన్ని సంతృప్తి కరంగా వినియోగించుకుంటున్నారు. ఇక్కడా అన్న కాంటీన్లను తగిన నాణ్యత, ప్రమాణాలతో స్థిరంగా కొనసాగించాలని పలువురు కోరుతున్నారు.



వెలగపూడి అన్న క్యాంటీన్‌లో మజ్జిగ చారులా ఉన్న పెరుగన్నం

సంక్షిప్తం

రూ.ఐదు లక్షల విలువైన గుట్కా స్వాధీనం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలోని కొండా వెంకటప్పయ్య కాలనీలో విజిలెన్స్ అధికారులు ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో గుట్కా తయారీ కేంద్రాన్ని గుర్తించారు. రూ.ఐదు లక్షల విలువ కలిగిన గుట్కాను స్వాధీనం చేసుకున్నారు. అమరావతి రోడ్డులో నివాసం ఉంటున్న పాలెం శివకుమార్ నెల కిందట కెవిపి కాలనీలోని సీతయ్య కాటన్ మిల్లులో ఒక షెడ్డు రూ.10 వేలకు అద్దెకు తీసుకొని రహస్యంగా గుట్కా తయారీ కేంద్రాన్ని ప్రారంభించాడు. చెన్నై నుండి ముడిసరుకు తెప్పించుకొని తన తయారీ కేంద్రంలో ఖలేజా, ఎంహెచ్ బికెఆర్, గరుడ, ఎంసి వంటి పేర్లతో కూడిన ప్యాకెట్లలో నింపి నగరంలోని విక్రయాలు చేస్తున్నాడు. తయారీ కేంద్రంలో ప్యాకెట్లలో నింపిన 26 బ్యాగులు, మరో 11 బ్యాగుల మెటీరియల్‌ను, తయారీ మిషనరీ, గుట్కా ప్యాకెట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

రూ.50 కోట్లివ్వండి.. బడ్జెట్‌కు ఎసిబి ప్రతిపాదనలు

రాష్ట్రంలో సాధారణ పరిపాలన శాఖ పరిధిలో ఉండే ఎసిబిని బలోపేతం చేసి మరింతగా దూకుడును పెంచేందుకు ఈ ఏడాది సుమారు రూ.50 కోట్లు అవసరమవుతాయని ఎసిబి డిజి ఆర్పీ ఠాకూర్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. మార్చి మొదటి వారంలో బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ఆయన ఈ ప్రతిపాదనల్లో, ముఖ్యంగా తమ సిబ్బందికి నాణ్యమైన శిక్షణను అందించడానికి, మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు.

బ్రాహ్మణ యువతను చైతన్యం చేస్తాం : శ్రీకాంత్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బ్రాహ్మణ యువతను చైతన్యం చేస్తామని బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు జ్వాలపురం శ్రీకాంత్ అన్నారు. ఆదివారం వైఎస్‌ఆర్ ఆడిటోరియంలో రాష్ట్ర బ్రాహ్మణ యువభేరి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో బ్రాహ్మణ యువత అభివృద్ధి చెందేలా సమాఖ్య కార్యక్రమాలు నిర్వహిస్తుందని పేర్కొన్నారు. విజయవాడ మాజీ ఎంఎల్‌ఎ మల్లాది విష్ణు మాట్లాడుతూ రాజకీయంగా బ్రాహ్మణులు తమ సత్తా చూపాలన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న సిపిఎం తెలంగాణా రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

కొత్త ఎజెండాతో ముందుకు..

బహుజన-లెఫ్ట్ ఫ్రంట్‌కు అదే నాంది పలికింది
సిపిఎం రాష్ట్ర మహాసభలో తమ్మినేని సందేశం

ప్రజాశక్తి – పర్సా సత్యనారాయణ నగర్ (భీమవరం)

"పార్టీ నిర్వహించిన మహాజన యాత్ర విజయం వెనుక ఉన్న మంత్రం మన జెండా కొత్త ఎజెండాని తీసుకోవడమే., అదే ప్రజలను కదిలించింది. బహుజన – లెఫ్ట్ ఫ్రంట్ ఏర్పాటుకు నాంది పలికింది. ఇదే రేపటి రోజున రాజకీయాలను ప్రభావితం చేసే ఫ్రంట్" అని సిపిఎం తెలంగాణా రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు. భీమవరంలో జరుగుతున్న సిపిఎం ఎపి 25వ రాష్ట్ర మహాసభల్లో రెండోరోజు శనివారం ఆయన సందేశం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా వేర్వేరు అయినప్పటికీ మనమంతా ఒక్కటేనని, ఇది సెంటిమెంట్‌గా చెప్పడం లేదని, ఉభయ రాష్ట్రాల్లో సమస్యలు, ప్రభుత్వ స్వభావం ఒక్కటేనని అన్నారు. కాబట్టి ఇరు రాష్ట్రాల పార్టీలూ ఒకటిగానే ఆలోచించాలన్నారు. పాలకవర్గాల స్వభావ రీత్యానేగాక.. అనేక సమస్యలపై ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతం నేర్చుకోవలసింది ఎంతో ఉంటుందని అన్నారు. ఇరు రాష్ట్రాల్లో ఉన్నది తెలుగు ప్రజలే కనుక ఈ రాష్ట్రాల అభివృద్ధికి పరస్పర సహకారంతో.. కలిసి పనిచేస్తే ప్రజా ప్రయోజనాలు ఎక్కువగా ఉంటాయన్నారు. భవిష్యత్తులో ఇరు రాష్ట్రాల్లోనూ పార్టీ ఎన్నో పోరాటాలు నిర్వహించాల్సి ఉందని, వీటిని కలిసి పంచుకోవాలని సూచించారు.

ఎపిలో పార్టీ ఆధ్వర్యాన మూడేళ్లుగా నిర్వహిస్తున్న పోరాటాలు తమనెంతో ఉత్సాహపరుస్తున్నాయన్నారు. వచ్చిన అవకాశాలను ఉపయోగించుకొని ఉద్యమ నిప్పురవ్వ రాజేయడం గమనించామని, మీ నివేదికలోనూ, చర్చల్లోనూ అది వ్యక్తమైందని అన్నారు. తెలంగాణాలో కూడా పార్టీ ఆధ్వర్యంలో 'మల్లన్న సాగర్' పోరాటాన్ని కూడా ఇలాగే నిర్వహించామని, ఇది ముఖ్యమంత్రి కెసిఆర్‌కు తలనొప్పిగా తయారైందని తెలిపారు. కెసిఆర్ 'హరితహారం' పేరుతో గిరిజనులను అడవి నుంచి తరిమివేసే పథకం ప్రవేశపెట్టాడని, దీనిపై ఉధృతంగా నిర్వహించిన పోరాటం వల్ల ఆయన వెనక్కి తగ్గాడని వివరించారు. ఇంకా భూ నిర్వాసితుల, సామాజిక, తదితర సమస్యలపై చేసిన పోరాటాలు తెలంగాణాలో పెద్ద ప్రభావం తెచ్చాయన్నారు. పార్టీ విశాఖ అఖిల భారత మహాసభ సూచించిన విధంగా ఇంకా పెద్దఎత్తున పోరాటాలు నిర్వహించాల్సి ఉందని అన్నారు. అయితే తెలంగాణ ప్రభుత్వంపై అక్కడి ప్రజలకు ఇంకా భ్రమలున్నాయని, తెలంగాణా సెంట్‌మెంట్ ఇంకా ఉందని అన్నారు. తెలంగాణా ఏర్పాటుతో ఒక విజయం సాధించారని, అలాంటి దశలో ప్రజలు వెంటనే పోరాటాల్లోకి దిగడం జరగదని, కొంత సమయం పడుతుందని అన్నారు.

కెసిఆర్‌ను సవాల్ చేస్తున్నది సిపిఎం ఒక్కటే

తాను ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థులతో నిర్వహించిన ముఖాముఖి గంటలు గడిచి.. ఒక రోజల్లా పట్టిందని.. విద్యార్థులు సిపిఎం అనుసరిస్తున్న విధానాలపై ప్రశ్నల పరంపరం కొనసాగించారని వీటన్నిటికీ ఓపిగ్గా సమాధానాలిచ్చానని అన్నారు. ఒక పిహెచ్‌డి స్కాలర్.. తెలంగాణా ఉద్యమంలో సిపిఎం ఖతం అయ్యిందని అనుకున్నానని, ఏడు తాడిచెట్ల లోతున భూమిలో పాతిపెట్టామని.. అయినా మీరు పెకలించుకొని ఎలా బయటకు వచ్చారని, ఉస్మానియా యూనివర్సిటీకి మీరు రావడం ఎంత ధైర్యం అని ప్రశ్నించారని గుర్తుచేశారు. దీనికి కారణం తాము ప్రజల్లో ఉండటమేనని ఆ స్కాలర్‌కు తేలికగా సమాధానం చెప్పానని వివరించారు. కెసిఆర్‌పై ఎవరూ మాట్లాడలేని పరిస్థితుల్లో సిపిఎం ఒక్కటే మాట్లాడుతోందని, అందువల్లనే అందరూ పార్టీని విమర్శిస్తున్నారని వివరించారు. కెసిఆర్ కూడా అసెంబ్లీలో అనేక అవాకులు చెవాకులు పేలుతున్నాడని, అయినా పార్టీ అంటే భయం ఉందని అన్నారు.

బహుజన తెలంగాణా సాధనే లక్ష్యం

గత 4–7 తేదీల్లో నల్లగొండలో జరిగిన పార్టీ రెండో రాష్ట్ర మహాసభలో.. 'బహుజన తెలంగాణా' సాధించడమే తమ లక్ష్యం అని ప్రకటించామని తెలిపారు. బహుజన–లెఫ్ట్ ఫ్రంట్ అంటే.. అగ్రకులాధిపత్య అణచివేత, కార్పొరేట్ దోపిడీలో నలిగిపోతున్న దళిత, గిరిజన, మైనారిటీ, వెనుకబడిన తరగతుల ప్రజలతోపాటు, అన్నిరకాలుగా అణచివేయబడుతున్న అగ్రకుల పేదల కోసం పనిచేసేది అన్నదే తమ అభిప్రాయమన్నారు. అలా ప్రత్యామ్నాయ విధానంతో ఏర్పడినదే 'బహుజన–లెఫ్ట్ ఫ్రంట్' అన్నారు. ఈ కృషి ఒక్కసారితోనే రాలేదని.. ఇందుకు 'ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనా', 'మహాజన పాదయాత్ర', 'టి–మాస్', 'బహుజన–లెఫ్ట్ ఫ్రంట్' ఏర్పాటు అనే నాలుగు దశలు దాటాల్సి వచ్చిందన్నారు. తెలంగాణా వచ్చాక అన్నీ వస్తాయని ప్రజలు ఆశించారని, వ్యవసాయం, ప్రాజెక్టులు, పరిశ్రమలు, విద్య, వైద్యం, ఉపాధి కల్పన వంటి విషయాల్లో తామేం చేసేది ఒక ప్రత్యామ్నాయ డాక్యుమెంట్ తయారు చేశామని, దాన్ని ప్రజలకు చేరవేయడానికే 'మహాజన యాత్ర' నిర్వహించాల్సి వచ్చిందని అన్నారు. యాత్రకు భయపడిన కెసిఆర్ భగ్గుమని లేచాడని, యాత్రను ఏ ఊళ్లోకీ రానీయొద్దని ప్రజలను, టిఆర్ఎస్ పార్టీ వారిని రెచ్చగొట్టాడని గుర్తు చేశారు. అయినా యాత్రను నిర్వహించామని, తమ తలలను తీసేస్తే.. మొండాలతో చేస్తామని కెసిఆర్‌కు సవాల్ విసిరామని, యాత్రను ఆపలేకపోయాడని వివరించారు.

హైదరాబాద్ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయండి

ఈ పరిస్థితుల్లో ఈసారి సిపిఎం అఖిల భారత మహాసభ హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నామని, దేశ సమస్యలతోపాటు తెలుగు రాష్ట్రాల్లో ప్రజల సమస్యలపై చర్చిస్తుందని, సుందరయ్య కలలుగన్న రాజ్యం రావాలనే లక్ష్యంతో క్షేత్రస్థాయి వరకూ మహాసభల ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు. మహాసభలకు జనాన్ని ప్రభంజనంలా కదిలించాలని ఆంధ్రప్రదేశ్ నుంచి కూడా పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ మహాసభ దిగ్విజయం కావాలని, రానున్న మహా పోరాటాలకు నాంది పలకాలని కోరారు.

ఉద్యమాలకు ఊపు

ప్రభుత్వ తీరుతో ప్రజల్లో అసహనం • కార్యదర్శి నివేదికపై చర్చ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి– పర్స సత్యనారాయణనగర్(భీమవరం)

నిర్బంధాలు ఎన్ని ఎదురైనా వెరవకుండా ప్రజా సమస్యలపై నికరంగా పోరాడ్డం వల్లే ప్రజల్లో పార్టీ పలుకుబడి పెరుగుతోందని సిపిఎం మహాసభలో వివిధ జిల్లాల నుండి ప్రసంగించిన ప్రతినిధులు ఉద్ఘాటించారు. కార్యదర్శి ప్రవేశపెట్టిన రాజకీయ నిర్మాణ నివేదికపై రెండోరోజు మహాసభలో జరిగిన చర్చలో పాల్గొన్న వివిధ జిల్లాలకు చెందిన ప్రతినిధులు పేర్కొన్నారు. అరెస్టులు చేసినా, అక్రమ కేసులు బనాయించినా ఏ మాత్రమూ వెరవకుండా నిర్వహించిన పోరాటాలు ప్రజల ఆదరాభిమానాలు విశేషంగా చూరగొంటున్నాయన్నారు. ఈ క్రమంలో ఉద్యమాలకు మరింత పదును పెట్టి ముందుకు తీసుకెళ్లాల్సి ఉందని చెప్పారు. కొన్ని జిల్లాల్లో నాయకత్వంపై 40 నుండి 50 కేసుల వరకూ బనాయించారని, తుందుర్రు లాంటి ప్రాంతాల్లో అయితే నాయకత్వాన్ని నెలరోజులకుపైగా జైల్లో ఉంచారని, అయినా వెనకడుగు వేయలేదని చెప్పారు. ఫలితంగా అక్కడ సిపిఎం పట్ల గౌరవం పెరిగిందని చెప్పారు. సమస్య పరిష్కారం అవ్వాలంటే సిపిఎం నాయకులు రావాల్సిందేననే పరిస్థితి రాష్ట్రంలో వచ్చిందంటే పార్టీ నిర్వహించిన పోరాటాలే కారణమని చెప్పారు. గుంటూరు జిల్లా పెదగొట్టిపాడులోనూ దళితులపైదాడి జరిగిన సమయంలో పార్టీతో సంబంధం లేకపోయినా వెళ్లి పోరాటం నిర్వహించడం ద్వారా సమస్యను వెలికితీసుకొచ్చామని, అరెస్టులు చేసినా నాయకత్వ వెనక్కు తగ్గలేదని తెలిపారు. వంశధారలో ఇళ్లను కూల్చివేశారని, అయినా అక్కడి ప్రజలు వెనకడుగు వేయకుండా ముందుకు వెళ్లారంటే అక్కడ పార్టీ నిర్వహించిన పాత్రే కారణమని శ్రీకాకుళం ప్రతినిధి చెప్పారు. పోలీసులు కేసులు పెట్టారని, రాత్రి ఇళ్లపైబడి వేధింపులకు దిగారని, అయినా అక్కడి ప్రజలకు సిపిఎం నాయకత్వం ఇచ్చిన స్ఫూర్తితో వెనకడుగు వేయకుండా ముందుకు వెళ్లారని చెప్పారు. భోగాపురంలోనూ అక్కడి ప్రజలు కదిలొచ్చారన్నారు. పశ్చిమగోదావరి జిల్లా తుందుర్రులో అక్వా ఫుడ్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా నిర్వహించిన పోరాటం వల్ల అక్కడ పార్టీపై నమ్మకం పెరిగిందని అన్నారు. సిపిఎం ఇచ్చిన స్ఫూర్తితో మూడేళ్ళ పోరాటం అక్కడి ప్రజల్లో పార్టీ పట్ల నమ్మకాన్ని కలిగించిందని, చెరువుల కాలుష్యంపైనా పెద్దఎత్తున పోరాటాలు నిర్వహించామని తూర్పు కృష్ణా ప్రతినిధులు హరిబాబు, వై.నరసింహారావు చెప్పారు. స్థానికంగా నిర్వహించిన పోరాటాల వల్ల పెద్దఎత్తున ప్రజల్లో ఉద్యమాల్లోకి వస్తున్నారని ప్రకాశం జిల్లా ప్రతినిధులు కొండారెడ్డి, పి.వి.శేషయ్య తెలిపారు. దేవరాపల్లి ఉద్యమం దళితులకు ఆత్మస్థైర్యాన్ని ఇచ్చిందని చెప్పారు. సాలూరు, పార్వతీపురం ప్రాంతాల్లో నిర్వహించిన ఉద్యమం గిరిజన యువతను పార్టీ వైపు ఆకర్షించిందని పార్వతీపురం ప్రతినిధి రెడ్డి శ్రీరామ్మూర్తి తెలిపారు. పోలవరం నిర్వాసితుల విషయంలో ఏజెన్సీ గిరిజనులకు, ప్లెయిన్‌ల్యాండ్ గిరిజనులకు మధ్య గొడవ పెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, దీన్ని నివారించి వారికి న్యాయం చేయాలని పోరాటం నిర్వహించామని పశ్చిమ గోదావరి పశ్చిమ ప్రతినిధి ఎ.రవి తెలిపారు. అగ్రిగోల్డ్ విషయంపై పోరాటాలు నిర్వహించాల్సి ఉందని కడప ప్రతినిధి శివకుమార్ తెలిపారు. రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా కాకినాడ జిల్లాలో పార్టీ నాయకత్వంపై పోలీసు పెత్తనం సాగిందని, ఇంట్లో నుండి బయటకు వస్తే కేసు అనేలా చేశారని కాకినాడ పార్టీ ప్రతినిధి శ్రీనివాస్ తెలిపారు. సంక్షేమ పథకాలకు జన్మభూమి కమిటీలు అడ్డుగా మారాయని నెల్లూరు ప్రతినిధులు అజయ్ కుమార్, యాదగిరి తెలిపారు. అలాగే కృష్ణపట్నం పరిధిలో కంపెనీ యువతకు నెలవారీ జీతాలిచ్చి ప్రజా ఉద్యమాలపై ఎదురు దాడికి దిగేందుకు, పోరాటాలు అణచివేసేందుకు నియమించిందని తెలిపారు. ప్రజల్లో పార్టీ పట్ల నమ్మకం కలిగించి అనంతపురం ప్రతినిధులు యమున, , దిల్‌షాద్ నల్లప్ప మాట్లాడుతూ అనేక సామాజిక, భూ ఉద్యమాలు పార్టీ ప్రతిష్టను పెంచాయని పేర్కొన్నారు.

...గా అలుపెరుగకుండా పోరాడుతున్నారని పశ్చిగోదావరి జిల్లా డెల్టా ప్రతినిధి కళ్యాణి, కేతా గోపాలన్ తెలిపారు. అక్కడ పార్టీతో సంబంధం లేకపోయినా ఆరేటి సత్యవతి అనే మహిళను అరెస్టు చేసి జైల్లో పెట్టారని, ప్రతి ఒక్కరిపైనా ఏదోఒక కేసు బనాయించారని, అయినా వారందరూ వెనకడుగు వేయకుండా పోరాడుతున్నారంటే దానికి సిపిఎం నాయకత్వం ఇచ్చిన ప్రోత్సాహమే కారణమన్నారు. చిత్తూరు జిల్లాలో మహాభారతం విషయంలోనూ నిర్వహించిన పోరాటం దళితుల్లో పార్టీ పట్ల నమ్మకాన్ని బలోపేతం చేసిందని చిత్తూరు జిల్లా ప్రతినిధి నాగరాజు తెలిపారు. ఈ విషయంలో వైసిపి, తెలుగుదేశం నాయకత్వం మొత్తం కలిసి దళితులను మహాభారతంలో పాల్గొనకుండా చేసేందుకు ప్రయత్నించారని చెప్పారు. ఏజెన్సీ ప్రాంతంలో మావోయిస్టుల దాడుల నుండి తట్టుకుంటూ పార్టీని నడిపిస్తున్నామని తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి మూర్తి తెలిపారు. ఏజెన్సీలో పోలవరం వల్ల మునిగిపోతున్న గిరిజనులకు న్యాయం చేయాలని భద్రాచలం ఎమ్మెల్యే సున్నం రాజయ్య, జిల్లా కార్యదర్శి చేస్తున్న పాదయాత్రను పోలీసులు అడ్డుకున్నారని, ఆ సమయంలో గన్‌మెన్‌ను వెనక్కు పంపించి రాజయ్య పాదయాత్ర కొనసాగించారని తెలిపారు. అన్యాయమైపోతున్న గిరిజనుల పట్ల పార్టీ నిబద్ధత అలాంటిదని చెప్పారు. చింతూరులో 34 గంటల నిరాహారదీక్ష చేశామని తెలిపారు. విజనగరంలో భూములు లాక్కోవడానికి వ్యతిరేకంగా నికరమైన పోరాటం నిర్వహిస్తున్నామని జిల్లా ప్రతినిధి రెడ్డి శంకర్ వివరించారు. విశాఖ ఏజెన్సీలోనూ మావోయిస్టులనుండి పార్టీ నాయకత్వానికి హెచ్చరికలు వస్తున్నాయని, వారిని తట్టుకుంటూ ఏజెన్సీలో పోరాటాలు నిర్వహించాల్సి వస్తోందని విశాఖ ప్రతినిధి కోటేశ్వరరావు తెలిపారు. అయినా మావోయిస్టులు నాయకత్వాన్ని పట్టుకుని వేధింపులకు దిగుతున్నారని చెప్పారు. సిపిఎం ద్వారానే భూపోరాటాలు నిర్వహించగలమనే అభిప్రాయం కర్నూలు జిల్లా ప్రజల్లో వచ్చిందని ప్రతినిధి గౌస్‌దేశాయ్ పేర్కొన్నారు. నకిలీ విత్తనాల బారిన పడ్డరైతుల తరుపున పోరాడి వారికి నమ్మకం కలిగించామని పశ్చిమ కృష్ణా ప్రతినిధులు విష్ణువర్ధన్, నరసింహారావు చెప్పారు. అలాగే పశ్చిమ కృష్ణా ప్రాంతంలో దళితుల సమస్యలపై చేసిన


శ్రీనివాస్ (శ్రీకాకుళం) శివకుమార్ (కడప)


శంకరావు (విజయనగరం) వెంకటేశ్వర్ (కర్నూలు తూ.)



జోగినాయుడు (విశాఖ.అ) శ్రీనివాస్,(కాకినాడ)


వెంకట్, మూర్తి (రాజమండ్రి)


కల్యాణి, గోపాలం (ప.గో. డెల్టా)


హరిబాబు, నరశింహారావు (కృష్ణా తూర్పు)


విష్ణు, శ్రీనివాస్ (కృష్ణా పశ్చిమ)


నాగరాజు (కర్నూలు) దిల్‌షాద్ (హిందూపురం)


నల్లప్ప, యమున (అనంతపురం)


నేతాజ (గుంటూరు తూ.) రాధా కృష్ణ (గుంటూరు ప.)


పుల్లయ్య (తిరుపతి) వెంకటయ్య (చిత్తూరు)


గౌస్‌దేసాయ్ (కర్నూలు) శేషయ్య (ప్రకాశం ప.)


యాదగిరి, అజయ్ (నెల్లూరు)


కొండారెడ్డి, హనుమంతరావు (ప్రకాశం తూ.)

వామపక్ష ప్రజాతంత్ర ప్రత్యామ్నాయం


మహాసభలో తీర్మానాన్ని ప్రవేశ పెడుతున్న ఎంవిఎస్ శర్మ

(మొదటిపేజీ తరువాయి)

సాధించడంలో టిడిపి ఘోరంగా విఫలమైంది. రాష్ట్రం వెనుకబాటుకు టిడిపీ, బిజెపీలు బాధ్యత వహించాలి.

సామాన్య రైతుల భూములను, అసైన్డ్ భూములను బలవంతంగా గుంజుకొంటోంది. కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నది. భూ వినియోగ విధానం ఉపాధిని పెంచేదిగా లేదు. కరువు ప్రాంతాలకు, వెనుకబడ్డ ప్రాంతాలకు సాగునీరు, ప్రజలందరికీ తాగునీరు అందించే సమగ్ర నీటి విధానమూ ప్రకటించలేదు. విభజన నాటితో పోల్చితే నికర సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. వ్యవసాయ పంటల ధరలు పడిపోతున్నాయి. రుణమాఫీ అపసవ్యంగా అమలవుతోంది. రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. వ్యవసాయ కార్మికులు, వృత్తిదారులు ఉపాధిలేక వలసలు పోతున్నారు. చంద్రబాబు ప్రభుత్వం పెట్టుబడులను ఆకర్షించే పేరుతో విదేశీ కార్పొరేట్ కంపెనీలకు అంతులేని రాయితీలనిస్తున్నది. పారిశ్రామిక రంగంలో మూసివేతలు పెరుగుతున్నాయి. కార్మిక హక్కులను కాలరాసే చట్టాలు చేసింది. విద్యా, వైద్యం రంగాల్లో కార్పొరేట్లకు అండగా నిలుస్తోంది. రాష్ట్ర ఆదాయ వనరులు తగ్గుతున్నాయి. రుణభారం విభజననాటితో పోల్చితే రెట్టింపైంది. ఉపాధి కల్పన నామమాత్రంగా ఉంది. విద్యా, వైద్యం, మానవాభివృద్ధి సూచికలలో రాష్ట్రం బాగా వెనకబడి వుంది. ఇసుక, మైనింగు, నీరు, భూమి లాంటి ప్రకృతి వనరులను అక్రమార్గంలో కొల్లగొట్టుతోంది. టిడిపి పాలనలో అగ్రకుల దురహంకార దాడులు, దళిత, ఆదివాసీ, బలహీనవర్గాలపై పెరుగుతున్నాయి. మహిళా సాధికారత మాటలకే పరిమితమైంది. గిరిజన హక్కులకు రక్షణ కరువైంది. దళితులపై, మహిళలపై సాగుతున్న దాడులను, అత్యాచారాలను, నేరాలను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైంది. పై నుండి కింది దాకా అవినీతి విచ్చలవిడిగా సాగుతోంది. లంచం లేనిదే ఏపనీ కావడం లేదు. అధికారంలో ఉన్న పెద్దలు తమ అనుయాయులకే రాయితీలు వర్తించేలా పక్షపాతంతో వ్యవహరిస్తున్నారు. జన్మభూమి కమిటీల ఇష్టారాజ్యంగా సాగుతోంది.

ప్రభుత్వం ప్రజా ఉద్యమాల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తోంది. 144 సెక్షన్, పోలీసు యాక్ట్ 30ని నిరంతరం ప్రయోగిస్తున్నారు. ముందస్తు అరెస్టులు, అక్రమ కేసులు మితిమీరుతున్నాయి. బాధితులపై కేసులు, అక్రమ అరెస్టులు సాగుతున్నాయి. అక్రమార్కులకు రక్షణ కల్పిస్తోంది. పాలకపక్షం విధానాలను ఎదిరించి ప్రజలకు అండగా నిలవాల్సిన ప్రధాన ప్రతిపక్షం వైఎస్సార్‌సిపి ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయడం లేదు. దేశానికి అత్యంత ప్రమాదకరంగా తయారైన బిజెపి పట్ల అస్పష్టంగా వ్యవహరిస్తున్నది. నవరత్నాల పేరుతో ఓట్లకోసం ప్రజాకర్షక వాగ్దానాలను గుప్పించడం తప్ప మౌళిక విధానాలలో వైఎస్సార్‌సిపికీ, ఇతర పాలక పార్టీలకూ తేడా లేదు. కాంగ్రెస్ పార్టీ విధానాలు కూడా వినాశకరమైనవే. రాష్ట్రంలో ఉన్న రాజకీయ పరిస్థితిని ఉపయోగించుకుని మతోన్మాద శక్తులు బలపడేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి.

ఈ పరిస్థితుల్లో ప్రజలకు అండగా నిలిచి, అభ్యుదయ, ప్రజానుకూల, లౌకిక విధానాలతో ప్రజలకు ఊరట కలిగించగలిగే ప్రత్యామ్నాయం నేటి తక్షణ అవసరం. రాష్ట్ర వ్యాపిత కార్మికవర్గ, ఉద్యోగ వర్గాల పోరాటాలు, భూమి కోసం, పునరావాసం కోసం, సామాజిక న్యాయం కోసం జరుగుతున్న ఉద్యమాలు, ఉపాధికై ఉద్యమిస్తున్న యువత, మద్య నియంత్రణ ఉద్యమం, ప్రాంతీయ అసమానతలపైన జరిగే ఆందోళనలు, ప్రత్యేకహోదా కోసం, విభజన హామీల అమలు కోసం జరుగుతున్న సమైక్యకృషి వామపక్ష, ప్రజాతంత్ర, సామాజిక శక్తుల ఐక్యతకు అనువైన వాతావరణాన్ని ఏర్పరుస్తున్నాయి.

తెలుగు ప్రజల సమైక్యతకోసం నిలిచిన కమ్యూనిస్టు ఉద్యమం, జమీందారీ వ్యతిరేక పోరాటం మొదలు నయా ఉదారవాద విధానాలను ప్రతిఘటించిన విద్యుత్ ఉద్యమం వరకు, చుండూరు, కారంచేడు, నీరుకొండ మొదలు ఎస్సీ కమిషన్, సబ్‌ప్లాన్ కోసం సాగిన పోరాటం, తాజాగా గరగపర్రు, దేవరపల్లి, గొట్టిపాడు,


తీర్మానాన్ని బల పరుస్తున్న ప్రభాకరరెడ్డి

మహాభారతం ఉత్సవాల వరకూ సాగిన సామాజిక ప్రతిఘటనోద్యమాలు, గిరిజనోద్యమాలు, వామపక్ష ప్రజాతంత్ర శక్తులకు సంక్రమించిన వారసత్వం.

ఈ ప్రాతిపదికగా రాష్ట్రంలోని వామపక్ష పార్టీలను, వామపక్ష భావాలుగల వ్యక్తులను, వర్గ, ప్రజా శక్తులను, సామాజిక, అభ్యుదయ సంస్థలను, శక్తులను ఒకే వేదికపైకి సమీకరించేదానికి అవకాశాలు న్నాయి. నయా ఉదారవాద విధానాలను, మతోన్మా దాన్ని కుల దురహంకార శక్తులను, నిరంకుశ విధా నాలను ప్రతిఘటించే వారినందరినీ ప్రత్యామ్నాయ కార్యక్రమం చుట్టూ సమీకరించాలి. ప్రస్తుత రాష్ట్ర పరిస్థితులలో ఇదే సరైన మార్గం.అటువంటి వామపక్ష ప్రజాతంత్ర కార్యక్రమానికి లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, సామాజిక న్యాయం, వికేంద్రీకరణతో అన్ని ప్రాంతాల, అన్ని వర్గాల, తరగతుల ప్రజల సమగ్రాభివృద్ధి – లక్ష్యాలుగా వుంటాయి.

వామపక్ష, ప్రజాతంత్ర కార్యక్రమం

- రాష్ట్రానికి ప్రత్యేకహోదా సాధన–వెనకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల అభివృద్ధికి, ఆయా ప్రాంతాల ప్రజల ఆకాంక్షలకనుగుణంగా ప్రత్యేక ప్రణాళిక–విభజన చట్టంలోని హామీల అమలు, కేంద్రం నుండి నిధుల సాధన
- రాయలసీమ, ఉత్తరాంధ్ర, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని కరువు ప్రాంతాలకు నీటి ప్రాజెక్టులను పూర్తిచేయడానికి ప్రాధాన్యత
- విశాఖ ఉక్కుకు స్వంత గనుల కేటాయింపు, కెజిబేసిన్ గ్యాస్ రాష్ట్రంలో వాటా సాధన, విద్యుత్ ఉత్పత్తికి, ఎరువుల ఉత్పత్తికి కేటాయింపు. డిసిఐ ను ప్రయివేటీకరించరాదు.
- జ్యూట్, ఫెర్రో ఎల్లాయిస్, చక్కెర కర్మాగారాలు, స్పిన్నింగు మిల్లులు, ఇతర మూతబడ్డ పరిశ్రమలను తెరిపించడం–ప్రభుత్వ రంగానికి ప్రాధాన్యతనివ్వడం
- రైతులకు కనీస మద్దతు ధర గ్యారెంటీ చట్టం–రైతు రక్షణ నిధి ఏర్పాటు, రుణ మాఫీ, ప్రైవేటు రుణ నియంత్రణ చట్టం.
- కౌలు రైతులందరికీ కార్డులు, రుణాలు, ఇన్సూరెన్సు
- కార్మిక హక్కులను దెబ్బదీసే చట్టాల రద్దు, కార్మిక చట్టాలను అమలు చేసే యంత్రాంగం బలోపేతం–కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, గౌరవ వేతన కార్మికులకు ఉద్యోగ భద్రత, నెలకు రూ.18,000లు కనీస వేతనం. అందరికీ ఇఎస్ఐ, పిఎఫ్ అమలు
- కుల వివక్షత అంతం, దళితులకు, బలహీనవర్గాలకు సంపూర్ణ రక్షణ
- భూమి లేని నిరుపేదలకు కుటుంబానికి ఉచితంగా రెండు ఎకరాల భూమి–వ్యవసాయ కార్మికులకు సంవత్సరం పొడవునా పనులు, కనీస కూలి రోజుకు రూ.300లు అమలు–పేదలకు ఉచిత విద్యుత్, ప్రతి ఇంటికీ టాయిలెట్, మంచినీరు, గ్యాస్ సరఫరా
- చేతి వృత్తులకు రక్షణా చర్యలు–వృద్ధ చేనేత, గీత కార్మికులకు పెన్షను–వృత్తుల ఆధునీకీకరణకు సబ్సిడీ రుణాలు–బిసీలకు సబ్‌ప్లాన్
- మైనారిటీలకు రక్షణ, మతసామరస్యాన్ని కాపాడటం, సంక్షేమకార్యక్రమాలు, రిజర్వేషన్ల అమలు
- భూసేకరణ – పునరావాస చట్టం 2013 పక్కాగా అమలు
- ప్రతి కుటుంబానికి రేషన్ డిపోల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ, అందరికీ రేషన్ కార్డులు, ఆహార భద్రత చట్టం అమలు–అర్హులైన పేదలందరికీ ఉచితంగా పక్కా ఇళ్ళు–అర్హులందరికీ నెలకు రు.2500 పెన్షన్– కులాంతర వివాహం చేసుకున్న దంపతులకు రూ. రెండు లక్షలు–పుట్టిన ప్రతి బాలికకూ లక్ష డిపాజిట్
- ప్రభుత్వ ఉద్యోగాలలో ఖాళీల భర్తీ, పక్కాగా రోస్టర్ అమలు, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, ప్రైవేటు పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు.
- రూ.5000లు నెలకు నిరుద్యోగ భృతి
- కార్పొరేట్ విద్యా సంస్థల నియంత్రణ, ఫీజుల నియం త్రణ, ప్రయివేటు టీచర్లకు, లెక్చరర్లకు కనీస వేతనాలు
- ప్రభుత్వ విద్యకు 25% బడ్జెట్, ప్రభుత్వ యూనివర్శిటీలకు నిధులు–స్వయం ప్రతిపత్తి, ప్రభుత్వ విద్యా ప్రమాణాల మెరుగుదల విద్యా సంస్థలలో విద్యార్థి సంఘాలకు ఎన్నికలు, అవసరాలకు తగ్గ ఉపకారవేతనాలు
- కార్పొరేట్ వైద్య సంస్థల నియంత్రణ, ప్రభుత్వ వైద్య సంస్థల సేవలను మెరుగుపర్చడానికి ప్రత్యేక బడ్జెట్
- ప్రతి ఇంటికీ ఉచితంగా రక్షిత తాగునీరు
- ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌కు చట్టబద్ధత–ప్రభుత్వరంగంలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ–ప్రయివేటురంగంలోనూ రిజర్వేషన్ల అమలు–ఎస్సీ కార్పొరేషన్ ద్వారా యువతకు రుణాలు–పున్నయ్య కమీషన్ సిఫార్సుల అమలుకు గ్యారెంటీ–దళిత పేటలకు స్మశాన భూముల కేటాయింపు–అసైన్డ్ భూములకు రక్షణ–దళితులకు రక్షణ, దాడులకు పాల్పడ్డవారిపై కఠినచర్యలు–ప్రతి జిల్లాలో ప్రత్యేక న్యాయస్థానం
- గిరిజన జిల్లాల ఏర్పాటు, నాన్ షెడ్యూల్డ్ గ్రామాలను 5వ షెడ్యూల్‌లో చేర్చడం, గిరిజన యూనివర్శిటీ, 1/70 పటిష్టంగా అమలు
- మద్య నియంత్రణ – మండలానికి ఒకటే మద్యం దుకాణం, మున్సిపల్ వార్డు/ పంచాయతీ ఆమోదిస్తేనే అనుమతి
- మహిళల రక్షణకు ప్రత్యేక యంత్రాంగం–అత్యాచారాల కేసుల్లో సత్వర విచారణ, వెనువెంటనే శిక్షల అమలు ,మహిళా సాధికారత, జెండర్ బడ్జెట్ అమలు.
- మాతృభాషలో విద్యా బోధన, తెలుగుభాష పరిరక్షణ, ప్రాచీన భాషగా గుర్తింపుకు చర్యలు
- ప్రజాస్వామ్య లౌకిక సంస్కృతి పరిరక్షణ–శాస్త్రీయ భావాల వ్యాప్తి, మూఢ నమ్మకాలకు, అంధ విశ్వాసాలకు, దురాచారాలకు, ,పురుషాధిక్యతకు, ఫోనోగ్రఫీ వ్యాప్తికి వ్యతిరేకంగా చర్యలు
- అవినీతిరహితంగా ప్రభుత్వ పాలన, పారదర్శకంగా నిర్ణయాలు, పంచాయతీలకు, మున్సిపాలిటీలకు నిధులు, అధికారాలు –అభివృద్ధి వికేంద్రీకరణ ప్రణాళికలు
- రాష్ట్ర క్రీడా విధానం రూపకల్పన–అమలు, రాజకీయ జోక్యం లేకుండా క్రీడా సంఘాల నిర్వహణ.
- రాష్ట్రంలో పౌర హక్కులకు సంపూర్ణ గ్యారంటీ, సమాచార హక్కు, భావప్రకటనా స్వేచ్ఛకు గ్యారంటీ
- వేగంగా విస్తరిస్తున్న పట్టణాల్లో పౌరులందరికీ కనీస సౌకర్యాలు, పారిశుద్యం, మంచినీరు, ట్రాఫిక్ తదితర సమస్యల పరిష్కారం

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి, సామాజిక న్యాయసాధనకు, యువత ఉజ్జ్వల భవిష్యత్తుకు, మహిళా సాధికారితకకు రాష్ట్రంలోని వామపక్ష, ప్రజాతంత్ర, అభ్యుదయ, సామాజిక, శక్తులన్నీ ఏకం కావాలని మహాసభ పిలుపునిచ్చింది.



అక్షరం

ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti

4 | విజయవాడ
సోమవారం 12 ఫిబ్రవరి 2018



సామ్యవాద పథమ్ము
సౌమ్యమైన విధమ్ము
సకల సౌఖ్యప్రదమ్ము
ఓ కూనలమ్మా ...

– ఆరుద్ర

వర్తమాన చిత్రంపై గళమెత్తిన జనకవనం

వర్తమాన సామాజిక చిత్రాన్ని భీమవరం జనకవనం కళ్ళకు కట్టింది. సమకాలీన జీవిత సమస్యలను వైవిధ్యభరితంగా తమ కవితల్లో గానం చేశారు కవులు. నేటి వ్యవస్థలో అమలు చేయబడుతున్న సామాజిక, ఆర్థిక విధానాల కారణంగా నలిగిపోతున్న ప్రజల గొంతును పట్టించింది భీమవరం జనకవనం. సిపిఎం 25వ మహాసభలను పురస్కరించుకుని భీమవరంలోని క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో ఫిబ్రవరి 4న జరిగిన జనకనం ఆద్యంతం ఉత్తేజభరితంగా సాగింది.

రాష్ట్రంలోని 10 జిల్లాల నుంచి హాజరై కవులు తమ స్వీయ కవితలను వినిపించారు. తెలుగునాట ప్రసిద్ధులైన రచయితల నుంచి ఔత్సాహిక రచయితల వరకూ ఈ జనకవనానికి హాజరై కవితాగానాన్ని ఆస్వాదించారు. ఆధునిక అభివృద్ధి ఫలాలు సామాన్య ప్రజల వరకూ చేరకుండా అడ్డుపడుతున్న పెట్టుబడిదారీ విధానాల నిజస్వరూపాన్ని కవులు తమ కవితల్లో చిత్రించారు. ఒకవైపు అత్యంత సాంకేతిక అభివృద్ధి కనపడుతున్నా అస్తవ్యస్త ఆర్థిక విధానాలతో దుర్భర దారిద్ర్యాన్ని సృష్టిస్తున్న వైనాన్ని ప్రశ్నించారు. ఒకపక్క సంపద కేంద్రీకరణ, మరోవైపు నిత్యావసరాలు తీర్చలేని పరిస్థితులను తమ కవితల్లో శక్తివంతంగా చాటారు. దేశంలో దీర్ఘకాలంగా అమలు చేయబడుతున్న ప్రజా వ్యతిరేక విధానాల కారణంగా క్షీణిస్తున్న మానవ విలువల పట్ల వేదన చెందడం కవితల్లో కనిపిస్తుంది.

రోజంతా జరిగిన జనకవనం ప్రారంభసభలో సాహితీస్రవంతి గౌరవ అధ్యక్షులు, ప్రముఖ రాజకీయ, సామాజిక విశ్లేషకులు తెలకపల్లి రవి జనకవనం తొలి ఉపన్యాసం చేశారు. ప్రజాకళల ద్వారా ఉద్యమాలకు ఊపిరి పోసిన చరిత్ర కవులకు ఉందని, మతతత్వం, మార్కెట్ శక్తులు బుసకొడుతున్న తరుణంలో కవులు, రచయితలు, కళాకారులపై బృహత్తర బాధ్యత ఉందని ఆయన అన్నారు. శాసనమండలి సభ్యులు వి.బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, ప్రజా కవిత్వం విస్తృతంగా రావల్సిన అవసరం ఉందన్నారు. సిపిఎం రాష్ట్రకమిటీ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో ప్రగతిశీల భావజాల వ్యాప్తి జరగాలని, మూఢత్వాన్ని, అంధ విశ్వాసాలను తిరిగి ప్రతిష్టించడానికి ప్రయత్నిస్తున్న మతోన్మాద శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కవులకు విజ్ఞప్తిచేశారు. ఆంధ్రప్రదేశ్ పండిత పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు గిరిరాజ్ మాట్లాడుతూ, జనకవనం వంటివి తెలుగు భాషా ఉన్నతికి తోడ్పడతాయని అన్నారు. సాహితీస్రవంతి రాష్ట్ర అధ్యక్షులు వొరప్రసాద్ మాట్లాడుతూ సామాజిక చైతన్యాన్ని పెంచే దిశగా రచనలు చేయడానికి జనకవనాలు స్ఫూర్తినిస్తాయని, ప్రజాకవుల్లో ఉత్తేజం నింపడానికి ఇటువంటి కార్యక్రమాలు తోడ్పడతాయని అన్నారు.



జనకవనానికి హాజరైన కవులు, రచయితలు



జనకవనం వేదికపై ప్రస్థానం ఫిబ్రవరి సంచికను ఆవిష్కరిస్తున్న దృశ్యం; వేదికపై ఎమ్మెల్సీ విఠపు బాల సుబ్రమణ్యం, తెలకపల్లి రవి, మంతెన సీతారాం, వొరప్రసాద్, గిరిరాజు, చీకటి దివాకర్

అనంతరం మూడు భాగాలుగా సాయంత్రం వరకూ జనకవనం జరిగింది. తొలిభాగంలో ప్రముఖ కవులు శిఖామణి, ప్రసాదమూర్తి, దాట్ల దేవదానం రాజు ఆత్మీయ సందేశాలను ఇచ్చారు. శాంతిశ్రీ, నూనెల శ్రీనివాసరావు, నాగాస్త్ర, మార్ని జానకిరాం జనకవనాన్ని నిర్వహించారు. భోజనానంతర విభాగంలో ఎస్ఆర్ పృథ్వీ, అద్దేపల్లి ప్రభు, గనారా, బొల్లోజు బాబా, సత్యాజీ, రెడ్డప్ప ధవేజి ఆత్మీయ సందేశాలు ఇచ్చారు. చింతాడ రామారావు, చైతన్య ప్రసాద్, చంద్రికారాణి జనకవనం నిర్వహించారు. చివరి విభాగంలో ప్రధాన ఆదినారాయణ, వి.శ్రీరామమూర్తి, సయ్యద్ సలార్, ర్యాలి శ్రీనివాసరావు, కడిమెళ్ళ వరప్రసాద్ ఆత్మీయ ప్రసంగాలు చేశారు. ఎవి రమణారావు, డిఆర్కె నాయుడు జనకవనం నిర్వహించారు. ఈ జనకవనంలో చదివిన కవితలతో త్వరలో కవితా సంకలనం వెలువడనుంది.

మొత్తం 75 మంది తమ కవితలను ఈ జనకవనంలో చదివారు. ఈ జనకవనం స్ఫూర్తితో కవులు మరిన్ని మంచి కవితలను రాస్తారని ఆశిద్దాం. ఈ కార్యక్రమంలో ప్రస్థానం, వంతెన, కవిసంధ్య సాహిత్య సంచికలు, మరో నాలుగు కవితా సంపుటాల ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో కూనపరాజు కుమార్, బివివి ప్రసాద్, రామశాస్త్రి, కలిదిండి వర్మ, రాపాక రాజీవ్ తదితరులు పాల్గొన్నారు. మహాసభల ఆహ్వాన సంఘం నిర్వహణలో జనకవనం విజయవంతంగా ముగిసింది.

నివేదిక

– వొరప్రసాద్

ఒక చెట్టు.. పగిలిన అద్దం

దారిపక్క ఏకాంతశోకంలా ఓ చెట్టు
దానికొమ్మకు వేలాడుతున్న పగిలిన అద్దం
వెళ్తూ వెళ్తూ ఆ అద్దాన్ని చూస్తే
ఏం కనిపించొచ్చు?

రాత్రంతా ఎడతెగక కురిసిన చీకటికి
గొడుగు పట్టిన గుడ్డముక్క కింద
వెలుగుతున్న ఒంటరి దీపమొక్కటి తప్ప
సౌకర్యమంటే తెలియని నగ్నజీవనం
ఈ చదును చేయబడ్డ మట్టి మీద
లిఖించిన బతుకు సంతకం కనిపిస్తుందా..?

వలతో కట్టిన దడిలో
జడివానకు నిలవలేక
రెక్కబలం లేని పక్షులు రాల్చిన
పింఛాల అంచున మొలిచిన కన్నీటి బిందువులు
ప్రతిబింబించే దు:ఖం కనిపిస్తుందా.. ?

రెండు తపేలాలు మూడు గిన్నెలతో
కాలాన్ని ఈదుతున్న ఆ కుటుంబం
ఓ పిడుగుపాటు విదిల్చిన విముక్తికి
భద్రతపై ఎక్కుపెట్టిన ప్రశ్నార్థకాల్లాంటి
దేహాల చెల్లాచెదురుతనం కనిపిస్తుందా..?

ఒకవేళ
ఇవేవీ కనిపించలేదూ అంటే
అద్దం తప్ప ఏ పగుళ్లూ కనిపించనట్టే..!

–పాయల మురళీకృష్ణ
94410 26977

రచనలకు ఆహ్వానం

ఈ పేజీలో ప్రచురణార్థం రచయితల నుంచి సాహిత్య వ్యాసాలను, సాహిత్య విమర్శలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలను కంపోజు చేసి పంపేవారు సాఫ్ట్ కాపీని, పిడిఎఫ్ని కలిపి పంపాలి. సమకాలీన రచనలపై విమర్శనాత్మక వ్యాసాలకు ప్రాధాన్యం ఉంటుంది. సమీక్ష కోసం పుస్తకాలను పంపేవారు రెండు కాపీలను పంపాలి. పుస్తకాలను, వ్యాసాలను కింది చిరునామాకు పంపాలి.

అక్షరం, ప్రజాశక్తి సాహిత్య పేజీ, ప్రజాశక్తి కార్యాలయం, ఎంబి విజ్ఞాన కేంద్రం, గవర్నరుపేట, విజయవాడ – 2.
prajasavvadi@gmail.com

గేయాలాపన పోటీ

సమకాలీన సమస్యలపై తాను రాసిన గీతాన్ని బాణీ కట్టి, సోలోగా కానీ, బృందంగా కానీ ఉత్తమంగా పాడిన వారికి నగదు బహుమతులు ఇవ్వనున్నట్టు రిటైర్డు అసిస్టెంటు పోస్టు మాస్టారు పి. పోలేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 23వ తేదీన భగత్సింగ్ వర్ధంతి సందర్భంగా తెనాలిలోని విజికె భవన్లో జరిగే సభలో ఈ గీతాన్ని ఆలపించాలని తెలిపారు. మొదటి బహుమతి రూ.5000, రెండో బహుమబతి రూ. 3000, మూడో బహుమతి రూ.2000 వెయ్యి చొప్పున రెండు ప్రోత్సాహక బహుమతులు ఉంటాయి. ఆ గీతం గురించి ప్రకటనకర్తను సంప్రదించవచ్చు.

– పి. పోలేశ్వరరావు
మొబైల్ నెం.9492664530.

19న పఠాభి శత జయంతి సభ

అభ్యుదయ కవి పఠాభి శతజయంతి ఉత్సవం ఈ నెల 19న యానాంలో జరుగుతుంది. భాషా సాంస్కృతిక శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సహకారంతో యానాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగుశాఖ, కవిసంధ్య సంయుక్త నిర్వహణలో 'పఠాభి సాహిత్యం – ప్రాసంగికత' అనే అంశంపై ఒకరోజు జాతీయ సాహిత్య సదస్సు నిర్వహిస్తున్నాం. డాక్టర్ అత్తలూరి నరసింహారావు, డాక్టర్ సీతారాం, అదృష్టదీపక్, వంశీకృష్ణ, డాక్టర్ వాడ్రేవు వీరలక్ష్మీదేవి, డాక్టర్ జోశ్యుల కృష్ణబాబు, దాట్ల దేవదానంరాజు, మధునాపంతుల సత్యనారాయణమూర్తి, డాక్టర్ వరుగు భాస్కర రెడ్డి తదితరులు వివిధ అంశాలపై పత్రాలు సమర్పిస్తారు. పఠాభి పరిశోధకులు డాక్టర్ శిఖామణి కీలక ప్రసంగం చేస్తారు. అతిథులు మల్లాడి కృష్ణారావు, జయరాజ్ దానియేల్, డి.సుబ్రహ్మణ్యేశ్వరరావు పాల్గొంటారు. సాయంత్రం 4 గంటలకు ప్రఖ్యాత రంగస్థల నటుడు డి.సూర్య ప్రకాశరావుతో హరిశ్చంద్ర కాటిసీమ ఘట్టం ప్రదర్శన ఉంది.

– కవి సంధ్య, యానాం


డాక్టర్ రాధేయ పురస్కారానికి కవితల ఆహ్వానం

డాక్టర్ రాధేయ గౌరవార్థం దోర్నాదుల సిద్ధార్థ, సుంకర గోపాల్, పెళ్లూరు సునీల్ ఏర్పాటు చేసిన డాక్టర్ రాధేయ జాతీయ పురస్కారానికి కవితలను ఆహ్వానిస్తున్నారు. ఏ ప్రాంతం తెలుగు కవులైనా తమ కవితలను పంపించొచ్చు. కవిత ఈ పురస్కారం కోసమే రాసిందై ఉండాలి. కవితలు సామాజిక స్పృహను కలిగి ఉండాలి. ఉత్తమ కవితకు రూ.2,116 నగదు, జ్ఞాపికతో సత్కారం ఉంటుంది. మరో ఇద్దరికి ప్రత్యేక బహుమతులను అందజేస్తారు. కవితలు చేరాల్సిన ఆఖరు తేదీ మార్చి 15, 2018. కవితలు ఈమెయిల్కు పంపించొచ్చు. మెయిల్ ఐడి. radheyakavithapuraskaram@gmail.com పోస్టల్ చిరునామా : దోర్నాదుల సిద్ధార్థ, వి.టి.ఎస్ క్వార్టర్స్, ముత్తూచారి పాలెం, పలమనేరు, చిత్తూరు జిల్లా – 517408.

– రాధేయ పురస్కార కమిటీ
949237 4787, 94926 38547, 94402 55647

అభ్యుదయ ఉత్తరాల గుత్తి

చరిత్ర



కలిసి కూచుని మాట్లాడుకుని, దేశదేశాల కవిత్వాలు చదువుకుని, తమ రచనలు కూడా ఒకరికి ఒకరు వినిపించుకుంటూ, ఒక రచయితల కూటమి తయారు కావడం, ఏ దేశంలోనైనా విశేషమైన సంగతి. అటువంటిది మన తెలుగు సాహిత్యంలో, విజయనగరంలో ఒక ఏడెనిమిది దశాబ్దాల కిందట జరగడం, ఆధునిక తెలుగు సాహిత్య నిర్మాణ దశాబ్దాల్లో , ఇరవయ్యో శతాబ్దంలో ఒక ముఖ్య సంఘటన. వీరు ఆరుగురూ సాహిత్యరంగంలో పేరు పొందారు. అందరిలోకీ పెద్ద పురిపండా అప్పలస్వామి, ఆలా వయసులో పెద్ద కావడం మూలాన చూస్తే, రోణంకి అప్పలస్వామి, శ్రీరంగం నారాయణబాబు, శ్రీరంగం శ్రీనివాసరావు, చాసో, ఆరుద్ర ... ఈ క్రమంలో వీరి పేర్లు వస్తాయి.

అరసం తొలిసభలు తెనాలిలో జరిగినా, ఆ సభల తీరుతెన్నులు, రచయితల సంఘ స్వరూప స్వభావాలు, తెనాలి నుంచి వచ్చిన చదలవాడ పిచ్చయ్య, విజయనగరంలోనే చాగంటి సోమయాజులు, సెట్టి ఈశ్వరరావులతో కలిసి సమాలోచన చేశారు. ఇది 1942 సంవత్సరం కాగా, అప్పటికే, తమ ఉద్యోగాల వెతుకులాట, జీవికకై కొత్త అవకాశాల కోసం, నారాయణ బాబు, శ్రీశ్రీ, ఆరుద్ర వేరే ఊళ్ళకు వెళ్ళడం తటస్థించింది. పిఠాపురం నుంచి నారాయణ బాబు, ఢిల్లీ నుంచి శ్రీశ్రీ, నార్త్ వెస్ట్ ఫ్రాంటియర్లోని రిసాల్పూర్, ఒక ఏర్ఫోర్స్ శిబిరం నుంచి ఆరుద్ర, 'చాగంటి సోమయాజులు, కస్పా, విజయనగరం' అని రాసిన తొలి ఉత్తరాలు 1940 నుంచే ఉన్నాయి. దాదాపు 1934–40 మధ్య విజయనగరం మిత్రబృందం, తమ విలువైన ఆదాన ప్రదానంలో పాల్గొంది. ఫ్రెంచ్, జర్మన్, ఇంగ్లీష్, బెంగాలీ తెలుగుభాషల గీతాలు ఇక్కడ ఘూర్ణిల్లుతున్నాయి. ఇక్కడినుంచే రోణంకి రాసిన సాంగ్ అండ్ లిరిక్స్, నారాయణబాబు రుధిరజ్యోతి, శ్రీశ్రీ మహాప్రస్థానం, చాగంటి సోమయాజులు కథలు రాగా, ఆరుద్ర చిన్న చిన్న గీతాలు రాస్తున్నాడు. తరువాత పురిపండా కవిత్వం 'పులిపంజా' కూడా రావడానికి జీవస్థానం విజయనగరం, అందులో చిన్నపల్లి వారి వీధిలోని చాగంటి వారి మేడ లేదా చాసో హవేలీ. వీరి ఉత్తరాలు, వీరి జీవనగతి సంకేతాలు, సాహిత్య సృజన విశేషాలకు అదనపు ఆధారాలు. కొన్ని వివాదాల్లో ఒకరిని ఒకరు అనుకున్న మాటలకు మౌలిక ఆధారాలు.

1940 నుంచి 1987దాకా రాయబడి, తరువాత ఒక మూడు దశాబ్దాలుగా ఇవి ఉన్నాయి. ఆ ఉత్తరాలు ఇప్పుడు చాసో కుమార్తె, చాగంటి తులసి పూనిక, కృషి వల్ల, మంచి ముద్రణా ప్రమాణాలు గల ఉత్తరాల దొంతిగా, సర్వ ఆధారాలతో బయటికి వచ్చాయి. వీటిని తెలుగు సాహిత్య లోకానికి, అశేష చదువరులకు అందచేస్తూ తులసి 'చాసో కాగితాల్లో దొరికిన ఈ ఉత్తరాలు చాసో, ఆయన మిత్రులు సాహిత్య సృజనకు చేసిన కృషీ, తపన, పరస్పర సహాయ సహకారాలూ, ప్రేమా, గౌరవాభిమానాలు, ప్రోత్సాహ ప్రోద్బలాలు, సమాజం పట్లా తమ రచనల పట్ల నిబద్ధత, దాని బాగోగుల చింతనా, రచనల ప్రచురణకు పడిన తంటాలు. మంచి దారులంట ప్రయాణించిన తీరుతెన్నులు, ఆనాటి వారి భాషా పలుకుబడులు, సరదా చమత్కారాలు, వెటకారాలు వారు సృష్టించిన తెలుగు సాహిత్య చరిత్రకు సాక్ష్యాలు. ఈనాటి యువ రచయితలకు మార్గ దర్శకాలు' అంటూ వారు 'కలిసి నడిచారు' అని చెప్పారు.

వీటిలో చాసోకి ఆరుద్ర రాసిన 14 ఉత్తరాలు, శ్రీశ్రీ రాసిన 12 ఉత్తరాలు, నారాయణ బాబు రాసిన 7 ఉత్తరాలు, కృష్ణశాస్త్రి రాసిన రెండు ఉత్తరాలు, జరుక్శాస్త్రి రాసిన నాలుగు ఉత్తరాలు, సోమసుందర్ రాసిన అయిదు ఉత్తరాలు ఉన్నాయి. ఇంకా ఇతర పెద్దలు, చాసోకి రాసిన వాటితో కలిపి, ఈ 330 పైచిలుకు పేజీలతో పుస్తకం తయారైంది. వీటిలో చాసో రాసిన స్పందనలు, కొన్ని ఉత్తరాలు కలిపి తొమ్మిది ఉన్నాయి. ఉత్తరాల ఒరిజినల్ స్కాన్ చేసి, తిరిగి మళ్ళా డిటిపిలో ఆ ఉత్తరాల్లోని విషయాన్ని అందిస్తూ, ఉత్తరాల్లో ప్రస్తావితం అయ్యే వ్యక్తులు, ప్రదేశాల పేర్లు, వేరే టిప్పణిగా అందించిన తులసి శ్రమ, ఈ సమగ్ర పుస్తకం చూస్తే మనకు తెలుస్తుంది.

ఈ ఉత్తరాలు ఒకరకంగా కొన్ని ప్రశ్నలు, కొన్ని జవాబులు, వీరి మధ్య ఏమి నడిచి ఉంటుందా, అనుకునే అనేకమంది సాహిత్యాభిమానులకు ఈ ఉత్తరాల ద్వారా, అప్పట్లోనే వీరి ప్రయోగశీలత బయటికి వస్తుంది. జాతీయ భావావేశ సంకేతాలు వాడుతూ అభ్యుదయ కవిత్వం రాయడం పట్ల ఏర్పడ్డ ఆలోచనలను మరొకసారి సమీక్షించుకోవల్సిన అవసరమూ కనిపిస్తుంది. నారాయణబాబు కవిత్వ వ్యక్తిత్వం, తన మరణానంతర కవితల సంపుటి 'రుధిర జ్యోతి' పట్ల సరికొత్త చూపు అవసరం అని కూడా తోస్తుంది. ఈ ఆరుగురూ, అలాగే సాహిత్యరంగంలో ఇతర హేమాహేమీల మధ్య ఉండే ఒక భావావేశ బంధుత్వం కళ్ళకు కట్టేలా కొన్ని ఉత్తరాలు ఉన్నాయి.

ఇప్పటికే దశాబ్దాల కిందటి పత్రికల్లో వివరణలూ, విసుర్లూ, వాదవివాదాలపై తమ దృష్టికోణాలు తెలిపినవారే అందరూ. అయినా, ఈ ఉత్తరాల్లో ఉన్న కొత్త కాంతులు, మన అవగాహన సమగ్రం కావడంలో తోడ్పడుతాయి. తన కథల గురించిన అభిప్రాయ పరంపరలో చాసో కూడా చురుగ్గా పాల్గొనడం చూస్తాం. అటువంటి భిన్నాభిప్రాయ పరంపరని ఆహ్వానించేవాడు కనుకనే, చాసో, 'మీ కథలపై సరైన విమర్శ వచ్చిందా' అన్న ప్రశ్నకు, 'లేదు సరైన విమర్శ రాలేదు' అని జవాబు చెప్పాడు. ముఖ్యంగా ఈ పుస్తకం సాహిత్య తీరుతెన్నులపై, వ్యక్తుల ప్రాధాన్యతలపై జరిగిన భిన్నాభిప్రాయ ప్రకటనకు ఎంత మౌలికమో, అలాగే, ఇదొక దస్తూరి భోషాణం కూడా. నారాయణబాబు, శ్రీ శ్రీ, ఆరుద్ర, చాసో, జరుక్ శాస్త్రి, తల్లావఝుల శివశంకర శాస్త్రి, కృష్ణశాస్త్రి, మునిమాణిక్యం నరసింహారావు, కెవి రమణారెడ్డి, కొడవటిగంటి కుటుంబరావు, పురాణం సుబ్రహ్మణ్య శర్మ, చదలవాడ పిచ్చయ్య, అవసరాల సూర్యారావు, సి.నారాయణరెడ్డి, వఝుల చిన సీతారామ స్వామి శాస్త్రి, ఎం.రామకోటి, జ్వాలాముఖి, ఎన్.ఎస్. ప్రకాశరావు, తంగిరాల వెంకట సుబ్బారావు, మానేపల్లి సత్యనారాయణ.. ఇలా సాహిత్య లబ్ద ప్రతిష్టులైన ఎందరివో చేతి రాతలు ఈ ఉత్తరాల పుస్తకం ద్వారా శాశ్వతంగా నిలిచిపోయాయి.

– రామతీర్థ
98492 00385


వెలివాడల మట్టి పరిమళాలు

దళిత సాహిత్యంలో కవిత్వం వచ్చినంతగా కథలు, నవలలు, ఆత్మకథలు రాలేదని చాలాకాలంగా సాహిత్య విమర్శకులు భావించారు. కవిత్వం, పాట అనేవి ఉద్యమ వాతావరణంలో ఒక రకమైన ఉద్వేగంతో వస్తాయనీ; నవల, కథ వస్తుపరమైన విస్త తితో నిలకడగా జీవితంలోని అన్ని పార్శ్వాలను తడుముతూ విశ్లేషణాత్మకంగా వస్తాయనీ భావిస్తారు. 1980, 90 దశకాల్లో ఉధృతంగా వచ్చిన దళిత కవిత్వం తర్వాత కొంత నెమ్మదించింది. అయితే దళిత సాహిత్యం క్రమంగా నవలలుగా, కథలుగా, ఆత్మకథలుగా చిక్కబడుతుందనవచ్చు. దళిత ఆత్మకథలు మరాఠీ భాషలో వచ్చినంతగా మరే ఇతర భాషల్లో రాలేదు.

తెలుగులో సత్యం శంకరమంచి 'అమరావతి కథలు', నామిని సుబ్రమణ్యం 'పచ్చనాకు సాక్షిగా', 'మిట్టూరోడి కథలు' మొదలైన గొలుసు కట్టు కథలు బాగా ప్రాచుర్యంలోకి వచ్చాయి. ఎండ్లూరి సుధాకర్ 'మల్లెమొగ్గల గొడుగు' నాగప్పగారి సుందర్రాజు 'మాదిగోడు', ఖదీర్బాబు 'దర్గామిట్ట కథలు', నక్కా విజయ రామరాజు 'భట్టిప్రోలు కథలు', 'మావూరి కథలు' వంటి పుస్తకాల్లో దళిత జీవితం తాలూకు మట్టి వాసనలు గుబాళిస్తాయి. వీటిలో ఆత్మకథలకు ఉండే లక్షణాలు కొంతమేర కనిపించినప్పటికీ వీటిని పూర్తిస్థాయి ఆత్మకథలు అనలేము. ఆత్మ కథలవంటి గొలుసుకట్టు కథల తరహాలో ఇండస్ మార్టిన్ రాసిన 'కటిక పూలు' కథా సంపుటి మంచి చేరికగా భావించవచ్చు.

ఈ దేశపు మూలవాసులు గర్వంగా 'మాది' అని చెప్పుకునే ఆది ద్రావిడ, ఆర్యేతర నాగరికత అయిన సింధూ నాగరికత (Indus Valley Civilization)ను తన ఇంటి పేరుగా మార్చుకుని దాని వారసత్వాన్ని గర్వంగా చాటుకున్నాడు ఇండస్ మార్టిన్. ఇండస్ రాసిన 'కటికపూలు'లో ఇరవైకి పైగా కథలున్నాయి. ఇందులో గుంటూరు జిల్లా పొన్నూరు ప్రాంతపు గత నలభై, యాభై ఏళ్ల దళిత జీవితం, వారి కష్టాలు, కన్నీళ్ళు, వెలివేతలు, ఊరుమ్మడి బతుకు, ఆనందాలు, విషాదాలు, వారి ఆచారాలు, సంప్రదాయాలు, నమ్మకాలు కళ్ళకు కట్టినట్టు చిత్రించాడు మార్టిన్. ఈ పుస్తకం తెరవగానే ముసురు పట్టిన మాలపల్లె, అందులో ఓ ఒంటి నిట్టాడి గుడిసె, అందులోంచి ఉడుకుతున్న గొడ్డు మాంసం కూరవాసన మన మనసుల్ని కమ్మేస్తుంది. పిల్లలకి ఇంత తిండి పెట్టడానికి, వారికి కాసింత మర్యాదకరమైన జీవితం ఇవ్వడానికి కిందా మీదా పడే ముప్పై, నలభై ఏళ్ళ ఇక్టోరియా మారాణి (జయమ్మ), ఆత్మగౌరవం కంటే తనకేదీ ముఖ్యం కాదని బెట్టుగా మొహమాటాన్ని పై కండువాగా వేసుకుని తిరిగే దళిత పురుషుడు మోషె, షెరాయి పైకి లాక్కుంటూ ఆగమాగంగా వాడంతా కలియదిరిగే పదేళ్ళ అబ్బాయి మార్టీనూ, అర లంగా, జాకెట్టూ, రెండు పిలకలు వేసుకుని అన్నని కొక్కిరిస్తూ అమ్మ చెంగు పట్టుకుని తిరిగే పెంకిపిల్ల కత్తిరీనూ (కాథరీన్), వీరికి తోడుగా చావుని చప్పరిస్తూ ఉండే ముసలి జేజి– ఇందులో ప్రధాన పాత్రలు. ఈ పాత్రలన్నీ రక్తమాంసాలతో నిజజీవితంలోంచి పుట్టుకొచ్చినవే! మార్టిన్ చెప్పినట్టు ఈ కథల్లో ఆటో బయోగ్రాఫికల్ ఎలిమెంట్ ఎక్కువ. అందుకే 'కటిక పూలు' కథలు ఫ్రెష్గా ఉండడమే కాకుండా ఇందులో దళిత జీవితం వాస్తవిక దృష్టితో కళ్ళముందు కదులాడుతుంది. పేరెంత కటికగా ఉన్నప్పటికీ ఈ పూలలో ఎండుచేపల కూరలాంటి దళిత సౌందర్యం (ఈస్తటిక్స్) తొణికిసలాడుతుంది.

ఈ కథల్లో మార్టిన్ గ్రామీణ కుల సమాజం పోకడలు, కుల వ్యవస్థలో దళితులకు పలు రూపాల్లో నిత్యం ఎదురయ్యే అవమానాలు వాటికి తోడు పేదరికం, వర్గపరమైన దోపిడీని సందర్భానుసారంగా చిత్రించాడు. పెత్తందారీ కులాల పేదరికం, అణగారిన వర్గాల పేదరికం ఒకటి కాదని, దళితుల పేదరికం చుట్టూ వేలాడే 'అలగాతనం', అమానవీయత ఎలా ఉంటుందో ఎరుకల కులస్తుడు మొగిలి వెంకటేశ్వర్లు వంటి పాత్రల ద్వారా చూపించాడు ఇండస్. కులతత్వం, దాని వికతరూపం గ్రామాల్లోని బడుల్లో, గుడుల్లో కాపుకాసి దస్తగిరి, మొగిలి వెంకటేశ్వర్లు వంటి మేధావులను చదువుకు దూరం చెయ్యడాన్ని 'సదువు కంపు', 'గూచ్ గూచ్' వంటి కథలు వాస్తవిక దష్టితో చూపిస్తాయి. దళితులు, ఆదివాసులు, మైనారిటీలు 'దేశద్రోహులు' అనే భావనకి పునాదులు పల్లెటూరి బడుల్లోనే పడతాయనడానికి మంచి ఉదాహరణ 'సదువు కంపు' కథ. దస్తగిరి అనే ముస్లిం అబ్బాయిని బ్రాహ్మణ టీచర్లు 'పాకిస్తాన్, నీ పిలక పీకిస్తాన్' అనే వ్యాఖ్యలతో పాటు అకారణంగా వారి మీద బెత్తం ఉపయోగించడం వల్ల మానసికంగా గాయపడిన వారి మేధస్సు, నేర్పరితనం మొక్క దశలోనే మాడి మసై పోవడాన్ని 'సదువు కంపు' కథ వివరిస్తుంది. ఎరుకల కులస్తుడు మొగిలి వెంకటేశ్వర్లు బడికి వెళ్తూనే బతుకుదెరువు కోసం అప్పుడప్పుడు పందుల పెంట ఏరుకు రావడం, సోది చెప్పడం వంటి పనులు చెయ్యడాన్ని ఇతరులు 'దాగూచ్' అంటూ హేళన చెయ్యడంతో ఆ అబ్బాయి ఆత్మన్యూనతకు గురై స్కూల్లో ఎవరితోనూ కలవలేక ఒంటరితనాన్ని అనుభవించడం 'గూచ్ గూచ్' కథలో చూస్తాం. పెత్తందారీ కులాల టీచర్లు, విద్యార్థులు వెలివాడల భాషని, యాసని చులకన చేసి వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడం అనేది గ్రామాల్లో పుట్టి, చదువుకున్న ప్రతి దళితుడి అనుభవంలోనూ ఉండేదే! దళిత విద్యార్థులను గేలి చెయ్యడానికి స్కూలు చాలదన్నట్టు ట్యూషన్లు కూడా వేదికలవుతాయి. ఈ పరిస్థితిని 'ముప్పియ్యారూ, డెబ్బీరొండూ' కథలో మార్టిన్ సహజంగా చిత్రించాడు.



సమీక్ష

దళితులపై జరిగే అత్యాచారాలు, హత్యలు, దళిత స్త్రీలపై అగ్రకుల పురుషులు సాగించే దౌర్జన్యం, వంచనలకు వారు పెట్టే 'ముద్దు పేర్లు' విచిత్రంగా వుంటాయి. 'కడుపు నొప్పి' కథలో దళిత స్త్రీని అగ్రకుల పురుషుడు లోబరుచుకుని చివరకు కష్టజీవి అయిన ఆమె భర్తను హతమార్చి, అతడు కడుపు నొప్పిని భరించలేక బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్టు కథ అల్లుతారు. ఈ పరిస్థితిని 'గూడెపు మనుషులు ఆసాముల బావుల్లో శవాలై తేలినప్పుడల్లా ఇలానే కడుపునెప్పి తాత్పర్యాలు చెబుతాయి వార్తా పత్రికలు' అని అసలు విషయం బయట పెడతాడు కథకుడు. ఇలా పేర్కొనదగ్గ కథలు ఎన్నో ఉన్నాయి. కృష్ణా, గుంటూరు జిల్లాల పెత్తందారీ కులాలు 'మాది యాస లేని భాష' అంటూ తమ భాషని అధికార భాషగా మార్చుకునే ప్రయత్నం చెయ్యడాన్ని మార్టిన్ ఈ పుస్తకంలో వీలున్నప్పుడల్లా కడిగి పడేశాడు. దళిత సంస్క తి, భాష, వారి పెళ్ళి, చావు, తిండీ తిప్పలు వంటి అంశాలను సహజంగా చిత్రించడంలో ఇండస్ మార్టిన్ ఓ Social Anthropologist మాదిరిగా కనిపిస్తాడు. తానొక పాస్టర్ గారి కొడుకైనప్పటికీ క్రైస్తవమతంలోని పరిమితుల్ని అంగీకరించడానికి వెనుకాడడు. తాను చదువుకున్న మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చినప్పటికీ అట్టడుగు నిరక్షరాస్యుల బిడ్డలాగ వారి బతుకు చిత్రాన్ని సహజంగా గీశాడు. ఇండస్ కథారచనలో కవిత్వం ఉంది, సున్నితమైన హాస్యం ఉంది, అన్నింటికీ మించి దళిత జీవితం పట్ల ప్రేమ, కన్సర్న్ ఉన్నాయి. ఈ కథల సంపుటి దళిత సాహిత్యాన్ని, తెలుగు కథా సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తుంది.


– డాక్టర్ చల్లపల్లి స్వరూప రాణి

చందేరి చీరకట్టు



అప్పటికీ ఇప్పటికీ తిరుగులేని చేనేత ఏదైనా ఉందంటే అది కచ్చితంగా చందేరి మాత్రమే. తేలికగా ఉండే జరీ జిలుగులతో, ఆకట్టుకునే రంగులతో, పెద్ద అంచులతో ఉండే ఈ చీరలు ఎలాంటి వారికైనా రాయల్ లుక్‌ను తీసుకొస్తాయి. పెళ్లిళ్లకి, సంప్రదాయ వేడుకలకే కాకుండా పార్టీలకూ వీటిని ధరిస్తే ప్రత్యేకంగా కనిపించటం ఖాయం.

మీ కోసం



వెల్లుల్లి రెబ్బలను పెనం మీద కొద్దిగా వేడిచేసి ఆ తరువాత ఒలిస్తే పొట్టు త్వరగా ఊడి వస్తుంది.

కలివిడిగా ఉందాం!

నలుగురితో గలగలా నవ్వుతూ మాట్లాడే వారికి సాధారణంగా స్నేహితులు ఎక్కువగా ఉంటారు. పార్టీలలో లేదా సామాజిక పరంగా వ్యక్తులు ఒక చోట చేరి మాట్లాడుకుంటారు. గలగలా మాట్లాడే లక్షణం ఉన్నవారు చుట్టూ ఉన్న వ్యక్తులను తమ మాటలతో ఆకట్టుకోగలుగుతారు. ఇతరులకు వినోదాన్ని పంచగలరు. వారి మాటలు ఎటువంటి పరిస్థితుల్లోనైనా ఉత్సాహాన్ని, శక్తిని పొందేలా చేస్తాయి. వీరిలో కమ్యూనికేషన్ సామర్థ్యం ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి వారు ఎన్నో ప్రయోజనాలను పొందగలుగుతారు.

సామాజిక అవగాహన: వారు ఎల్లప్పుడూ వ్యక్తులతో లేదా సోషల్‌మీడియాలో సామాజికంగా చురుకైనవారిగా ఉంటారు. ఇలా ఉండటం వల్ల కొత్త వ్యక్తులతో ఎక్కువ పరిచయమై, జీవితంలో అనేక కొత్త అనుభవాలు పొందగలుగుతారు.

త్వరగా అభివృద్ధి: ఇతరులతో పోల్చితే గలగలా మాట్లాడే వారు వారి వ్యక్తిగత, వృత్తి జీవితంలో త్వరగా వృద్ధి చెందుతారు. వారిలోని ఆత్మవిశ్వాసంతో ఇతరులను చాలా సులభంగా ఆకట్టుకోగలరు. చాలా తక్కువ సమయంలో మంచి పరిచయాలను ఏర్పరుచుకొని వారి లక్ష్యాలను సాధించగలుగుతారు.

విలువైన స్వభావం: తక్కువగా మాట్లాడేవారితో పోల్చితే వీరు తమలోని భావాలను చాలా సులభంగా ఇతరులకు వ్యక్త పరచగలరు. ఎవరితో అయినా సరే ఓపెన్‌గా మనస్ఫూర్తిగా మాట్లాడతారు. అందువల్ల ఈ విలువైన స్వభావం కలిగి ఉండటం వల్ల వీరు ఎప్పుడూ ప్రశాంతంగా ఉండగలరు. తమలోని భావాలను ఎదుటి వారితో అందంగా పంచుకుంటారు .


ఆరోగ్యంగా: మనస్ఫూర్తిగా మాట్లాడడం, తమలోని భావాలు వ్యక్త పరచడం వంటి రెండు లక్షణాలు వారి మనసును ప్రశాంతంగా ఉంచుతాయి. దాంతో శరీరంపై దుష్ప్రభావాలను చూపే ఒత్తిడి, టెన్షన్ తగ్గుతుంది. ఎవరైతే వారి గురించి వారే ఆలోచించుకుంటారో, ఇతరులతో మాట్లాడరో, నవ్వరో అటువంటి వారు త్వరగా అనారోగ్యం పాలవుతారు. మాట్లాడేవారు మాత్రం చురుకుగా, సంతోషంగా ఉంటారు.

వినోదం: నలుగురితో మాట్లాడేవారు అంత త్వరగా బోర్ చెందరు. వారి వద్ద ఇతరులతో పంచుకోవడానికి ఏదో ఒక విషయం ఉంటుంది. అందువల్ల వారు తమ స్నేహితుల చుట్టూ చేరి వారికి వినోదాన్ని పంచుతారు.



అయితే ఇలా నలుగురితో కలివిడిగా, నవ్వుతూ మాట్లాడేవారికి కొన్ని సమస్యలు కూడా ఉంటాయి. కనుక జాగ్రత్తగా ఉంటూ నలుగురితో వారి భావాలను పంచుకోవాలి. అలా చేస్తే వారూ సంతోషంగా ఉంటారు. వారి స్నేహితులను సంతోషంగా ఉంచుతారు. ★

యాక్టివా 5g



ఇప్పుడు 3g, 4g తరహాలో యాక్టివా 5g స్కూటర్ మార్కెట్‌లోకి రానుంది. యాక్టివా సిరీస్ మోడళ్లతో పోల్చుకుంటే యాక్టివా 5g స్కూటర్‌లో పెద్ద మార్పులేమీ జరగలేదు. చెప్పుకోదగిన మార్పుల్లో సరికొత్త పూర్తి స్థాయి ఎల్ఇడి హెడ్ ల్యాంప్, హెడ్ ల్యాంప్‌లో కలిసిపోయినట్లుగా కనిపించే ఇండికేటర్ పొజిషన్ లైట్లు ఉన్నాయి. హెడ్ ల్యాంప్, పొజిషన్ రెండూ ఎల్ఇడి లైట్లతో వచ్చిన భారతదేశపు మొదటి 110సీసీ స్కూటర్ ఇదే. ఇకపోతే ఆటోమేటిక్ హెడ్‌ల్యాంప్ ఆన్ ఫీచర్ సాధారణంగానే వచ్చింది. 4g తరహా 109.19సీసీ కెపాసిటి ఇంజన్‌ను ఇందులోనూ అందించింది. ఇది, 7,500ఆర్‌పిఎమ్ ఇంజన్ వేగం వద్ద 8బిహెచ్‌పి

పవర్, 5,500ఆర్‌పిఎమ్ వద్ద 9ఎన్ఎమ్ గరిష్ట టార్క్ ఉత్పత్తి చేస్తుంది. సివిటి ఆటోమేటిక్ గేర్‌బాక్స్ గల యాక్టివా 5g ఆటోమేటిక్ స్కూటర్‌లో 5.3–లీటర్ కెపాసిటిగల ఫ్యూయల్ ట్యాంక్ ఉంది. స్కూటర్ మొత్తం బరువు 108కిలోలు. కొలతల పరంగా చూస్తే పాత మోడల్‌లో ఎలాంటి మార్పులూ జరగలేదు. అదే 1,761ఎమ్ఎమ్ పొడవు, 710ఎమ్ఎమ్ వెడల్పు, 1,149ఎమ్ఎమ్ ఎత్తులో ఉంది. 153ఎమ్ఎమ్ గ్రౌండ్ క్లియరెన్స్, సీటు ఎత్తు 765ఎమ్ఎమ్‌గా ఉంది. హోండా యాక్టివా 5g స్కూటర్‌లో ముందు, వెనుక వైపున 10–అంగుళాల పరిమాణంలో ఉన్న అల్లాయ్ వీల్స్, రెండు చక్రాలకు 90/100 కొలతల్లో ఉన్న టైర్లు ఉన్నాయి. అంతే కాకుండా హోండా కాంబి బ్రేక్ సిస్టమ్‌గల 130ఎమ్ఎమ్ రెండు డిస్క్ బ్రేకులు ఉన్నాయి. ఇతర మార్పుల్లో చూసుకుంటే, స్కూటర్ ఎక్ట్సీరియర్‌లో అక్కడక్కడా క్రోమ్ సొబగులు, మెటల్ మఫ్లర్ ప్రొటెక్టర్‌తోపాటు డాజిల్ యెల్లో మెటాలిక్, పర్ల్ స్పార్టన్ రెడ్ రెండు కొత్త రంగుల్లో వచ్చింది. ఇందులో సరికొత్త 4–ఇన్–వన్ కీ కలదు. స్కూటర్ హ్యాండిల్ సైడ్ లాక్, ఇంజన్ ఆఫ్, ఆన్, సీట్ ఓపెన్‌తో సహా నాలుగింటింకి ఒకే కీ సిస్టమ్ అందించారు. ఫ్రంట్ హుక్, రిట్రాక్టబుల్ రియర్ హుక్ అందించారు. ధరలో ఎలాంటి మార్పులు చేయకుండా పాత ధరలకే సరికొత్త యాక్టివా 5g స్కూటర్‌ను తీసుకొచ్చే అవకాశం ఉంది. వచ్చే ఏడాది ప్రారంభం నాటికి మార్కెట్లోకి రానుంది. ★



జీవన సౌరభం

ధైర్యం లేకుంటే మనిషి ఏ రంగంలోను విజయం సాధించలేడు

అనాథ బాలికల డాక్టరమ్మ!

పదిమందికారు....ఇరవైమందికారు...ఏకంగా ఎనిమిదొందల మంది అనాథబాలికలకు అమ్మగా మారింది ఒక డాక్టరమ్మ. ఆమె పేరు సరోజిని అగర్వాల్. గత మూడు దశాబ్దాల నుంచీ ఆనాథ బాలికలను సంరక్షించి వారికి బతికే మార్గాన్ని చూపించడమే లక్ష్యంగా ఆమె ముందుకుసాగుతున్నారు. ఆమె ఆశయం వెనుకా ఓ విషాదముంది. లక్నోలో నివసిస్తున్న డాక్టర్ సరోజిని కూతురు మనీషా 30 ఏళ్ల కిందట రోడ్డు ప్రమాదంలో మతి చెందింది. అయితే అలాంటి స్థితిలో ఆమెకు ఏం చేయాలో తోచలేదు. జీవితమంతా నిస్సారమైట్లు భావించారు. ఎన్నో రోజులు మౌనంగా గడిపారు. కూతురు చనిపోయిందని గుండెల నిండా బాధ ఉన్నా దాన్నంతా దిగమింగారు.



నవమాసాలు మోసి, కని, పెంచిన బిడ్డను దురద ష్టవశాత్తూ కోల్పోవాల్సి వస్తే ఆ బాధ ఎలా ఉంటుందో ఆ బిడ్డను కన్న తల్లికే తెలుస్తుంది. సాధారణంగా ఏ తల్లి అయినా అలాంటి స్థితిలో ఉంటే ఇక మామూలు మనుషులు అవడం చాలా కష్టం. వారిని ఓదార్చడమూ కష్టమే. అయితే సరోజిని మాత్రం అలా కాదు. తన బిడ్డ దూరమైనా ఆ బాధను దిగమింగారు. ఆమె జ్ఞాపకాలు ఎప్పటికీ చెరిగిపోకూడదనే ఉద్దేశంతో, తల్లిదండ్రులు లేని అనాథ బాలికలను చేరదీసి వారిలో తన బిడ్డను చూసుకోవాలని, వారికి విద్యాబుద్ధులు నేర్పిస్తూ తమ కాళ్లపై తాము నిలబడేలా ప్రయోజకులను చేయాలని ఆమె ఓ నిర్ణయానికి వచ్చారు. వెంటనే తన నిర్ణయాన్ని అమలులో పెట్టేసారు. అనుకున్నదే తడవుగా తాను ఉంటున్న మూడు గదుల ఇంట్లోనే మనీషా మందిర్ పేరిట ఓ ఆశ్రమాన్ని నెలకొల్పారు. అందులో అనాథ బాలికలకు ఆశ్రయం ఇస్తూ వారికి విద్యాబుద్ధులు చెప్పిస్తున్నారు. అంతేకాదు, నైపుణ్యం ఉన్నవారి కోసం కంప్యూటర్ కోర్సులు, కుట్లు, అల్లికలు, చేతి వ త్తులు వంటి పనులను కూడా వారికి నేర్పిస్తున్నారు. దీంతో అటు విద్యా పరంగానే కాదు, ఆమె వద్ద పెరిగిన చాలా మంది మంచి మంచి ఉన్నత ఉద్యోగాల్లో రాణిస్తున్నారు. చాలా మంది స్వయం ఉపాధి పొందుతూ తమ కాళ్లపై తాము నిలబడ్డారు. ఈ క్రమంలో ప్రస్తుతం మనీషా మందిర్‌లో సుమారు 800 మంది వరకూ ఆశ్రయం పొందుతున్నారు. డాక్టర్ సరోజిని ఒక ప్రముఖ రచయిత్రిగా కూడా గుర్తింపు పొందారు. హృదయాన్ని స్పందింపజేసే వివిధ అంశాలపై కథలూ, కవిత్వం వ్యాసాలూ రాస్తుంటారు.



మొదట్లో ఆశ్రమం నిర్వహించడం డాక్టర్ సరోజినికి చాలా కష్టంగా ఉండేది. పెరుగుతున్న బాలికలకు అనుగుణంగా విశాలమైన గదులు, సౌకర్యాల కోసం ఆమె ఏడాదిలోనే మూడు నాలుగు సార్లు తాము ఉంటున్న భవనాలను మార్చారు. అయితే ఇప్పుడు అలా కాదు, తాము ఉంటున్న లక్నోకు సమీపంలోని గోంతి నగర్ అనే ప్రాంతంలో మూడు అంతస్తుల విశాలమైన శాశ్వత భవనంలోకి ఆశ్రమాన్ని మార్చారు. ఇది అక్కడ ఉంటున్న బాలికలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంది. అయితే ఆ ఆశ్రమంలో చదువుకుని పైకి వచ్చి మంచి ఉద్యోగాలు చేస్తున్న యువతులు కూడా తమ వంతు సహాయాన్ని ఆ ఆశ్రమానికి అందిస్తూ ఉంటారు. అక్కడ ఏటా ఆశ్రయం పొందుతున్న బాలికల సంఖ్య పెరుగుతోంది. ఇప్పుడు సరోజిని ఏమంటున్నారంటే “తననుంచి ఒక్క మనీషా దూరమైనా తనకు 800 మంది మనీషాలు ఇప్పుడు తోడున్నారని” అంటున్నారు. ఇక అక్కడి బాలికలు సరోజినిని ఏమని పిలుస్తున్నారో తెలుసా..? మదర్ థెరిస్సా అని అవును...వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్న ఆమె ఔదార్యాన్ని ఇంకెవరితో పోల్చగలరు. ★

ఎపి టెట్ ప్రాక్టీస్ పేపర్ -1



కె.ఎస్ లక్ష్మణరావు,
శాసనమండలి మాజీ సభ్యులు
సెల్ : 9440262072

MODEL QUESTIONS

పార్ట్ -1
చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాగి

1. విద్యార్థులు, ఉపాధ్యాయులను నైతికంగా ఆదర్శంగా తీసుకొని ప్రవర్తించాలంటే ఉపాధ్యాయుల ప్రవర్తన కోల్‌బర్గ్ 'నైతిక వికాస సిద్ధాంతం'లో ఈ స్థాయిలో ఉండాలి?
ఎ. అమూర్త సాంప్రదాయం
బి. సాంప్రదాయక
సి. ఉత్తర సాంప్రదాయక
డి. పూర్వ సాంప్రదాయక

2. బ్రూనర్ ప్రకారం, ఉపాధ్యాయుడు తరగతిలో విషయాన్ని ప్రభావవంతంగా బోధించాలంటే, సన్నద్ధత, విషయ నిర్మాణం, వరుసక్రమాలతోపాటు ఈ అంశం కూడా ముఖ్యంగా ఉండాలి?
ఎ. పునర్బలనం　బి. అవధానం
సి. ధారణ　డి. పునరుత్పాదకం

3. వ్యక్తి తన పరిసరాలతో జరిపే ప్రతిచర్యల ఫలితంగా..
ఎ. జన్యువులు రూపొందుతాయి
బి. సమజాతాలు రూపొందుతాయి
సి. మూర్తిమత్వం రూపొందుతుంది
డి. సహజ సామర్థ్యం రూపొందుతుంది

4. ఈ కింది వానిలో డిఫరెన్షియల్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో ఉపపరీక్ష కానిది?
ఎ. యాంత్రిక వివేచనం　బి. శాబ్దిక వివేచనం
సి. ప్రాదేశిక సంబంధాలు　డి. కళాత్మక సంబంధాలు

5. కింది అధ్యయన పద్ధతులలో 'వ్యక్తి నిష్టత' అధికంగా గల పద్ధతి?
ఎ. పరిశీలనా పద్ధతి　బి. వ్యక్తి అధ్యయన పద్ధతి
సి. ప్రయోగ పద్ధతి　డి. అంతఃపరీక్షణా పద్ధతి

6. విద్యార్థుల ప్రవర్తనా సమస్యలను పరిష్కరించడంలో వారికంటే ఎక్కువగా మాంత్రికుడి ప్రమేయము అధికంగా ఉండే మంత్రణం?
ఎ. అనిర్దేశిక మంత్రణం　బి. శ్రేష్టగ్రహణ మంత్రణం
సి. నిర్దేశక మంత్రణం　డి. జీవనగమన మంత్రణం

7. వ్యక్తిలో దీనివల్ల ఏర్పడే ప్రవర్తనా మార్పులను అభ్యసనంగా పరిగణించము?
ఎ. అనుభవం　బి. పరిపక్వత
సి. అనుకరణ　డి. శిక్షణ

8. వ్యక్తి పెరుగుదల, వికాసాలకు సంబంధించి సరైన దానిని గుర్తించండి?
ఎ. పెరుగుదల వికాసంలో లీనమై ఉంటుంది
బి. వికాసం, పెరుగుదలలు వ్యక్తి జీవితాంతం కొనసాగుతాయి
సి. వికాసం, పెరుగుదలలో వైయక్తిక బేధాలుండవు
డి. వికాసం, పరిమాణాత్మకం, పెరుగుదల గుణాత్మకం

9. దీనిని కేంద్రంగా చేసుకుని బోధనాభ్యసన ప్రక్రియ నిర్వహించాలని ఎన్‌సిఎఫ్-2005 సూచించింది.
ఎ. మూల్యాంకనా కేంద్రీకృతంగా
బి. ఉపాధ్యాయ కేంద్రీకృతంగా
సి. విద్యార్థి కేంద్రీకృతంగా
డి. విషయ కేంద్రీకృతంగా

10. ఎనిమిదో తరగతి చదువుతున్న సుధాకర్ మూర్తిమత్వ వికాసపరంగా తరచుగా ఈ కింది సంక్లిష్ట పరిస్థితిని అనుభవించును?
ఎ. తాదాత్మ్యం వర్సెస్ తాదాత్మ్య సంభ్రమం
బి. స్వయం ప్రతిపత్తి వర్సెస్ సిగ్గు
సి. చొరవ వర్సెస్ అపరాధం
డి. శ్రమశీలత వర్సెస్ న్యూనత

11. పద్మజ మూడో తరగతి చదువుతున్నది. ఆమెకు సెలవు దినంలో హోమ్‌వర్క్ చేయడం ఇష్టం ఉండదు. ఆమె ఆటలాడటానికి ఇష్టపడుతుంది. కానీ టీచరు తనను ఇష్టపడదనే భయంతో హోమ్‌వర్క్ చేయడంలోని ప్రేరణ?
ఎ. సాంఘిక　బి. బాహ్య
సి. అంతర　డి. సాధనా

12. ఉపాధ్యాయుడు తరగతిలో ఒక భావాన్ని కథారూపంలో చెప్పి అదే విషయాన్ని విద్యార్థులతో ఇతరులకు చెప్పించాడు. వారిలో దీనిని మాపనం చేయదలచాడు.
ఎ. పునరభ్యసనం　బి. వైఖరులు
సి. గుర్తింపు　డి. పునఃస్మరణ

13. క్రికెట్ ఆడటంలో విఫలమవుతున్న మిత్రుడిని గమనించిన ఒక వ్యక్తి అతనికి తగిన మెళకువను సూచించి రాణించేటట్లుగా సహాయం చేశాడు. ఇక్కడ జరిగిన అభ్యసనా బదలాయింపు?
ఎ. ప్రతికూల　బి. శూన్య
సి. అనుకూల　డి. ద్విపార్శ్వ

14. బోధన పట్ల విద్యార్థుల వైఖరిని దీని ద్వారా మాపనం చేయవచ్చు?
ఎ. నిర్ధారణ మాపనులు　బి. ఇంటర్వ్యూలు
సి. ప్రక్షేపక పరీక్షలు　డి. క్యుములేటివ్ రికార్డులు

15. విద్యార్థులలో సహాయ, సహకార ప్రవృత్తులను అధ్యయనం చేయడానికి ఒక నిర్దిష్ట, నియంత్రిత సన్నివేశంలో గమనించడం?
ఎ. సహజ పరిశీలన పద్ధతి
బి. వ్యక్తి అధ్యయన పద్ధతి
సి. పరివృచ్ఛ పద్ధతి
డి. నియంత్రిత పరిశీలన పద్ధతి

16. ఎబ్బింగస్ ప్రకారం, ఒక వ్యక్తి తాను నేర్చుకున్న దానిలో ఆరో రోజు చివరకు జరిగే విస్మృతి శాతం
ఎ. 50 శాతం　బి. 25 శాతం
సి. 60 శాతం　డి. 75 శాతం

17. నిరంతర సమగ్ర మూల్యాంకనం ప్రకారం 'ఒక విద్యా సంవత్సరంలో మూల్యాంకనం నిరంతరం జరపాలి' అనడంలో అర్థం?
ఎ. బోధనాభ్యసన ప్రక్రియకు ముందు, నిర్వహణ సమయంలో, తర్వాత
బి. బోధనాభ్యసన ప్రక్రియలో భాగంగా మాత్రమే
సి. బోధనాభ్యసన ప్రక్రియ పూర్తి అయిన తర్వాత మాత్రమే
డి. బోధనాభ్యసన ప్రక్రియ ప్రారంభంలో మాత్రమే

18. ఉపాధ్యాయుడు తన పాఠశాలలోని సహ ఉపాధ్యాయులతో సరైన సంబంధాలను నెలకొల్పుకోలేక, ఒత్తిడికి గురై, ఆ ప్రభావాన్ని తరగతిలో విద్యార్థులపై చూపించడం ద్వారా ఉపశమనం పొందడం...
ఎ. ప్రక్షేపణము　బి. విస్థాపనము



సి. దమనము　డి. ప్రతిగమనము

19. శివుడు ఈ దశలో తనకు కనిపించే అన్ని మూర్తభావనల గురించి పరిపరి విధాలుగా ప్రశ్నిస్తూ అన్వేషకుడిగా ప్రవర్తిస్తాడు.
ఎ. పూర్వ కౌమారదశ　బి. ఉత్తర బాలదశ
సి. పూర్వ బాల్యదశ　డి. యవ్వనారంభ దశ

20. ప్రాథమిక స్థాయిలో విద్యార్థి, తన ఉపాధ్యాయుని రాతపనిని గమనించి తాను అదే విధంగా రాయడాన్ని అలవర్చుకొన్నాడు. ఇందులో ఇమిడివున్న అభ్యసనా సిద్ధాంతం?
ఎ. యత్నదోష అభ్యసనం
బి. అంతర్‌దృష్టి అభ్యసనం
సి. సాంఘిక అభ్యసనం
డి. కార్యక్రమయుత అభ్యసనం

21. ఆర్‌టిఇ యాక్ట్, 2009 ప్రకారం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 200 కంటే ఎక్కువగా ఉన్నచో ప్రధానోపాధ్యాయుడు కాకుండా ఉపాధ్యాయుడు కాకుండా ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి దీనికి మించకుండా ఉండాలి?
ఎ. 1 : 20　బి. 1 : 30
సి. 1 : 35　డి. 1 : 40

22. 'విద్యనభ్యసించగల బుద్ధిమాంద్యత' పిల్లల ప్రజ్ఞాలబ్ది దాదాపుగా ఈ విధంగా ఉంటుంది?
ఎ. 50–70　బి. 1–20
సి. 20–39　డి. 30–50

23. రహీం తన పన్నెండు సంవత్సరాల వయస్సులోనే పదో తరగతిలో ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణుడైనాడు. అంటే అతని మానసిక వయస్సు, శారీరక వయస్సు కన్నా..
ఎ. ఎక్కువ　బి. తక్కువ
సి. సమానం　డి. అత్యల్పం

24. పియజె ప్రకారం ఈ కింది దశలో పిల్లలు సమస్యా పరిష్కారంలో ఒకే కోణంలో కాకుండా భిన్నకోణాలలో ఆలోచించడం, మానసిక ప్రాక్కల్పనలను పరీక్షించడం ద్వారా పరిష్కరిస్తారు?
ఎ. ఇంద్రియ చాలక దశ
బి. మూర్త ప్రచాలక దశ
సి. అమూర్త ప్రచాలక దశ
డి. పూర్వ ప్రచాలక దశ

25. దీని ప్రకారం పిల్లలు తమ ప్రపంచాన్ని అన్వేషించి, అనుభవాల ద్వారా అభ్యసనాన్ని గావిస్తారు. కాని బహుమతులు, పునర్బలనాల ద్వారా కాదు. ఇది..?
ఎ. ప్రవర్తనా వాదం　బి. సంజ్ఞానాత్మక వాదం
సి. సంసర్గ వాదం　డి. మనోవిశ్లేషణ

26. ఉపాధ్యాయుడు, బోధనాభ్యసన ప్రక్రియ జరుపుటకు ప్రణాళికలు తయారుచేయడం ఈ బోధనా దశకు చెందుతుంది?
ఎ. ప్రతిచర్యాత్మక　బి. సరస్పర చర్యాత్మక
సి. ఉత్తర చర్యాత్మక　డి. పూర్వ చర్యాత్మక

27. ప్రభావవంతమైన బోధన, శిక్షణ, ఇతర సదుపాయాలు కల్పించినప్పటికీ పరిపక్వత లేని కారణంగా విద్యార్థిలో అభ్యసన జరుగలేదు. దీనిని వివరించే అభ్యసన సూత్రం?
ఎ. పునర్బలనం　బి. అభ్యాస
సి. ఫలిత　డి. సంసిద్ధత

28. ఐదోతరగతి పరిసరాల విజ్ఞాన బోధనాభ్యసన ప్రక్రియలో విద్యార్థుల యొక్క ఆలోచనలు, భావాలు, సూచనలు వెలిబుచ్చడానికి అవకాశమిస్తూ, ప్రేరేపిస్తూ, తానూ ప్రక్రియలో పాల్గొంటూ కొనసాగించినచో ఆ ఉపాధ్యాయునికి కింది నాయకత్వ లక్షణాలు ఉంటాయి.
ఎ. సహభాగి నాయకత్వం
బి. అనుమతి పూర్వక నాయకత్వం
సి. జోక్యరహిత నాయకత్వం
డి. నిర్దేశిత నాయకత్వం

29. కింది అభ్యసనా సిద్ధాంతాలలో 'ప్రతిస్పందన'కు అధిక ప్రాధాన్యతను ఇచ్చినది?
ఎ. బ్రూనర్ బోధనా సిద్ధాంతం
బి. స్కిన్నర్ కార్యసాధక నిబంధనం
సి. థారన్‌డైక్ యత్న – దోష అభ్యసనం
డి. పావ్‌లోవ్ శాస్త్రీయ నిబంధనం

30. విద్యార్థులలో మానసిక చలనాత్మకరంగ వికాసానికి అత్యధికంగా దోహదపడే కృత్యం?
ఎ. వ్యాసరచన పోటీలు　బి. ఆటలాడటం
సి. నమూనా పార్లమెంటు　డి. ఉపన్యాస పోటీలు ★



★ కింది గద్యాన్ని చదివి, 31 నుంచి 35 వరకూ గల ప్రశ్నలకు జవాబులను గుర్తించండి.

ఆంధ్ర కవితా పితామహుడైన అల్లసాని పెద్దన 16వ శతాబ్దంలో మనుచరిత్ర కావ్యాన్ని వెలువరించాడు. దానికి ఆయన పెట్టిన పేరు స్వారోచిష మనుసంభవం. కాని ఆ స్వారోచిషుని గురించి ఆయన చిట్టచివరి పద్యంలో మాత్రమే చెప్పి కావ్యమంతా అతని తండ్రి, తాతల చరిత్రను వివరించాడు. ఇంతకూ స్వారోచిషుడు మనువు. మనువు అంటే మానవుల ప్రవర్తనను తీర్చిదిద్దేవారు. మానవ లోకానికి ఉత్తమ ధర్మాలను నియమించేవాడు. అటువంటి శక్తి స్వారోచిషునికి కలగడానికి కారణం అతని పూర్వీకుల సంస్కారం, ప్రవర్తన, గంధర్వ, స్వరోచిల లక్షణాలు స్వారోచిషుని జీవసంపుటిలో పరిణితమై వకసించడం వల్లనే అతడు మనువు కాగలిగాడని పెద్దన తాత్పర్యం. అందుకే ఆయన స్వారోచిషుని కథ చెప్పకుండా ఆయన పూర్వీకుల కథనే చెప్పాడు. ఒక మనిషి గొప్పవాడు కావడానికి అతని పూర్వీకులే అన్న పరమసత్యాన్ని చాటడమే మనుచరిత్ర కావ్యంలోని ధ్వని. కాబట్టి మన పూర్వుల పట్ల, తల్లిదండ్రుల పట్ల, పెద్దల పట్ల కృతజ్ఞతా భావం కలిగి ఉండటం మన మంచికే అన్న విషయం మనమంతా గుర్తించాలి.

31. అల్లసాని పెద్దన గారి బిరుదు?
ఎ. ఆంధ్ర భూషణుడు　బి. సత్యసూక్తి కళానిధి
సి. ఆంధ్రభోజుడు　డి. ఆంధ్రకవితా పితామహుడు

32. మనుచరిత్రలోని మనువు
ఎ. వైవస్వత మనువు　బి. త్రికాల మనువు
సి. పరాశర మనువు　డి. స్వాయంభువ మనువు

33. స్వారోచిషునికి శక్తిసామర్థ్యాలు కలగడానికి కారణం
ఎ. పూర్వీకుల సంస్కారం　బి. అన్యుల సాహచర్యం
సి. మిత్రగాత్ర పరిష్వంగం　డి. శత్రుసాన్నిధ్యం

34. మనుచరిత్ర కృతి భర్త
ఎ. శ్రీకృష్ణదేవరాయలు　బి. అల్లసాని పెద్దన
సి. ఆనంద వర్ధనాచార్యులు　డి. మహిమభట్టు

35. మనువు అంటే
ఎ. మానవుల ప్రవర్తనను తీర్చిదిద్దేవాడు
బి. మానవులను సృష్టించేవాడు
సి. మానవులను దండించేవాడు
డి. మానవులను హింసించేవాడు

★ ఈ కింది పద్యాన్ని చదివి 36 నుంచి 40వ ప్రశ్నలకు జవాబులు గుర్తించండి.

కమలములు నీటబాసిన
కమలాప్తుని రశ్మిసోకి కమలిన భంగిన్
తమ తమ నెలవులు తప్పిన
తమ మిత్రులు శత్రువులౌట తథ్యము సుమతీ!

పార్ట్-2
లాంగ్వేజ్-1 - తెలుగు

36. స్థానం అనే సమానార్థ పదం గల పద్యంలోని పదం
ఎ. తథ్యం　బి. భంగి
సి. నెలవు　డి. రశ్మి

37. కమలములు నీటిని విడిచిపెట్టి బయటకు వస్తే ఏమి జరుగుతుంది?
ఎ. ప్రకాశిస్తాయి　బి. కమిలిపోతాయి
సి. వికసిస్తాయి　డి. మండుతాయి

38. ఎప్పుడు మిత్రులు శత్రువులవుతారు?
ఎ. తామే గురువులు అగుట
బి. తమ తమ నెలవులు తప్పిన
సి. తమకు తమకు ఆశ్రితులు అవుట
డి. తమకు బంధువులు అగుట

39. 'కమలాప్తుడు' అనగా
ఎ. సూర్యుడు　బి. చంద్రుడు
సి. బుధుడు　డి. గురువు

40. ఈ పద్యంలోని మకుటం ఏది?
ఎ. సుమతీ　బి. కుమతీ
సి. జమతీ　డి. తథ్యము

41. అకారంతో అంతమవుతున్న సంస్కృత పదాల మీద చేరే తెలుగు విభక్తి ప్రత్యయం
ఎ. న　బి. డు　సి. ను　డి. కి

42. వర్గ పంచమాక్షరాలు
ఎ. సరళాలు　బి. అనునాసికాలు
సి. త్రికాలు　డి. పరుషాలు

43. భాషలోని పదాలకు కాలక్రమంలో అర్థాలు మారడం
ఎ. భాషా పరిణామం　బి. అర్థ విపరిణామం
సి. శబ్ద పరిణామం　డి. అలంకార పరిణామం

44. సూర్యుడొక్కడుండు సురరాజులిద్దరు వినకరద్వయంబు:
ఎ. ఆటవెలది　బి. కందం
సి. సీసం　డి. తేటగీతి

45. ప్రకృతి-వికృతములకు ధర్మైక్యం చెప్పడం - ఇది ఏ అలంకారం?
ఎ. దీపకాలంకారం　బి. వ్యాజస్తుత్యలంకారం
సి. కారణమాలాలంకారం　డి. ఉల్లేఖాలంకారం

46. పద కవితా పితామహుడు అనే కీర్తి పొందినది
ఎ. అనంతకృష్ణ శర్మ　బి. అన్నమయ్య
సి. క్షేత్రయ్య　డి. పురందరదాసు

47. శ్రీకృష్ణ దేవరాయల విద్వత్ సభ
ఎ. త్రిభువన సాగరం　బి. విద్వత్ మండలి
సి. భువన విజయం　డి. సరస్వతీ సామ్రాజ్యం

48. ప్రేరణార్థక క్రమంలో ధాతువుకు చేరే ప్రత్యయం
ఎ. కలుగు　బి. ఇరాతు　సి. ఇంతు　డి. పొందు

49. ఒక వాక్యాన్ని కొన్ని మార్పులతో కర్త, కర్మ పద స్థానాలలో ప్రయోగించే పద్ధతిని ఏమంటారు?
ఎ. పదలీకరణం　బి. సూన్యీకరణం
సి. ఘదలీకరణం　డి. నామ్నీకరణం

50. కర్మణి వాక్యాలు ఏ భాషా ప్రభావంతో తెలుగులోకి వచ్చాయి?
ఎ. సంస్కృతం　బి. తమిళం
సి. కన్నడం　డి. మళయాళం

51. సంధికార్యం ఒకసారి జరుగుట, మరొకసారి జరగకపోవడం
ఎ. ఏకాదేశం　బి. ఆదేశం
సి. వైకల్పికం　డి. నిత్యం

52. ధీరోదాత్తుడు - ఇది ఏ సమాసం?
ఎ. ఉపమాన పూర్వపద కర్మధారయం
బి. ద్విగు
సి. విశేషణ ఉభయపద కర్మధారయం
డి. విశేషణ ఉత్తరపద కర్మధారయం

53. రాముడు నిల్చున్నాడు - ఇది ఏ రకమైన వాక్యం?
ఎ. కర్మణీవాక్యం　బి. అకర్మక వాక్యం
సి. ప్రేరణార్థక వాక్యం　డి. క్రమరహిత వాక్యం

54. పదాల మధ్య అన్వయం కలిగివుండటం?
ఎ. యోగ్యత　బి. ఆకాంక్ష
సి. అనుకృతి　డి. అనువృతి

55. ధ్వనికి, భావానికి అనురూపమైన సంబంధముంటుందని, ప్రకృతి అంతా లయాత్మకమని, ప్రతిపదార్థాల ప్రకంపలను కలిగి ఉంటుందని, ఆ ప్రకంపనాలకు అనుగుణంగానే వక్త నోట శబ్దాలు వెలువడతాయని చెప్పే భాషోత్పత్తి వాదం
ఎ. ప్రకంపనా వాదం　బి. సాంకేతిక వాదం
సి. నిశ్చయాత్మక వాదం　డి. నిర్ణయాత్మక వాదం

56. జాతి భవిష్యత్తు అంతా తరగతి గదిలోనే రూపొందుతుందని తెలియజెప్పినది?
ఎ. రాధాకృష్ణన్　బి. కొఠారి
సి. మాక్సుముల్లర్　డి. గాంధీ

57. ఉచ్చారణ దోషాలు, శబ్ద దోషాల, విషయ దోషాలు దేని వల్ల సవరించడానికి వీలు కలుగుతుంది?
ఎ. మౌన పఠనం　బి. సామూహిక పఠనం
సి. వాక్య పఠనం　డి. ప్రకాశ పఠనం

58. విద్యార్థుల శారీరక అభివృద్ధిని మదింపు చేసే సాధనం ఏమిటి?
ఎ. థర్మామీటర్　బి. పీడోమీటర్
సి. మానోమీటర్　డి. ఐనోమీటర్

59. లఘోత్తర ప్రశ్నలు సిద్ధం చేసేటప్పుడు ఉపాధ్యాయుడు దృష్టిలో పెట్టుకోవాల్సిన అంశం
ఎ. కాదు, రాదు వంటి ప్రశ్నలు రూపొందించాలి
బి. ప్రతి ప్రశ్నకు స్పష్టమైన ఒకే సమాధానం అడగాలి
సి. ప్రశ్నలను ఫలితాల ఆధారంగా రూపొందించుకోవాలి
డి. మాదిరి సమాధానాలను ముందే రాసి ఉంచుకోవాలి

60. ఉపాధ్యాయుడు ఆదర్శపఠనం భావస్ఫోరకంగా, రసస్ఫోరకంగా, నాటకాభినయంతో బాటు తగినంత ఆంగికాభినయంతో నిర్వహిస్తే విద్యార్థులు పద్యం యొక్క
ఎ. అన్వయక్రమాన్ని పాటిస్తారు
బి. పదాల అర్థాలను గ్రహిస్తారు
సి. పద్యాంతర్గత వ్యాకరణాంశాలు గ్రహిస్తారు
డి. పద్య కేంద్ర భావాన్ని గ్రహిస్తారు ★

పార్ట్-3
లాంగ్వేజ్-2 - ఇంగ్లీష్

61. Identify the adjectives from the following sentence.
The air was fresh and filled with fragrance of showers of rain, pounding of spices and cooking of the rice on the stoves made of bricks.
1) fresh and fragrance
2) cooking and pounding
3) spices and bricks　4) fresh

62. Which of the following sentences is correct ?
1) The Everest is the highest mountain in the world.
2) Everest is the most highest mountain in the world.
3) Everest is the more higher than any other mountain in the world.
4) Everest is the highest mountain in the world.

63. Fill in the blanks with the correct form of the verb given in brackets.
While I was sowing seeds, my brother (water) plants.
1) watered　2) had watered
3) was watering　4) was watered

64. The passive voice of the following sentence is.....
We have to rehabilitate the environment
1) The environment is to be rehabilitated.
2) The environment has to been rehabilitated.
3) The environment has to be rehabilitated.
4) The environment has been rehabilitated.

65. Fill in the blanks with correct articles.
.......higher you go,.......rarer the atmosphere.
1) The, a　2) A, a
3) The, the　4) A, the

66. Which of the following sentences is right ?
1) The temperature of India is cooler than .Africa.
2) The temperature of India is more cooler than Africa.
3) The temperature of India is cooler than that of Africa.
4) The temperature of India is the cooler than that of Africa.

67. Identify the type of the underlined clause.
The news is so good that it cannot be true.
1) an adverb clause of concession or supposition
2) an adverb clause of manner
3) an adverb clause of purpose
4) an adverb clause of cause

68. What does the underlined phrase in the following sentence mean ?
Open the window, would you ?
1) advice 2) please 3) order　4) command

69. Which phrasal verb will replace the underlined verb in the following sentence ?
He was sleeping when she went near him.
1) let down　2) lay off
3) nodding off　4) turned off.

70. A : Will you accompany me to market ?
B : Yes.
Name the type of adverb of the underlined word.
1) Adverb of reason　2) Adverb of manner
3) Adverb of negation　4) Adverb of affirmation

71. He said, 'My god, I am ruined.'
1) He said to be ruined.
2) He asked to be ruined.
3) He exclaimed sadly that he was ruined.
4) He was ruined.

72. Supply the question tag :
I am a good boy,
1) am I ?　2) amn't I ?
3) aren't I ?　4) is not it ?


73. Which of the following sentences is a complex sentence ?
This proves his guilt.
1) This proves that he is guilty.
2) His guilt is proved.
3) He is definitely guilty.
4) He says that he is guilty.

74. Choose the correct form of the underlined part of the sentence.
If I were a millionaire, I would have helped the poor.
1) can help　2) could have help
3) would help　4) no improvement

75. What is the antonym of 'emancipate' ?
1) acquit　2) enslave
3) convict　4) ostracize

76. The synonym of 'licentious' is
1) generous　2) gay
3) hungry　4) immoral

77. You must not do this again or you will be punished. This is
1) a simple sentence　2) a compound sentence



3) a complex sentence
4) a compound-complex sentence

78. Formal language is used in
1) Letter to relatives　2) Official letters
3) Friendly letters　4) None of these

79. Fill in the blank choosing the correct preposition.
You may sit.....Krishna and Ravi.
1) between　2) among
3) besides　4) at

80. Choose the correctly spelt word.
1) occurence　2) occurance
3) occurrence　4) occurrance

81. The latest approach to language learning
1) Situational Approach
2) Structural Approach
3) Functional Approach
4) Communicative Approach

82. Fulfillment of objectives of teaching English needs
1) good teachers and good textbooks
2) well-organised programme
3) better student-teacher ratio
4) all the above

83. To make a curriculum a successful one, the course has to be revised and achieved primarily with a collaborative effort of the
1) curriculum designers
2) teacher and students
3) course writers　4) all the above

84. Natural skills are
1) Listening and reading
2) Silent reading and speaking
3) Listening and speaking
4) Reading and writing

85. Who developed the idea of play-way in teaching ?
1) Michael Swan　2) F.G French
3) Caldwell cook　3) Stevens

86. The prescribed procedure to use the chalk board ....
1) from the corner of the board to the bottom left hand corner.
2) from the top left hand corner and progressively go down to the bottom right sand corner.
3) from the top right hand corner to the bottom left hand corner.
4) none of the above.

87 - 90: Read the following passage carefully and answer the questions given below it.

Being an only child, there was not much that Thahirah could do when she was alone. Reading her books made her life seemed so much more interesting. She read so much that she earned the nickname 'bookworm'. Because of all the reading that she did, her grasp of the English Language was so good that no one in her level could ever beat her at it.

Her teachers were all so proud of her. They especially enjoyed her compositions as she had a very good imagination and could write very well. One day, a surprise waited for Thahirah in school, her teacher had showm some of her compositions to a friend of hers who was book publisher. The publisher was so impressed with Thahirah's writing that he offered Thahirah the chance to write her own novel. Thahirah wasn't so sure at first whether she had the talent to write a novel. But with her teacher's encouragement she agreed. A few months later, Thahira's book was published and put on sale. They sold like hot cakes ! Everyone was proud of her and Thahirah discovered that this wras what she wanted to be — an author.

87. What did Thahirah do to make her life more interesting ?
1) She wrote books.
2) She read books.
3) She wrote compositions.
4) She wrote novels.

88. She was called 'bookworm' because
1) She kept worms in books.
2) She liked worms.
3) She liked to read books about worms.
4) She loved to read books.

89. Thahirah at first was reluctant to write the novel because
1) she was not confident she could do it.
2) she did not like to write novels.
3) she wanted to publish her compositions.
4) she did not have the talent to do it.

90. 'Sold like hot cakes' means
1) the books were sold together with hot cakes.
2) the books were sold very well.
3) the books were like hot cakes when sold.
4) the books were sold near a bakery selling hot cakes. ★

ANSWERS

CHILD DEVELOPMENT AND PEDAGOGY

1)3	2)1	3)3	4)4	5)4
6)3	7)2	8)1	9)3	10)1
11)2	12)4	13)2	14) 1&2	15)4
16)4	17) 1	18)2	19)2	20)3
21)4	22) 1	23)1	24)3	25)2
26)4	27)4	28) 1	29)2	30)2

TELUGU

31)4	32)4	33) 1	34) 1	35)1
36)3	37)2	38)2	39) 1	40)2
41) 2	42)2	43)2	44)4	45)1
46)2	47)3	48)2	49)4	50)1
51)3	52)3	53)2	54)1	55)1
56)2	57)4	58)2	59)4	60)4

ENGLISH

61)4	62)4	63)3	64)3	65)3
66)3	67) 1	68)2	69)3	70)4
71)3	72)3	73) 1	74)3	75)2
76)4	77)2	78)2	79) 1	80)3
81)4	82)4	83)4	84)3	85)3
86)2	87)2	88)4	89) 1	90)2

త్రిపుర ఎన్నికల నిధికి రూ. లక్ష విరాళం

ప్రజాశక్తి – భీమవరం

ఈ నెల 18న త్రిపురలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో.. ఆ రాష్ట్ర సిపిఎం కమిటీకి విశాఖ గ్రేటర్ కమిటీ ఆధ్వర్యంలో లక్ష రూపాయల ఎన్నికల నిధిని పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులకు అందించారు. త్రిపుర ఎన్నికల నిధికి విరాళాలు సిపిఎం ఏపీ రాష్ట్ర కమిటీ పిలుపు నేపథ్యంలో విశాఖ నగరంలో ఒక్క రోజు క్యాంపెయిన్ నిర్వహించి వసూలు చేసిన లక్ష రూపాయలను సిపిఎం రాష్ట్ర మహాసభ వేదికపై సిపిఎం విశాఖ నగర కార్యదర్శి డా. బి గంగారావు, వివిఎస్ పద్మనాభరాజు.. బివి రాఘవులకు అందజేసి త్రిపుర పార్టీ రాష్ట్ర కమిటీకి పంపించాలని కోరారు.



విరాళం

సిపిఎం విశాఖ నగర కార్యదర్శి డాక్టర్ బి గంగారావు, పద్మనాభరాజుల నుండి రూ. లక్ష విరాళం అందుకుంటున్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు పక్కన పార్టీ కార్యదర్శి పి మధు

దౌర్జన్యం చేసి నా భూమి కబ్జా చేశారు

పోలీసు ఉన్నతాధికారి నుంచి విముక్తి చేయాలని ఓ రైతు వేడుకోలు

ప్రజాశక్తి–తిరుపతి రూరల్

చిత్తూరు జిల్లా తిరుపతి రూరల్ మండలం కెసిపేటలోని ఎకరా భూమిపై ఆదివారం వివాదం నెలకొంది. కెసిపేటకు చెందిన రైతు పిపాసి తన భూమిపై ఓ పోలీసు ఉన్నతాధికారి మరికొంతమందితో కలిసి దౌర్జన్యం చేసి కబ్జాకు పాల్పడుతున్నారని విలపించాడు. రైతు కథనం మేరకు.. కెసిపేట లెక్కదాఖలా పైమాసి నెంబర్ 86లో 52 సెంట్లు, 85/1లో 25 సెంట్లు, 85/2లో 25 సెంట్లు భూమి 1969 నుంచి తమ స్వాధీనంలో ఉందని, అప్పటి నుంచి వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. ఇదే భూమిపై 1988లో మల్లంగుంట సింగిల్‌విండో రుణం తీసుకున్నామన్నారు. తన భూమికి ఆనుకుని ఉన్న పొలాన్ని ఓ పోలీసు ఉన్నతాధికారి కొనుగోలు చేశారని తెలిపారు. అప్పటి నుంచి పక్కనే ఉన్న తన భూమిపై ఆ అధికారి కన్నుపడిందని, అప్పటి నుంచి తరచూ దౌర్జన్యం చేస్తూ కబ్జాకు పాల్పడుతున్నారని ఆరోపించాడు. తమ కుటుంబానికి జీవనాధారమైన ఎకరా పొలంపై వివాదాన్ని పరిష్కరించి, తనకు న్యాయం చేయాలని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధితుల పక్షాన నిలబడి చట్టాన్ని కాపాడాల్సిన వారే ఇలా తన పొలాన్ని కబ్జాచేయడం దారుణమంటూ విలపిస్తున్నారు. ఆ పొలంపై తమకు సర్వహక్కులు ఉన్నాయని, అవసరమైతే రికార్డులు చూపిస్తామని చెప్పడం గమనార్హం. రెవెన్యూ అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఉద్యమాల ప్రజ్వలనకు మహాసభలు దోహదం

ఆహ్వానసంఘం అధ్యక్షులు ఆర్ఎస్



ఆర్ఎస్ తరుపున ఆహ్వాన సంఘం అధ్యక్ష ప్రసంగాన్ని చదివి వినిపిస్తున్న మంతెన సీతారాం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి – పర్స సత్యనారాయణనగర్ (భీమవరం)

పాలకవర్గాల మెడలు వంచడానికి, ఉద్యమాలు మరింతగా ప్రజ్వరిల్లడానికి ఈ మహాసభలు తప్పక తోడ్పడతాయని సిపిఎం రాష్ట్ర మహాసభల ఆహ్వానసంఘం అధ్యక్షులు ఆర్ సత్యనారాయణ రాజు (ఆర్ఎస్) ఆకాంక్షించారు. వామపక్ష, ప్రజాతంత్ర, సామాజిక శక్తులు బలపడి, రాష్ట్రంలో ప్రత్యామ్నాయాన్ని నిర్మించేలా ఈ మహాసభలు దిశా నిర్దేశం చేయాలని అభిలషించారు. శనివారం ప్రారంభమైన మహాసభల్లో ఆయన అధ్యక్షోపన్యాసం చేశారు. సభలకు ఆతిథ్యం ఇస్తున్న భీమవరం ఘనమైన పోరాట వారసత్వం ఉన్న ప్రాంతమని పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలోనూ, కమ్యూనిస్టు ఉద్యమాలతోనూ ఈ ప్రాంతానికి ఎంతో అనుబంధం ఉందని గుర్తుచేశారు. 'స్వాతంత్రోద్యమంలో భీమవరం పట్టణం రెండో బార్డోలిగా ప్రసిద్ధి చెందింది. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు, ప్రఖ్యాత శాస్త్రవేత్తలు యల్లాప్రగడ సుబ్బారావు, అయ్యగారి సాంబశివరావు, (డాక్టర్ ఎ.ఎస్.రావు), అనేక మంది ప్రముఖ సాహితీ వేత్తలు, కళాకారులు ఈ ప్రాంతంలోనే జన్మించి కీర్తి తెచ్చారు. గోదావరి డెల్టా అన్నపూర్ణగా పేరుగాంచింది. ఆక్వా సాగు, గ్యాస్, ఆయిల్ నిక్షేపాల్లో జిల్లా అంతర్జాతీయ గుర్తింపు పొందింది. జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమానికి బలమైన పునాదులు, త్యాగాల చరిత్ర ఉంది. మహనీయుడు పుచ్చలపల్లి సుందరయ్య జిల్లాలో తొలి కమ్యూనిస్టు విత్తులు నాటితే ఉద్దరాజు రామం, అల్లూరు సత్యనారాయణ, అన్నే వెంకటేశ్వరరావు, దిగుపాటి సాల్మన్‌రాజు, మహ్మద్ మీరా లాంటి యోధులు అభివృద్ధి చేశారు. ప్రజల కోసం నిలబడి 1950 ప్రాంతంలో, ఆ తర్వాతా ఎందరో నాయకులు నాటి కాంగ్రెస్ ప్రభుత్వ కర్కశానికి బలయ్యారు. ప్రాణాలు త్యాగం చేసి ప్రజల గుండెల్లో అమరజీవులయ్యారు.' అని ఆర్ఎస్ వివరించారు. జిల్లాలో సిపిఎం పోరాటాల గురించి వివరిస్తూ– 'పార్టీ ప్రజల సమస్యలపై నిరంతరంగా పోరాడుతోంది. రైతులు, కౌలురైతులు, వ్యవసాయ కార్మికులు, వృత్తిదారులు, కార్మికులు, ఉద్యోగులు ఊపిరిగా ఉద్యమాలు చేస్తోంది. ప్రభుత్వాల తీవ్ర నిర్బంధాన్ని సైతం ఎదుర్కొని సమస్యల పరిష్కారంలో కొన్ని విజయాలు సాధించింది. తుందుర్రు, కంసాలి బేతపూడి, జొన్నలగర్వు గ్రామాల మధ్యన నిర్మిస్తున్న ప్రమాదకరమైన గోదావరి ఆక్వా మెగా ఫుడ్‌పార్క్ వేరే ప్రాంతానికి తరలించాలని మూడేళ్లుగా పోరాడుతున్న ప్రజలకు సిపిఎం కొండంత అండగా నిలబడింది. డెల్టా, వరిపంట పరిరక్షణకు పోరాటాలు చేస్తోంది. సన్న, చిన్నకారు, పేద రైతుల భూములు, జలవనరులు, తాగునీటి చెర్వుల పరిరక్షణకు ఉద్యమాలు నిర్వహిస్తోంది.' అని చెప్పారు. 'మెట్ట, ఏజెన్సీ ప్రాంత రైతులు, గిరిజనులు, ప్రజల ప్రయోజనాల కోసం సిపిఎం గట్టిగా కృషి చేస్తోంది. గిరిజనుల భూమి, హక్కుల కోసం అల్లూరి స్ఫూర్తిగా పోరాడుతోంది. వెనుకబడిన తరగతులు, దళితులు, గిరిజనులు, మైనార్టీలకు హక్కులు, సామాజిక రక్షణ, న్యాయం కోసం నిలబడుతోంది. దూబచర్ల ప్రాంతంలో రైతులు పోరాటానికి అండగా నిలబడి, విజయం సాధించింది.' అని చెప్పారు. 'పుచ్చలపల్లి సుందరయ్య, మాకినేని బసవపున్నయ్య, చండ్ర రాజేశ్వరరావు, మోటూరు హనుమంతరావు, నండూరి ప్రసాదరావు, లావు బాల గంగాధరరావు, కొరటాల సత్యనారాయణ, గుంటూరు బాపనయ్య, పర్స సత్యనారాయణ, మల్లు వెంకట నరసింహారెడ్డి, ఉద్దరాజు రామం, మానికొండ సూర్యావతి లాంటి యోధానుయోధులు నిర్మించిన ఉద్యమ వారసత్వం మనదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్బంధాన్ని తట్టుకుని నేడూ అనేక ఉద్యమాలు, పోరాటాలు సాగుతున్నాయని అన్నారు. స్వాతంత్రోద్యమం, సాంస్కృతికోద్యమం, కమ్యూనిస్టు ఉద్యమ స్ఫూర్తి, అమరవీరుల త్యాగాలూ ఈ ఉద్యమాలకు, పోరాటాలకు ఆలంబన కావాలని ఆకాంక్షించారు.



ఆర్ సత్యనారాయణ రాజు

అమరులకు మహాసభ జోహార్లు

సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టిన వైవి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి – పర్స సత్యనారాయణనగర్ (భీమవరం)

గత మహాసభల నుండి ఈ మహాసభల మధ్యకాలంలో అమరులైన కమ్యూనిస్టు, వామపక్ష, అభ్యుదయ ఉద్యమవీరులకు సిపిఎం 25వ రాష్ట్ర మహాసభ నివాళులర్పించింది. శనివారం ఇక్కడి సింహాద్రి శివారెడ్డి ప్రాంగణంలో శనివారం మహాసభల ప్రారంభ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. క్యూబా విప్లవ వీరుడు, జీవితాంతం అమెరికా కుట్రలను ఎదిరించి పోరాడి క్యూబాను సోషలిస్టు పథంలో నడిపించిన ఫైడల్ క్యాస్ట్రో మృతికి మహాసభ విప్లవ జోహార్లర్పించింది. సిపిఎం కేంద్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ సుకోమల్ సేన్, త్రిపుర లెఫ్ట్ ఫ్రంట్ ఛైర్మన్ ఖగేన్‌దాస్, పార్టీ కేంద్ర కమిటీ మాజీసభ్యులు సుబోధ్ మెహతా, రఘువీర్‌సింగ్ హుడాకు సంతాపం ప్రకటించింది. సుదీర్ఘకాలం పశ్చిమబెంగాల్ స్పీకర్‌గా పనిచేసిన అబ్దుల్ హలీం, మాజీ మంత్రి కాంతి బిస్వాస్, కిసాన్ సభ నాయకులు నూరుల్ హుడాలకు సంతాపం తెలిపింది. ఇన్సూరెన్స్ ఉద్యమ జాతీయ నాయకులు ఎన్ఎం సుందరం, సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ప్రధాన కార్యదర్శి ఎబి బర్ధన్, సిపిఎం ఉమ్మడి రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా పనిచేసిన పర్స సత్యనారాయణ, రాష్ట్ర కమిటీ సభ్యులుగా పనిచేసిన సింహాద్రి శివారెడ్డి, దాచూరి రామిరెడ్డి, సిపిఎ శాసనసభాపక్ష నాయకులుగా పనిచేసిన నర్రా రాఘవరెడ్డి, ఉమ్మడి రాష్ట్ర కమిటీ సభ్యులుగా పనిచేసిన తిరందాసు గోపికు సంతాపం వ్యక్తం చేసింది. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పినకాని కృష్ణమూర్తి, ఎస్ రమేష్, కె సాల్మన్‌రాజు, బి.బి.నాయుడు, తొట్టెంపూడి ప్రభావతి, ఎస్.ప్రభుదాస్, మురళీకృష్ణ, అరిగెల్ల నారాయణకు సంతాపం ప్రకటించింది. రైతు సంఘం రాష్ట్ర నాయకులు టి రామకృష్ణ, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులు కోయ అనంతరెడ్డి, గంగసాని సచిపాలరెడ్డి, శెట్టి వెంకటనర్సమ్మ, మహిళా ఉద్యమ నాయకులు అన్నే అనసూయమ్మ, నాగళ్ల రాజేశ్వరమ్మ, దిగుమర్తి కమలమ్మ, టి లక్ష్మమ్మ, పి సక్కుబాయి, సారా ఉద్యమ నాయకురాలు దూబగుంట రోశమ్మకు సభ సంతాపాన్ని ప్రకటించింది. సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ సూర్యదేవర నాగేశ్వరరావు, రైతు కూలి ఉద్యమ నేత కొప్పుల కోటయ్య, ప్రముఖ హేతువాద రచయిత చిత్తజల్లు వరహాలరావు, నాస్తికోద్యమ నేత లవణం, అట్టడుగు వర్గాల స్త్రీ సమస్యలపై పరిశోధన చేసిన ప్రముఖ రచయిత్రి వకులాభరణం లలితకు సంతాపం వ్యక్తం చేసింది. ఇటీవల మరణించిన వామపక్ష ఉద్యమ శ్రేయోభిలాషులు, ప్రముఖ పాత్రికేయులు, డిఎన్ఎఫ్ అధినేత వి హనుమంతరావు, ప్రముఖ జర్నలిస్టు, రచయిత టి అరుణ్ సాగర్, ప్రముఖ కార్టునిస్ట్ టి మోహన్, ప్రజాశక్తిలో దీర్ఘకాలం పనిచేసిన పొణకల అప్పారావు, కలీముల్లాకు సంతాపాన్ని ప్రకటించింది. పౌర హక్కుల ఉద్యమ నేత, దళిత నాయకులు బొజ్జా తారకం, రచయిత బోయ జంగయ్య, మతోన్మాదుల దాడిలో బలైన హేతువాద ఉద్యమ నాయకులు ఎంఎం కల్బుర్గి, నరేంద్ర దబోల్కర్, గోవింద పన్సారే, గౌరీ లంకేష్, సాహిత్య, సంగీత, కళారరంగాల ప్రముఖ సంగీత విద్వాంసులు మంగళంపల్లి బాల మురళీకృష్ణ, శాస్త్రీయ నృత్య కళాకారిణి మృణాళిని సారాబాయ్, సంగీత సామ్రాట్ ఎంఎస్ విశ్వనాథ్‌కు సంతాపం తెలిపింది. సినీ దర్శకులు దాసరి నారాయణరావు, నిర్మాత అట్లూరి పూర్ణచంద్రరావు, హాస్య నటుడు ఎంఎస్ నారాయణ, స్వాతంత్ర్య సమర యోధులు వేములపల్లి వామనరావు, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ అధికారుల వేధింపులకు గురై మరణించిన వేముల రోహిత్, పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ గుండాల దాడిలో, కేరళలో ఆర్ఎస్ఎస్ గుండాల దాడిలో మరణించిన వామపక్ష కార్యకర్తలకు సభ జోహార్లు అర్పించింది. ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు, రైలు, రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వారికి, కార్పొరేట్ కళాశాల వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థినీ, విద్యార్థులకు, గోదావరి పుష్కరాల్లో మరణించిన 30 మందికి, కృష్ణా నదిలో బోటు ప్రమాదంలో మరణించిన 22 మందికి, ఆత్మహత్యలు చేసుకున్న రైతు, చేనేత కార్మికులకు ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పార్టీ, ప్రజాతంత్ర ఉద్యమాభివృద్ధికి కృషి చేసి ఈ మధ్యకాలంలో అనారోగ్యంతో, వయోభారంతో మరణించిన వందలాది మంది పార్టీ, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులకు సభ జోహార్లు అర్పించింది. మరణించిన అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర స్థాయిలో రాజకీయ, సాంస్కృతిక, సాహితీ, కళా రంగాల్లోని ప్రముఖులకు, మేధావులకు, సామ్రాజ్యవాద శక్తులు, అభివృద్ధి నిరోధక, ఉగ్రవాద శక్తులు పొట్టనపెట్టుకున్న అనేక మంది నాయకులకు, సామ్రాజ్య ప్రజలకు సభ సంతాపాన్ని ప్రకటించింది.



సంతాప తీర్మానాన్ని ప్రవేశపెడుతున్న వై వెంకటేశ్వరరావు

యువ దంపతుల ఆత్మహత్య

ప్రజాశక్తి–నూజివీడు (కృష్ణా)

యువ దంపతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ సంఘటన కృష్ణా జిల్లా నూజివీడు మండలం పల్లెర్లమూడిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పల్లెర్లమూడి గ్రామానికి చెందిన కలదిండి నాగార్జున(26), భవానీ (22)లకు ఏడాది క్రితం వివాహం అయ్యింది. భవానీ ఏడో నెల గర్భవతి కావడంతో శనివారం భార్యభర్తలిరువురు ఆసుపత్రికి వెళ్లారు. సాయంత్రం తిరిగి వచ్చి ఎప్పటి లాగానే భోజనం చేసి పడుకున్నారు. ఉదయాన్నే లేవకపోవడంతో నాగార్జున తల్లిదండ్రులు తలుపు తెరిచి చూడగా భార్యభర్తలు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించారు. 'మా చావుకు ఎవరూ కారణం కాదు' అని సూసైడ్ నోట్‌లో రాసినట్లు పోలీసులు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులే ఆత్మహత్యకు కారణంగా తెలుస్తోందన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

సుప్రీం తీర్పు ప్రకారం

సమాన పనికి సమాన వేతనమివ్వాలి

- ఐఎఫ్‌టియు రాష్ట్ర సదస్సులో జాతీయ కమిటీ సభ్యులు శ్రీనివాస్

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

సమాన పనికి సమానం వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే అమలు చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టియు) జాతీయ కమిటీ సభ్యులు ఎం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టియు రాష్ట్ర సదస్సును విజయవాడలోని స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో ఆదివారం నిర్వహించారు. సదస్సుకు ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు ఎల్‌వి కుటుంబరావు అధ్యక్షత వహించారు. శ్రీనివాస్ ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ఒకే పని చేసే ఇరువురు కార్మికులకు సమాన వేతనం ఇవ్వాలనేది రాజ్యాంగంలోనే పొందుపరిచారన్నారు. వేతనాల్లో వ్యత్యాసాలు ఉండరాదన్నారు. అది జీవించే హక్కు మనుగడకే ప్రమాదకరమని వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు తీర్పును ప్రకటించి రెండేళ్లు గడుస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు అమలు చేయటం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాలతో కార్మికుల శ్రమను యాజమాన్యాలు దోచుకుంటున్నాయని విమర్శించారు. ఈ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి కె రామారావు మాట్లాడుతూ చట్టాలనూ సవరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తున్నాయన్నారు. అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకాల కార్మికులకు సకాలంలో వేతనాలివ్వకుండా ప్రభుత్వం ఆటలాడుకుంటోందన్నారు. వీటిని ప్రయివేటీకరించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఈ ప్రయివేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనే సుప్రీంకోర్టు తీర్పు అమలుకోసం ఆందోళనలు చేపట్టాలన్నారు.

జిల్లా స్థాయి రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించాలని, స్థానిక అధికారులకు వినతి పత్రాలను అందజేయాలని, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని, దారి మళ్లుతున్న బిల్డింగ్ వర్కర్స్ సంక్షేమ బోర్డు నిధులను తిరిగి రాబట్టాలని, అసంఘటిత రంగం కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రవేశపెట్టిన తీర్మానాలను సభ్యులు ఆమోదించారు. ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు సిహెచ్ వెంకటేశ్వరరావు, ఎన్ ఫణి, ఆర్ మోహన్, ఏసు, రమేష్, పి వెంకటేష్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎ కృష్ణ, తదితరులు ప్రసంగించారు. అరుణోదయ రాష్ట్ర కమిటీ కళాకారులు ఆలపించిన విప్లవ గీతాలు ఆహూతులను అలరించాయి.

సిపిఎస్‌పై చర్చిస్తున్నాం : అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి – శ్రీకాకుళం సిటీ

సిపిఎస్ (కంట్రీబ్యూషనరీ పెన్షన్ స్కీం) పై కమిటీ వేసి అధ్యయనం చేసేందుకు యోచిస్తున్నామని, సిపిఎస్ ఉద్యోగులకు గ్రాట్యూటీ, ఫ్యామిలీ పెన్షన్ ఇవ్వాలని నిర్ణయించామని రాష్ట్ర బిసి, రవాణా శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆదివారం శ్రీకాకుళంలోని బాపూజీ కళామందిర్‌లో జిల్లా కేంద్రంలోని ఉద్యోగులకు 14.5 శాతం ఉన్న అద్దె భత్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం 20 శాతానికి పెంచిన సందర్భంగా ప్రజాప్రతినిధులు, ఎపి ఎన్‌జిఒ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు సన్మానసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మూడున్నరేళ్లలో చంద్రబాబు పాలనలో వచ్చిన మార్పును ఉద్యోగులు గమనించాలన్నారు. ప్రభుత్వం మంచి పేరు తెచ్చుకొవడానికి, రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేసేందుకు ఉద్యోగులు కీలక భూమిక పోషిస్తున్నారని చెప్పారు. ఎపి ఎన్‌జిఒ సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు చౌదరి పురుషోత్తంనాయుడు ఆధ్వర్యాన మంత్రి అచ్చెన్నాయుడు, ప్రభుత్వ విప్ కూన రవికుమార్, జెడ్‌పి ఛైర్‌పర్సన్ ధనలక్ష్మి, శ్రీకాకుళం ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, ఎపి ఎన్‌జిఒ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి అశోక్‌బాబు, చంద్రశేఖర్‌రెడ్డిని సన్మానించారు.

మత్స్యకార, బోయలను ఎస్‌టిల్లో చేరిస్తే ఊరుకోం

పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై మండిపడ్డ గిరిజన ఐక్యవేదిక

ప్రజాశక్తి – విశాఖపట్నం ప్రతినిధి

బోయ, మత్స్యకార కులాలను ఎస్టీల్లో చేరిస్తే ఊరుకునేది లేదని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయాన్ని ప్రకటించాలని గిరిజన ఐక్య వేదిక సభ్యులు డిమాండ్ చేశారు. ఆదివారం విశాఖలోని ఎంవిపి కాలనీలో గిరిజన భవన్‌లో రాష్ట్ర స్థాయి గిరిజన ఐక్య వేదిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర స్థాయి గిరిజన నాయకులు హాజరై వారి అభిప్రాయాలు వ్యక్తంచేశారు. మత్స్యకారులను ఎస్టీల్లో చేర్చాలన్న డిమాండ్‌కు మద్దతిస్తూ జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను నేతలంతా తప్పుపట్టారు. కులమతాలకు అతీతంగా తాను భారతీయుడనని చెప్పుకునే పవన్ కుల రిజర్వేషన్లకు మద్దతివ్వడమేంటని ప్రశ్నించారు. కారెం శివాజి, సత్యపాల్ కమిటీల రిపోర్టు ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదిక పంపడాన్ని వక్తలంతా తప్పుపట్టారు. 2014 ఎన్నికల మేనిఫెస్టోలో టిడిపి ప్రభుత్వం గిరిజనుల సంక్షేమానికి పొందుపరిచిన అంశాలన్నీ తక్షణమే కార్యాచరణ చేయాలన్నారు.



ఆంధ్రజ్యోతి సీనియర్ జర్నలిస్టు వడ్లమూడి పద్మకు అరుణ్‌సాగర్ స్నేహ పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న గోరటి వెంకన్న

'అరుణ్‌సాగర్ సేవలు చిరస్మరణీయం'

ప్రజాశక్తి – గవర్నరుపేట (విజయవాడ)

ఎలక్ట్రానిక్ మీడియా రంగంలో అరుణ్ సాగర్ చేసిన సేవలు చిరస్మరణీయమైనవని పలువురు వక్తలు పేర్కొన్నారు. విజయవాడ మహాత్మాగాంధీ రోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో అరుణ్‌సాగర్ ద్వితీయ వర్ధంతి సభ ఆదివారం ఉదయం జరిగింది. సాహితీమిత్రులు ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయితలు, కవులు ఖాదర్ మొహిద్దీన్, కె.వేణుగోపాల్‌రెడ్డి, మువ్వా శ్రీనివాసరావు, నండూరి రాజగోపాల్ తదితరులు మాట్లాడుతూ అరుణ్‌సాగర్ ఒక జర్నలిస్టు మాత్రమే కాదని, కవి, రచయితగా సుపరిచితమేనని గుర్తుచేశారు. సాహిత్యంలో ఆయన విశేష కృషి చేశారని కొనియాడారు. అనంతరం సాగర్ స్నేహ పురస్కారాలు, అవార్డులను ఆంధ్రజ్యోతి సీనియర్ జర్నలిస్టు వడ్లమూడి పద్మ, టివి 5 ఇన్‌పుట్ ఎడిటర్ రాజ్‌కుమార్‌లకు ప్రముఖ గాయకుడు గోరటి వెంకన్న పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు మీడియా ప్రతినిధులు, కవులు, రచయితలు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రజ్ఞ

జవాబులు

1. న్యూఢిల్లీ
2. ఫిబ్రవరి 11
3. దక్షిణ మధ్య రైల్వే
4. హర్దయాల్ ప్రసాద్
5. సాహిత్యం (ఒడిషా)

దీక్షలు

హైకోర్టు సాధించే వరకూ పోరాటం

న్యాయవాదుల దీక్షలకు పెరుగుతున్న మద్దతు

ప్రజాశక్తి – కడప / కర్నూలు లీగల్ /అనంతపురం సిటీ

రాయలసీమలో హైకోర్టు స్థాపించాలని కోరుతూ న్యాయవాదులు చేపట్టిన దీక్షలకు రోజురోజుకు మద్దతు పెరుగుతోంది. కడపలో న్యాయవాది పల్లేటి వెంకట రమణారెడ్డి కడప జిల్లా కోర్టు ఎదుట ఆదివారం ఉదయం నుంచి ఆమరణ నిరాహార దీక్షలు చేపట్టారు. వెంకట రమణారెడ్డికి రాయలసీమ న్యాయవాదులు జెఎసి కన్వీనర్ ఎస్.మస్తాన్‌వలి పూలమాలవేసి దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మస్తాన్‌వలి మాట్లాడుతూ నాగరాజు చేపట్టిన ఆరు రోజుల ఆమరణ దీక్షలను పోలీసులు భగ్నం చేశారన్నారు. అయినా మా పోరాటం సాగిస్తూ పల్లేటి వెంకట రమణారెడ్డి నిరవధిక దీక్షలు చేపట్టారని అరెస్టులకు, నిర్బంధాలకు భయపడే ప్రసక్తే లేదన్నారు. సీమలో హైకోర్టు సాధించేందుకు ప్రాణత్యాగానికైనా తాము సిద్ధమని చెప్పారు. కర్నూలులో జెఎసి పిలుప మేరకు న్యాయ వాదులు జిల్లాలోని ఎమ్మెల్యేలందరి దగ్గరికి వెళ్లి కర్నూలుకు హైకోర్టు ఇవ్వాలంటూ లేఖలు తీసుకుంటున్నారు. న్యాయవాదుల దీక్షలకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు సోమసుందరం మాదిగ, మహిళా నాయకురాళ్లు మద్దతు తెలియజేశారు. సోమసుందరం మాట్లాడుతూ సీమ ప్రజాప్రతినిధులు రాయలసీమకు ద్రోహం చేస్తున్నారని, ప్రజలు వీరికి బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని అన్నారు. పలువురు న్యాయవాదులు ఈ దీక్షల్లో కూర్చున్నారు. అనంతపురంలో న్యాయవాది జె.రాజారెడ్డి చేపట్టిన ఆమరణ నిరాహారదీక్షకు పలువురు రాజకీయ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ఈ దీక్షలో పలువురు న్యాయవాదులు కూర్చున్నారు.



కర్నూలు దీక్షల్లో పాల్గొన్న న్యాయవాదులు

సంక్షిప్తం

మార్చి 31 తర్వాత మరో ఉద్యమం : ముద్రగడ

చిత్తూరు అర్బన్ : ఎన్నికల ముందు బలిజ, కాపు, ఒంటరి తెగలను బిసిలుగా గుర్తిస్తామని, రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పిన హామీలను మార్చి 31లోపు నెరవేర్చాలని లేదంటే మరో ఉద్యమానికి సిద్ధంగా ఉండాలని కాపులకు కాపు, బలిజ జెఎసి నాయకులు ముద్రగడ పద్మనాభం పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో బలిజ, కాపుల ఆత్మీయ కలయిక సమావేశాన్ని పొలకల అశోక్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముద్రగడ మాట్లాడారు.

విశాఖలో స్వచ్ఛ భారత్ సైకిల్ ర్యాలీ

ప్రజాశక్తి–కలెక్టరేట్, విశాఖ

విశాఖలో స్వచ్ఛభారత్ సైకిల్ ర్యాలీని జాయింట్ కలెక్టర్ సృజన ఆదివారం ప్రారంభించారు. బిజెవైఎం జాతీయ కార్యవర్గ సభ్యులు ఆడారి కిశోర్‌కుమార్ 365 రోజులుగా పలు రాష్ట్రాల్లో స్వచ్ఛభారత్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివారం విశాఖలో సైకిల్ ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో మంత్రి గంటా శ్రీనివాసరావు సైకిల్ తొక్కి విద్యార్థులను ఉత్సాహపరిచారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ప్రారంభమైన ర్యాలీ రెండు కిలోమీటర్ల మేర సాగింది. ఈ సందర్భంగా మంత్రి గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ, స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. 365 రోజులుగా దేశంలోని వివిధ ప్రాంతాల్లో సైకిల్ ర్యాలీ ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్న ఆడారి కిషోర్‌కుమార్‌ను అభినందిస్తున్నన్నారు. జాయింట్ కలెక్టర్ సృజన మాట్లాడుతూ, స్వచ్ఛభారత్‌ను రాజకీయాలకు అతీతంగా నిర్వహించాలన్నారు. అనంతరం స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ చేశారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను సిఎం అడ్డుకోవాలి : అయోధ్యరాము

ప్రజాశక్తి– కలెక్టరేట్, విశాఖ

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను ముఖ్యమంత్రి చంద్రబాబు అడ్డుకోవాలన్ని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు జి. అయోధ్యరావు డిమాండ్ చేశారు. 32 మంది ప్రాణదానం చేసి సాధించిన స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. విశాఖ నగరంలోని నండూరి ప్రసాదరావు భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో 10 శాతం వాటాలు అమ్మడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ప్రభుత్వరంగ వాటాలను అమ్మడం ద్వారా రూ. 80 వేల కోట్లను సమీకరిస్తామని బడ్జెట్‌లో కూడా పేర్కొందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తెచ్చి, ప్రయివేటీకరణ ప్రతిపాదనను తక్షణం ఉపసంహరించుకునేలా చేయాలని డిమాండ్ చేశారు.

ఎపికి ప్రత్యేక హోదా కల్పించాలని ప్రదర్శన

ప్రజాశక్తి–అద్దంకి (ప్రకాశం)

రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించాలని విభజన సమయంలో ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని పూర్వపు విద్యార్థుల జెఎసి ఆధ్వర్యంలో అద్దంకిలో ఆదివారం ర్యాలీ జరిగింది. పట్టణంలోని 1987–88, 89–90, 92–93, 94–95, 96–97 పూర్వపు విద్యార్థులు బ్యాచ్ అందరూ పట్టణంలోని బాలికల పాఠశాల నుండి గాంధీ బొమ్మసెంటర్ గుండా బంగ్లారోడ్డు వరకు ఈ ర్యాలీ సాగింది ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు కోటేశ్వరరావు, చిన్ని సత్యనారాయణ, జె రమేష్‌బాబు, పి కృష్ణమోహన్, సుధాకరరావు, మురళీకృష్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఏడాదిలో రెండు లక్షల మంది విదేశీయులకు వైద్య సేవలు

న్యూఢిల్లీ : భారత్‌లో 2016లో మొత్తం రెండు లక్షల మంది విదేశీయులు వైద్య సదుపాయాలు పొందారని,ఇందులో 1,678 పాకిస్తానీయులు, 296 అమెరికన్లు వున్నారని, దేశంలో వైద్య సేవల ప్రమాణాలు మెరుగయ్యాయనడానికి ఇది ఒక ఉదాహరణగా పేర్కొనవచ్చని అధికారులు పేర్కొంటున్నారు, హోంమంత్రిత్వ శాఖకు అనుబంధంగా ఉన్న గణాంకాల ఈ మేరకు వివరాలు వెల్లడించింది. ప్రపంచ వ్యాప్తంగా 2016లో 54 దేశాలలోని 2,01,099 మందికి మెడికల్ వీసాను జారీ చేశామని వారు పేర్కొన్నారు. బంగ్లాదేశ్ నుండి 99,799, ఆఫ్ఘనిస్తాన్ నుండి 33,955, ఇరాక్ నుండి 13,465, ఒమన్ నుండి 12,227, ఉజ్బెకిస్తాన్ 4,420, నైజీరియా 4,359, మంది విదేశీయులకు 2016లో మెడికల్ వీసాలు జారీ చేయబడ్డాయని తెలిపారు.

మృత్యువాత

అస్సాంలోని నాగోన్ జిల్లాలో శనివారం వేగంగా వెళ్లున్న రైలు ఏనుగల గుంపును ఢీ కొట్టడంతో నాలుగు ఏనుగులు చనిపోయాయి.



రైలు ఢీకొని నాలుగు ఏనుగులు మృతి

న్యూఢిల్లీ : వేగంగా వెళ్తున్న ఒక రైలు ఢీ కొనడంతో నాలుగు ఏనుగులు మృతి చెందిన సంఘటన అస్సాంలోని నాగోన్ జిల్లాలో శనివారం జరిగింది. గువహతి-సిల్చార్ పాసింజర్ రైలు హవాయ్‌పూర్ రైల్వే స్టేషన్‌ను దాటుకుని వెళ్తున్న సమయంలో ఆ ప్రాంతంలో ఉన్న ఏనుగుల గుంపు అడ్డుగా రావడంతో ఈ సంఘటన జరిగిందని రైల్వే అధికారి పిజె శర్మ తెలిపారు. ఈ సంఘటనలో నాలుగు ఏనుగులు అక్కడికక్కడే మృతి చెందాయని తెలిపారు. మరో ఏనుగుకు తీవ్ర గాయాలయ్యాయన్నారు. అయితే ఈ ఘటనలో ప్రయాణీకులు గాయపడనప్పటికీ రైలు ఇంజను పట్టాలు తప్పిందని ఆయన చెప్పారు. విషయం తెలుసుకున్న వెంటనే అధికారులు ప్రత్యేక రైలును ఏర్పాటు చేసి ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానాలకు తరలించినట్లు చెప్పారు. ఏనుగుల స్థావరంగా గుర్తించబడిన ప్రాంతంలో ఈ సంఘటన జరిగిందని స్థానికులు పేర్కొన్నారు. అస్సాంలో ప్రమాదాల కారణంగా మృతి చెందుతున్న ఏనుగుల సంఖ్య పెరిగిపోతున్నది. 2016లో 110 ఏనుగులు, 2015లో 118 ఏనుగులు మృతి చెందినట్లు రాష్ట్ర అటవీ శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి విద్యుద్ఘాతం, రైలు ప్రమాదాలు, రైతులు విషాహారం పెట్టడం వంటివి అధిక సంఖ్యలో ఏనుగులు మృతి చెందడానికి కారణమవుతున్నాయని అటవీ శాఖ అధికారులు పేర్కొన్నారు.

ఇంకా 'లెక్కలు' తేల్లేదు !

రద్దయిన నోట్లపై ఆర్‌బిఐ

న్యూఢిల్లీ : మోడీ ప్రభుత్వం 2016 నవంబరు 8న అర్థాంతరంగా నోట్లరద్దును ప్రకటించి సామాన్య ప్రజలను బ్యాంకుల ముందు లైన్లలలో నానా ఇబ్బందులకు గురిచేసి 15 నెలలు కావస్తున్నప్పటికి వాటి లెక్కలు మాత్రం ఇంకా కొన'సాగు'తున్నాయని ఆర్‌బిఐ పేర్కొనడం గమనార్హం. రద్దయిన రూ. 500, రూ. 1000 నోట్ల నిర్థిష్ట విలువ ఎంత ఉందో తెలియదని, వాటి లెక్కింపు వేగవంతమైన పద్ధతిలో కొనసాగుతుందని ఆర్‌బిఐ పేర్కొంది. పిటిఐ కరస్పాండెంట్ దాఖలు చేసిన ఆర్‌టిఐ దరఖాస్తుకు సంబంధించి ఆర్‌బిఐ పైవిధంగా స్పందించింది. నోట్ల లెక్కింపుకు ఎంత సమయం కావాలన్న ప్రశ్నకు సమాధానమివ్వలేదు. 2017 జూన్ నాటికి ఆర్‌బిఐకి సమర్పించిన నోట్ల అంచనా విలువ రూ. 15.28 లక్షల కోట్లు ఉంటుందని, భవిష్యత్‌లో వీటి విలువ పెరగవచ్చు, తగ్గవచ్చు అని తెలిపింది. 2016, నవంబరు 8న రూ. 500, రూ. 1000నోట్లను రద్దుచేసిన ప్రభుత్వం వాటిని బ్యాంకులలో డిపాజిట్ చేయాలని, వాటిస్థానంలో కొత్తనోట్లను పొందవచ్చని ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే రద్దయిన నోట్ల లెక్కింపు కోసం 59 అధునాతన ధృవీకరణ, ప్రాసెసింగ్ యంత్రాలు (సివిపిఎస్) పనిచేస్తున్నాయని ఆర్‌బిఐ పేర్కొంది. కాగా, ఆ ప్రక్రియ ఎక్కడ నిర్వహిస్తున్నారన్న ప్రశ్నకు సమాధానమివ్వలేదు. కాగా, ఎనిమిది సివిపిఎస్ యంత్రాలు కమర్షియల్ బ్యాంకులలో పనిచేస్తున్నాయని, ఏడు యంత్రాలను లీజుకు తీసుకుని ఆర్‌బిఐ ప్రాంతీయ ఆఫీస్‌లలో లెక్కింపు ప్రక్రియ చేపడుతున్నామని ఆర్‌టిఐకు సమాధానమిచ్చింది.అయితే నోట్లరద్దు నాటికి రూ. 500 నోట్లు 1,716.5 కోట్లు, రూ. 1000 నోట్లు 685.8 కోట్ల చెలామణిలో ఉన్నాయని మొత్తంగా రూ. 15.44 లక్షల కోట్ల నగదు చెలామణిలో వుందనిఆర్‌బిఐ పేర్కొంది.

విదేశీ వైద్య విద్యకు నీట్ ఉత్తీర్ణత తప్పనిసరి

న్యూఢిల్లీ : విదేశీ యూనివర్శిటీలలో వైద్య విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులు జాతీయ అర్హతా పరీక్ష (నీట్)ను ముందుగా క్లియర్ చెయ్యాల్సి వుంటుంది. ఇది తప్పనిసరి చేసినపుడు మాత్రమే సమర్థులైన విద్యార్థులకు అవకాశాలు లభిస్తాయని భావిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం దేశంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలలో వైద్య విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులు 2016 నుండి అమలులోకి వచ్చిన నీట్‌లో అర్హతను సంపాదించాల్సి వుంటుంది. కాగా విదేశీ యూనివర్శిటీలలో వైద్య విద్యాభ్యాసానికి నీట్ ఉత్తీర్ణతను తప్పనిసరి చేసే ప్రతిపాదన ప్రస్తుతం కీలక దశలో వుందని ఆరోగ్యమంత్రిత్వశాఖకు చెందిన ఓ ఉన్నతాధికారి చెప్పారు. ప్రస్తుతం విదేశీ యూనివర్శిటీలలో వైద్య విద్యనభ్యసిస్తున్న వారు దేశీయంగా భారత వైద్య మండలి నిర్వహించే విదేశీ వైద్య పట్టభద్రుల పరీక్ష (ఎఫ్ఎంజిఇ)ను ఉత్తీర్ణులవ్వాల్సి వుంటుంది. విదేశాలలో వైద్యవిద్యను అభ్యసించి స్వదేశానికి తిరిగి వస్తున్న వారిలో కేవలం 12 నుండి 15 శాతం మేర మాత్రమే ఈ అర్హతను సాధించగలుగుతున్నారని అధికారులు చెప్పారు. వారు ఈ అర్హతను సాధించకుంటే భారత్‌లో వైద్య వృత్తి కొనసాగించేందుకు అనుమతి లభించదని వివరించారు.అటువంటి సందర్భాలలో వారు ఆమోదం లేని డిగ్రీలతో వైద్య వృత్తి చేపడుతున్నారన్నారు. అత్యంత ప్రమాదకరమైన ఈ ధోరణిని నివారించేందుకు, సమర్థులైన విద్యార్థులు మాత్రమే విదేశీ యూనివర్శిటీలలో వైద్య విద్యను అభ్యసించేందుకు వీలుగా ప్రభుత్వం ఈ ప్రయత్నాలు ప్రారంభించిందని వివరించారు. ఏటా దాదాపు 7 వేల మందికి పైగా విద్యార్థులు విదేశాలలో వైద్య విద్యనభ్యసించేందుకు వెళ్తున్నారు. వీరిలో అధికశాతం మంది చైనా, రష్యాలకు ప్రాధాన్యతనిస్తున్నారు. కొత్త ప్రతిపాదన అమలులోకి వస్తే విదేశాలలో వైద్యవిద్యను అభ్యసించిన వారు నీట్ పరీక్షను ఉత్తీర్ణులైన తరువాత మాత్రమే వారికి నిరభ్యంతర పత్రాన్ని (ఎన్ఓసి)కేంద్రం జారీ చేస్తుంది.

పెండింగ్‌లో హైకోర్టు జడ్జీల ఖాళీల భర్తీ సిఫార్సులు

న్యూఢిల్లీ : దేశంలోని మొత్తం 13 హైకోర్టుల్లో న్యాయమూర్తుల ఖాళీల భర్తీకి సంబంధించి దాదాపు 120కి పైగా సిఫార్సులు కేంద్ర ప్రభుత్వం, సుప్రీంకోర్టు వద్ద పెండింగ్‌లో వున్నాయని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. వివిధ హైకోర్టుల్లో మొత్తం మంజూరు చేసిన 1,079 పదవుల్లో 403 పదవుల భర్తీకి సంబంధించి తమ సిఫార్సులపై తుది నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నట్లు ఈ వర్గాలు వివరించాయి. ఇందుకు విరుద్ధంగా హైకోర్టుల్లో ఖాళీగా వున్న 280 ఖాళీలకు అర్హుల పేర్లను ఆయా కోర్టులు సూచించలేదని తెలుస్తోంది. హైకోర్టుల్లో న్యాయమూర్తుల ఖాళీల భర్తీకి సంబంధించి ఆయా కోర్టుల కొలీజియంలు చేసిన దాదాపు 123 సిఫార్సులు ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం, సుప్రీంకోర్టు కొలీజియం వద్ద పెండింగ్‌లో వున్నాయని ఉన్నతాధికార వర్గాలు వివరించాయి.

బూటకపు హామీలతో త్రిపురలో బిజెపి మ్యానిఫెస్టో

ప్రచారంలో దూసుకుపోతున్న లెఫ్ట్ ఫ్రంట్



అగర్తల : త్రిపుర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బిజెపి తన మ్యానిఫెస్టోను ఆదివారం విడుదల చేసింది. ఈ మ్యానిఫెస్టోపై సామాన్యులు పెదవి విరుస్తున్నారు. ముఖ్యంగా జాతీయ ఉపాధి హామీ వేతనాలను పెంచుతామనే హామీ హస్యాస్పదంగా ఉందని, మోడీ లక్ష్యాలకు ఇది విరుద్ధంగా ఉందని వారు అంటున్నారు. త్రిపురలో జాతీయ ఉపాధి పథకాన్ని మోడీ నిలుపుచేశారని, ఇప్పుడు ఆ పథకం వేతనాలు పెంచుతామని అంటున్నారని ఒక ఆటో డ్రైవర్ బాబుల్ దే విమర్శించారు. ఉపాధి హామీ వేతనాలు పెంపుతో పాటు.. ప్రతీ ఇంటికి ఒక ప్రభుత్వ ఉద్యోగం, యువతకు స్మార్ట్ ఫోన్లు, బాలికలకు డిగ్రీ వరకూ ఉచిత విద్య.. వంటి హామీలు బిజెపి మ్యానిఫెస్టోలో ఉన్నాయి. బిజెపి హామీలు నమ్మశక్యంగా లేవని సామాన్యులు వ్యాఖ్యానిస్తున్నారు. అలాగే అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి అవకాశాలపై ఆ పార్టీ సీనియర్ నేత అతుల్ దేబ్బర్మాన్ సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేక రాష్ట్రాన్ని డిమాండ్ చేస్తున్న ఐపిఎఫ్‌టితో బిజెపి పొత్తు కుదుర్చుకోవడం మోసపూరిత చర్య అని ఆయన వ్యాఖ్యానించారు. క్షేత్రస్థాయిలో లెఫ్ట్ ఫ్రంట్ చాలా బలంగా వుందని ఆయన అంగీకరించారు.

మరోవైపు లెఫ్ట్‌ఫ్రంట్ ప్రచారం ఉధృతంగా సాగుతుంది. రాష్ట్రంలో 5వసారి లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వం అధికారం చేపట్టడం ఖాయమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు, ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్, పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్, ఎండి సలీమ్ రాష్ట్ర వ్యాప్తంగా భారీ బహిరంగ సభల్లో పాల్గొంటున్నారు. వీటికి మంచి ఆదరణ లభిస్తోంది. బిజెపి తరుపున ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, సన్యాసులు, ఆ పార్టీ కార్యకర్తలతోపాటుగా ప్రచారంలో పాల్గొంటున్నారు. వీరంతా కోల్‌కతా, లక్నో నుంచి త్రిపురకు విమానాల్లో చేరుకుంటున్నారు.

అవినీతిలో బిజెపి ప్రపంచ రికార్డ్

- కర్ణాటక ఎన్నికల ప్రచార సభలో రాహుల్
- కాంగ్రెస్ పాలనలో అవినీతే లేదు
- బిజెపి హయాంలో అన్నీ కుంభకోణాలే
- ముగ్గురు ముఖ్యమంత్రులు మారారని విమర్శ
- కాంగ్రెస్‌కు మద్దతివ్వాలని పిలుపు



కొప్పాల్ (కర్ణాటక) : అవినీతిలో బిజెపి ప్రపంచ రికార్డులను బద్దలు కొట్టిందని కాంగ్రెస్ అధ్యక్షులు రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. కర్ణాటకలో కాంగ్రెస్ నేతృత్వంలోని సిద్ధరామయ్య ప్రభుత్వం అవినీతి రహిత పాలనను అందించిందని,రాష్ట్రంలో బిజెపి అధికారంలో ఉన్నప్పుడు పలు అవినీతి కుంభకోణాలు చోటు చేసుకున్నాయని వెల్లడించారు. రాహుల్ కర్ణాటకలో రెండు రోజులుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఉత్తర కర్ణాటకలోని ఇకొప్పాల్ జిల్లాలో 'జనాశీర్వాద్ యాత్ర'లో భాగంగా ఆయన పలు బహిరంగ సభలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ, గడిచిన ఐదేళ్ళలో రాష్ట్రంలో ఒక్క అవినీతి కుంభకోణం కూడా జరగలేదని, బిజెపి పాలనలో మైనింగ్ నుంచి అనేక కుంభకోణాలు ఒకదాని తరువాత ఒకటి చోటు చేసుకున్నాయని ధ్వజమెత్తారు.

"వచ్చే శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి, సిద్ధరామయ్యకు మద్దతివ్వాలని, మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి తామందరం కలిసికట్టుగా కృషిచేస్తామని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రానికి చెందిన నాయకులతో కలిసి ప్రత్యేక బస్సులో ప్రయాణిస్తున్న రాహుల్ గాంధీ పర్యటనకు ఉత్తేజపూరితమైన స్పందన లభిస్తోంది.. రాహుల్‌గాంధీ మధ్యమధ్యలో బస్సు దిగి ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య, తదితర నేతలతో కలిసి కొద్ది దూరం నడిచివెళ్తూ ప్రజలను కలుసుకుంటున్నారు. రాష్ట్రంలో బిజెపి అధికారంలో ఉన్న సమయంలో సృష్టించిన అవినీతి రికార్డును గురించి పట్టించుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వపాలనలో అవినీతి గురించి మోడీ మాటాడుతుంటారని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో బిజెపి పాలనలో ముగ్గురు ముఖ్యమంత్రులు మారారని, నలుగురు మంత్రులు జైలుకెళ్ళి రాజీనామా చేశారని రాహుల్ గుర్తు చేశారు.

రాష్ట్రంలో 2008 నుంచి ఐదేళ్ళు బిజెపి ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో బిఎస్ యడ్యూరప్ప, సదానంద గౌడ, జగదీష్ షెట్టార్‌లు ముఖ్యమంత్రులుగా పనిచేశారు. "కర్ణాటకలో అంతకుముందున్న బిజెపి ప్రభుత్వం అవినీతిలో ప్రపంచ రికార్డులను బద్దలు కొట్టింది.వారు ఇక్కడకు వచ్చి అవినీతిపై మనల్ని ఎత్తి చూపుతున్నారు." అని రాహుల్ అన్నారు.

రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతివ్వాలని ప్రజలను కోరారు.. అత్యంత వేగంగా కర్ణాటక పురోగతి సాధించే దిశగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

హైదరాబాద్-కర్ణాటక ప్రాంతానికి ప్రత్యేక హోదాను ఇస్తూ రూపొందించిన ఆర్టికల్ 371(జె) అమలు చేసింది తమ ప్రభుత్వమేనని రాహుల్ చెప్పారు. ఎన్డీయే పాలనలో అప్పటి ఉప ప్రధాన మంత్రి ఎల్‌కె అద్వాని ప్రత్యేక హోదాను ఇవ్వనని చెప్పారన్నారు. ప్రత్యేక హోదా ఇవ్వడం వల్ల మరిన్ని ఇబ్బందులు ఎదురవుతాయని అన్నారని రాహుల్ ఆరోపించారు. ఇతరులు కూడా ఇటువంటి డిమాండ్లే చేస్తారని అద్వాని అప్పట్లో చెప్పినట్లు తెలిపారు.

దేశంలో వ్యవసాయ సంక్షోభం నెలకొన్నప్పటికి కేంద్ర ప్రభుత్వం రైతు రుణాలను రద్దు చేయడం లేదని రాహుల్ విమర్శించారు. రైతు రుణాలు రద్దు చేస్తూ కర్ణాటక ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆయన ప్రశంసించారు. బిజెపికి, కాంగ్రెస్‌కు మధ్య ఉన్న తేడా ఇదేనన్నారు. నిరుద్యోగం, పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టి తదితర అంశాలపై మోడీని లక్ష్యంగా చేసుకుని రాహుల్ పలు విమర్శలు చేశారు. జిఎస్‌టిని గబ్బర్‌సింగ్ టాక్స్‌గా అభివర్ణించారు.

ముస్లిం పర్సనల్ లా బోర్డు నుంచి మత బోధకుడు నద్వీ బహిష్కరణ

న్యూఢిల్లీ : మత బోధకుడు సల్మాన్ నద్వీని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఎఐఎంపిఎల్‌బి) ఎగ్జిక్యూటివ్ నుండి బహిష్కరించారు. . అయోధ్య నుంచి బాబ్రీ మసీదు ఉన్న ప్రదేశాన్ని తరలించాలని సూచించినందుకు ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆయనపై వేటు వేసింది. ఆయన బోర్డు వైఖరికి వ్యతిరేకంగా వ్యవహరించాడని పేర్కొంది. అయోధ్యలోనే మసీదు నిర్మించాలన్న తమ వైఖరిలో ఎటువంటి మార్పు లేదని ఆదివారం మరోమారు స్పష్టం చేసింది. "ఎఐఎంపిఎల్‌బి అంతకుముందు వైఖరినే కొనసాగిస్తోంది. మసీదును బహుమతిగా ఇవ్వబోము, అమ్మ బోము, బదిలీచేయబోము. బోర్డు తీసుకున్న ఈ ఏకగ్రీవ వైఖరికి సల్మాన్ వ్యతిరేకంగా వ్యవహరించినందు వల్ల బోర్డు నుండి బహిష్కరించాం" అని ఎఐఎంపిఎల్‌బి సభ్యుడు ఖాసిమ్ ఇలియాస్ తెలిపారు. హైదరాబాద్‌లో శనివారం జరిగిన ఎఐఎంపిఎల్‌బి 26వ ప్లీనరీ సందర్భంగా అయోధ్యలోని వివాదాస్పద ప్రాంతం నుంచి మసీదును తరలించాలని, ఆ ప్రదేశంలో యూనివర్సిటి నిర్మాణాన్ని పరిశీలించాలని చెప్పారు.

తృటిలో తప్పిన ఘోర విమాన ప్రమాదం

అత్యంత సమీపంలోకి వచ్చిన ఎయిర్ ఇండియా, విస్తారా విమానాలు



ముంబయి : రెండు విమానాలు అత్యంత సమీపంలోకి వచ్చి 'ఢీ' కొనే ప్రమాదం తృటిలో తప్పిపోయింది.ఈ నెల 7న ఢిల్లీ నుంచి పుణే ప్రయాణిస్తున్న విస్తారా యుకె 997 విమానం, భోపాల్ నుంచి వస్తున్న ఎయిర్ ఇండియా ఎఐ 631 విమానం రెండూ ముంబయి విమానాశ్రయం వద్ద కేవలం 100 అడుగుల సమీపంలోకి వచ్చిన ఘటన కలకలం సృష్టించింది. విస్తారా విమానంలో 152 మంది ప్రయాణీకులు ఉండగా, ఎయిర్ ఇండియా విమానంలో 109 ప్రయాణీకులు వున్నారు. విస్తార విమానం దగ్గరగా వచ్చిన ఘటనపై ఎయిర్ ఇండియా ఫ్లైయిట్ కెప్టెన్ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఇన్‌స్ట్రుమెంట్ వార్నింగ్ పని చేయడంతో ఈ ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డామని ఎయిర్ ఇండియా సిబ్బంది చెబుతున్నారు. సిగ్నిల్స్ వచ్చిన తరువాతే ఎయిర్ ఇండియా విమానం వెళ్లిందని, ఇందులో వారి తప్పు లేదని విమానాశ్రయ అధికారులు కూడా తెలిపారు. ఎయిర్ ఇండియా-విస్తారా విమానాలు దగ్గరగా వచ్చి, పెను ప్రమాదం తప్పిన ఘటనపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఎఎఐబి) విచారణ ప్రారంభించింది. మరో వైపు ఈ ఘటనలో తమ ఇద్దరి పైలెట్లపై విచారణ చేస్తున్నట్లు విస్తారా ప్రకటించింది.

ధనిక నగరాల్లో ముంబయికి 12వ స్థానం

నగర వాసుల మొత్తం సంపద 95 వేల కోట్ల డాలర్లు

ముంబయి : భారత ఆర్థిక రాజధాని ఇప్పుడు ప్రపంచంలోని ధనిక నగరాల జాబితాలో స్థానం సంపాదించింది. ఈ జాబితాలో న్యూయార్క్ నగరం అగ్రభాగాన నిలవగా ముంబయికి 12వ స్థానం దక్కింది. ముంబయి తరువాతి స్థానాలలో ఫ్రాంక్‌ఫర్ట్, పారిస్ నగరాలు నిలిచాయి. నగర వాసుల మొత్తం సంపద అంటే ప్రతి వ్యక్తి ఆధీనంలో వుండే ప్రైవేటు ఆస్తి మొత్తాన్ని పరిగణనలోకి తీసుకున్నట్లు అధ్యయన నిర్వాహక సంస్థ న్యూ వరల్డ్ వెల్త్ వెల్లడించింది. ఇందులో ఆస్తి, నగదు, ఈక్విటీలు, వ్యాపార ప్రయోజనాల వంటి వాటిని కలిపామని, రుణ బాధ్యతలను మినహాయించామని నిర్వాహకులు వివరించారు. ఈ గణాంకాల నుండి ప్రభుత్వ నిధులను మినహాయించినట్లు చెప్పారు. ధనిక నగరాల జాబితాలో టాప్ 15 జాబితాలో చోటు దక్కించుకున్న ముంబయి, శతకోటీశ్వరుల సంఖ్యలో పదో స్థానంలో నిలిచింది. వ్యక్తిగతంగా వందకోట్ల డాలర్లు, అంతకు మించిన సంపద వున్న 28 మంది శతకోటీశ్వరులకు ఈ నగరం కేంద్ర స్థానంగా నిలిచింది. దీనితో పాటు అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల జాబితాలో సైతం ముంబయికి స్థానం దక్కనున్నదని ఈ సంస్థ తెలిపింది. తాజాజాబితాలో మొత్తం 3 లక్షల కోట్ల డాలర్ల సంపదతో న్యూయార్క్ అగ్రస్థానంలో నిలవగా, తరువాతి స్థానాలలో లండన్, టోక్యో, శాన్‌ఫ్రాన్సిస్కో, బీజింగ్, షాంఘయి, లాస్‌ఏంజెల్స్, హాంకాంగ్, సిడ్నీ, సింగపూర్, చికాగో నగరాలకు స్థానం దక్కింది. ఈ జాబితాలో చోటు దక్కని నగరాలలో హోస్టన్, జెనీవా, సియోల్, ఒసాకా, షెంజెన్, మెల్బోర్న్, జూరిచ్, డల్లాస్ తదితర నగరాలున్నాయి.

ప్రత్యేకం

దేశంలో పెరుగుతున్న మత హింస

నిప్పుతో చెలగాటమాడుతున్న బిజెపి

న్యూఢిల్లీ : దేశంలో ఇటీవలి కాలంలో మత హింస పెరుగుతున్న మాట అవాస్తవమేమీ కాదు. మత హింస ఘటనలు క్రమంగా పెరుగుతున్నాయని ప్రభుత్వం సైతం అంగీకరించింది. ఈ నెల 6వ తేదీన పార్లమెంట్‌లో ఒక ప్రశ్నకు సమాధానం చెప్పిన సహాయ మంత్రి హన్స్‌రాజ్ అహిర్ గత ఏడాది కాలంలో అధికారికంగా నమోదయిన 822 మత హింస ఘటనల్లో 111 మందికి పైగా మరణించారని, 2,500 మందికి పైగా గాయపడ్డారని వివరించారు. 2016లో మొత్తం 751 ఘటనలు నమోదు కాగా 97 మంది మరణించారని, 703 మందికి పైగా గాయపడ్డారని ఆయన చెప్పారు. మంత్రి వెల్లడించిన ఈ విషయం ఆశ్చర్యకరమైనదేమీ కాదు. గోరక్షణ, తిరంగా యాత్ర తదితర పేర్లతో అధికార పార్టీకి చెందిన యువజన విభాగం కార్యకర్తలు ముస్లింలు నివసించే ప్రాంతాలలో జాతీయ పతాకంతో సంచరిస్తూ పాకిస్తాన్ వ్యతిరేక నినాదాలు చేస్తూ ముస్లింలను కించ పరిచే ప్రయత్నం చేస్తున్న విషయం తెలిసిందే. ఇందుకు విదేశాంగ విధానాన్ని కూడా వారు పావుగా మార్చుకుంటున్నారు. ముస్లింలను రెచ్చగొట్టేందుకు పాకిస్తాన్ వ్యతిరేక నినాదాలు చేస్తూ దేశంలో ముస్లింలందరూ ఇస్లామాబాద్ వెళ్లిపోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇది ఖచ్చితంగా ఎన్నికల ప్రయోజనాలకోసం ఉద్దేశించిందేనని చెప్పకతప్పదు. ఇటీవల గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ, అంతకుముందు సైన్యం పాకిస్తాన్‌పై జరిపిన సర్జికల్ దాడుల ఉదంతాన్ని యుపి అసెంబ్లీ ఎన్నికల్లో ఉపయోగించుకోవటమే ఇందుకు నిదర్శనం. ఇది కాకుండా ఇటీవల చోటు చేసుకున్న రెండు ఘటనలు మతహింసపై సామాన్యుడి ఆలోచనలకు పదును పెడుతున్నాయి. కస్‌గంజ్ ఘటనలో తిరంగా యాత్ర పేరుతో రిపబ్లిక్ డే రోజు ముస్లింలు నివశించే ప్రాంతంలో కాషాయ మూక జాతీయ జెండాను ఎగురవేస్తూ చేసిన అల్లరి ఫలితంగా చందన్ గుప్తా అనే హిందూ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఆ తరువాత ముస్లింలకు చెందిన ఇళ్లు, వ్యాపార సంస్థలపై ఉద్దేశపూర్వకంగానే దాడులు చేసి వాటికి నిప్పు పెట్టారు. దీనిపై స్పందించిన రాష్ట్రగవర్నర్‌గా వున్న బిజెపి సీనియర్ నేత రామ్ నాయక్ సైతం ఇది రాష్ట్రంపై 'మాయని మచ్చ' అంటూ అభివర్ణించారు. పరిస్థితిని అదుపు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టామని చెబుతున్న ఆదిత్యానాథ్ సర్కారు ఆచరణలో మాత్రం విఫలమైంది. . మృతుడి సోదరి కీర్తి మీడియాతో మాట్లాడుతూ హింసకు దారి తీస్తున్న తిరంగా యాత్రలకు ఇప్పటికైనా తెరదించాలని డిమాండ్ చేశారు. తన కుటుంబాన్ని గుర్తు తెలియని వ్యక్తులు బెదిరించారని ఆమె చెప్పారు.

అలాగే న్యూఢిల్లీలోని రఘువీర్ నగర్‌లో జరిగిన పరువు హత్య ఘటనను ఇందుకు మరో ఉదాహరణగా చెప్పవచ్చు. ముస్లిం యువతితో సంబంధాన్ని కొనసాగిస్తున్న అంకిత్ సక్సేనా అనే యువకుడిని ఆ యువతి కుటుంబ సభ్యులునరికి చంపారు. ఈ ఘటనను మత హింసతో ముడిపెట్టవద్దంటూ మృతుడి కుటుంబ సభ్యులు చేసిన విజ్ఞప్తులు అరణ్యరోదనే అయింది. కొందరు మతోన్మాద శక్తులు ఈ ప్రాంతంలోని ముస్లింలను వెలివేయాలని డిమాండ్ చేసినప్పటికీ స్థానికులు దానిని గట్టిగా తిరస్కరించారు. ఈ రెండు ఘటనలకు సంబంధించిన ఇద్దరు జిల్లా ఉన్నతాధికారులు స్పందించిన తీరు ఆసక్తికరంగా మారింది. 'ముస్లింలు ఎక్కువగా నివశించే ప్రాంతాలలో బలవంతంగా ఊరేగింపులు చేయటం, అక్కడ పాకిస్తాన్ వ్యతిరేక నినాదాలు చేయటం ఒక వింత ధోరణిగా మారిందని' బరేలీ జిల్లా మేజిస్ట్రేట్ రాఘవేంద్ర విక్రమ్ ఫేస్‌బుక్‌లో వ్యాఖ్యానించారు. తరువాత ఆయన పోస్ట్ చేసిన ఈ వ్యాఖ్య తొలగించబడటం గమనార్హం. జాతీయ వాదంపేరుతో మువ్వన్నెల జెండాతో కొనసాగిస్తున్న కవ్వింపుచర్యల వెనుక 'కాషాయ అజెండా'ను ప్రోత్సహించటమే ముఖ్యోద్దేశంగా కన్పిస్తోందని మరో యువ అధికారి రష్మీ వరుణ్ వ్యాఖ్యానించారు. ఈ ఇద్దరు అధికారులూ తమ రాజకీయ వ్యాఖ్యల ద్వారా అధికార పరిధి దాటి వ్యవహరించారన్నది నిర్వివాదాంశం. యుపిలో మత శాంతికి కలుగుతున్న ఆటంకాలు ఉత్తర భారతంలోని ఈ ప్రాంతంతో పాటు యావద్దేశంపైనా తీవ్ర ప్రభావాన్నే చూపుతాయని చెప్పవచ్చు. హిందువులు మైనార్టీలుగా వున్న పంజాబ్‌లో 1985-95 మధ్య కొనసాగిన మత హింస పరిణామాలు అందరికీ తెలిసినవే.. న్యూఢిల్లీ నుండి నేపాల్ సరిహద్దుల వరకూ వున్న షహరన్‌పూర్, మీరట్, మొరాదాబాద్, బిజ్నోర్, జ్యోతాబాపూలే నగర, ముజఫర్ నగర్, రాంపూర్, బరేలీ వంటి జిల్లాలన్నింటినీ కలిపితే అల్బేనియా వంటి ఒక దేశానికి సమానమవుతుంది. ఈ జిల్లాలన్నింటిలోనూ ముస్లిం జనాభా గణనీయమైన సంఖ్యలోనే వుంది. ఈ ప్రాంతానికి చెందిన ప్రముఖులందరూ పాకిస్తాన్ ఏర్పాటులో కీలక పాత్ర పోషించినప్పటికీ, ఇక్కడి సగటు ముస్లిం మాత్రం భారత్‌లోనే వుంటానని ఢంకా బజాయించి మరీ చెప్పాడు. అయితే ఈ ప్రాంతంలోనూ కాషాయశక్తులు మతపరంగా శాశ్వతమైన విభజనకు ప్రయత్నించాయి. తమ మతం, సంస్కృతి అంతరించి పోతోందంటూ ఎదుటి వారి జాతీయతను ప్రశ్నించే ప్రయత్నం చేశారు. ఈ ప్రాంతంలో అనేక పర్యాయాలు మతపరమైన హింస చోటు చేసుకుంది. 1980లో మొరాదాబాద్, 1982, 87, 1990-91 ప్రాంతంలో మీరట్, 1990లో బిజ్నోర్, 1988, 2013లో ముజఫర్ నగర్‌లలో చేసుకున్న హింసను ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ప్రభుత్వ హయాంలో కొనసాగుతున్న మెజార్టీ ప్రజల ఓటు బ్యాంకు రాజకీయాలతో ఈ ప్రాంతంలో తీవ్ర హింస చెలరేగే ప్రమాదం లేకపోలేదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మతపరంగాదేశాన్ని విభజించటం వల్ల జరిగిన రక్తపాతం ఉపఖండంలోని దేశాలకు గట్టి గుణపాఠంగా మారింది. వివిధ వర్గాల ప్రజలు ప్రశాంతంగా జీవించాలంటే ఇందుకు మైనార్టీలతోపాటు, మెజార్టీ వర్గం వారిది కూడా కీలక బాధ్యత వుంది. భారతీయ ముస్లింలు ఇప్పుడు ఎక్కడికీ వెళ్లేపరిస్థితి లేదు. యూనివర్శిటీ ఆఫ్ సౌత్ ఆస్ట్రేలియా నిర్వహించిన అధ్యయనం ప్రకారం 2050 నాటికి భారత్‌లో హిందూ జనాభా 36 శాతం మేర పెరిగి 103 కోట్లకు చేరుతుందని తెలుస్తోంది. ముస్లింల జనాభా సైతం 76 శాతం మేర పెరిగి 31 కోట్లకు చేరుతుందని ఈ అధ్యయనం ద్వారా తెలుస్తోంది. దేశంలో 77 శాతం మేర వున్న హిందువులు ఇప్పటికీ మెజార్టీ జనాభాగానే కొనసాగుతున్నారు. వీరితో పాటు ముస్లింల పెరుగుదల కూడా 14 నుండి 18 శాతం మేర వుండవచ్చని అధ్యయన నిర్వాహకులు అంచనా వేశారు. ఇప్పుడు దేశ జనాభా విపరీతంగా పెరగటం అంటే వెనుకబాటు తనాన్ని కోరి తెచ్చుకోవటమే. ఇది సవాలుగా మారక తప్పని పరిస్థితి. ముస్లింలను ఆకర్షించేందుకు 'ఘర్ వాపసీ' వంటి కార్యక్రమాలు చేపట్టటం, ముస్లింలను బంగ్లాదేశ్, పాకిస్తాన్‌లకు పంపేయాలని పిలుపునివ్వటం వంటి చర్యలన్నీ భ్రమల్లో భాగం మాత్రమే. దక్షిణాసియాలోనే అత్యధిక జనాభా వున్న మన దేశంలో కలిసి జీవించేందుకు పుష్కలమైన అవకాశాలున్నాయి. స్వల్పకాలిక ఎన్నికల ప్రయోజనాలను దృష్టిలోవుంచుకుని మతాల మధ్య చిచ్చు పెట్టేందుకు రాజకీయ నేతలు ప్రయత్నించటం విచారకరం.

సంక్షిప్తం

రాఫెల్ ఒప్పందం వివరాలు వెల్లడించండి : ఆంటోని

కొచ్చి : వివాదాస్పద రాఫెల్ యుద్ధ విమానాల ఒప్పందానికి సంబంధించిన అన్ని వివరాలను వెల్లడించాలని రక్షణ శాఖ మాజీ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఎ.కె. ఆంటోని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఫ్రాన్స్‌తో కుదుర్చుకున్న రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించిన ధరతో పాటు ఇతర నియమ నిబంధనలను వెల్లడించాలని ఆయన ఆదివారం కోరారు. ఈ ఒప్పందం వివరాలను వెల్లడించడం మినహా ప్రభుత్వానికి ప్రత్యామ్నాయం లేదని అంటూ, వివరాలు వెల్లడించడం ద్వారా ప్రజలకు అవగాహన కలగడమే కాకుండా, దీనిపై నెలకొన్న సందేహాల నివృత్తికి అవకాశం వుంటుందని సూచించారు.

యుపిలో న్యాయ విద్యార్థిపై దాడి

అలహాబాద్ : ఉత్తరప్రదేశ్ అలహాబాద్‌లో 26 ఏళ్ళ న్యాయ విద్యార్థిని కొంతమంది దుండగులు హాకీ కర్రతో చితక బాదారు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమంలో హల్‌చల్ చేస్తోంది. కోమాలోకి వెళ్ళిన ఆ విద్యార్థి ఆదివారం ఉదయం ఆసుపత్రిలో మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి ప్రధాన నిందితుడ్ని గుర్తించినప్పటికీ ఇప్పటి వరకు ఎవరినీ అరెస్టు చేయలేదు. అటుగా వెళ్తున్న ఒక వ్యక్తి ఈ సంఘటన మొత్తాన్ని మొబైల్ ఫోన్‌లో చిత్రీకరించారు. బాధితుడు దిలీప్ సరోజ్ రెస్టారెంట్ మెట్లపై స్పృహలేకుండా పడి పోయిన దృశ్యం ఇందులో కనిపిస్తోంది.

హాంగ్‌కాంగ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

19 మంది మృతి, 60 మందికి గాయాలు

హాంగ్‌కాంగ్: హాంగ్‌కాంగ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. డబుల్‌డెక్కర్ బస్సు బోల్తా పడటంతో 19 మంది మృతి చెందారు. మరో 60 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బస్సు డ్రైవర్ పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడంతో పాటు బస్సును నిర్లక్ష్యంగా నడపడంతో ప్రమాదం సంభవించిందని అధికారులు తెలిపారు. ఇప్పటికే బస్సుపై అంతస్తులో చిక్కుకున్న ప్రయాణికులను రక్షించేందుకు కట్టర్లను వినియోగించారు. మృతుల్లో 15మంది పురుషులుకాగా మిగతావారంతా మహిళలు. మృతదేహాలు, క్షతగాత్రులతో ఆ ప్రదేశమంతా రక్తసిక్తమైంది. బాధిత కుటుంబాలకు 10,230 డాలర్ల నష్టపరిహారం ఇస్తామని ది కవ్లూన్ మోటార్ బస్ కో సంస్థ ప్రకటించింది. ఈ ఘటనపై దర్యాప్తు నిర్వహిస్తామని సంస్థ చెప్పింది.

'బ్రెగ్జిట్ పంథా' పై త్వరలో మరిన్ని వివరాలు

లండన్ : యురోపియన్ యూనియన్ నుండి బ్రిటన్ వైదొలగేందుకు అనుసరించాల్సిన పంథాకు సంబంధించి మరిన్ని వివరాలను వెల్లడిస్తూ ప్రధాని థెరిస్సా మే రాబోయే వారాల్లో ప్రసంగించనున్నారు. ఇయు నుండి సాఫీగా, సజావుగా వైదొలగేందుకు పరివర్తనా ఒప్పందం చేసుకోవాలని బ్రిటన్ భావిస్తోంది. ఈ ఏడాది చివరి నాటికి దీర్ఘకాలిక వాణిజ్య ఒప్పందాన్ని కూడా కుదుర్చుకోవాలని యోచిస్తోంది. అయితే పరివర్తనా ఒప్పందమనేది ఖచ్చితంగా కుదుర్చుకుంటామని భావించలేమని యూరో పియన్ యూనియన్ గత వారం పేర్కొంది.

ఎయిర్ షో

ఆసియాలో అతిపెద్ద ఎయిర్ షో అయిన సింగపూర్ ఎయిర్ షో ఆదివారంతో ముగిసింది. ఈనెల ఆరో తేదీ నుండి ప్రారంభమైన ఈ ఎయిర్ షోను సాధారణ ప్రజలు వీక్షించేందుకు శని, ఆదివారాలు ఓపెన్ చేశారు. దీంతో వీక్షకులు పెద్ద ఎత్తున పోటెత్తారు.



లంక స్థానిక ఎన్నికల్లో భారీ విజయం దిశగా రాజపక్సే పార్టీ

కొలంబో: శ్రీలంక మాజీ అధ్యక్షుడు మహింద రాజపక్సే నేతృత్వంలోని శ్రీలంక పొదుజన పెరమున (శ్రీలంక పీపుల్స్ ఫ్రంట్) శనివారం జరిగిన స్థానిక ఎన్నికల్లో భారీ విజయం దిశగా దూసుకుపోతోంది. ప్రాథమిక ఫలితాల ప్రకారం రాజపక్సే మద్దతుదారులు 2016లో ఏర్పాటు చేసిన ఈ కూటమి అనూహ్యరీతిలో విజయపథంలో దూసుకుపోతున్నట్లు తెలుస్తోంది. ఈ ఎన్నికలల్లో ఎస్‌ఎల్‌పిపి పోటీ చేయటంతో ఎక్కువగా త్రిముఖ పోటీలు జరిగాయి. ప్రధాని రణిల్ విక్రమసింఘే నేతృత్వంలోని యునైటెడ్ నేషనల్ పార్టీ (యుఎన్‌పి), అధ్యక్షుడు మైత్రీపాల సిరిసేన నేతృత్వంలోని శ్రీలంక ఫ్రీడమ్ పార్టీ (ఎస్‌ఎల్‌ఎఫ్‌పి)లు ప్రధాన ప్రత్యర్థులుగా బరిలో నిలిచాయి. అయితే ఎస్‌ఎల్‌ఎఫ్‌పిలోని ఒక వర్గం రాజపక్సేకు చెందిన ఎస్‌ఎల్‌పిపిని సమర్థించటంతో ఆ పార్టీ అనూహ్యరీతిలో అగ్రభాగాన నిలిచింది. జాతీయ సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వాములుగా వున్న ఎస్‌ఎల్‌ఎఫ్‌పి, యుఎన్‌పి అనునిత్యం ఉద్రిక్తతల మధ్య కొట్టుమిట్టాడతున్న విషయం తెలిసిందే. దీనితో ఈ రెండు పార్టీలు వేర్వేరుగా బరిలోకి దిగాలని నిర్ణయించుకోవటంతో స్థానిక ఎన్నికలకు జాతీయ స్థాయిలో ప్రాధాన్యత ఏర్పడింది. ఆదివారం ఉదయం వరకూ అందిన ఫలితాలలో ఎస్‌ఎల్‌పిపి సింహళ మెజార్టీ ప్రాంతాలలో తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఎన్నికల్లో అనూహ్యరీతిలో విజయం లభించటంతో 'ప్రశాంతం'గా సంబరాలు చేసుకోవాలని రాజపక్సే తన మద్దతుదారులకు సూచించారు. తమిళుల ఆధిపత్యం వున్న ఉత్తర ప్రాంతంలో తమిళ జాతీయ కూటమి పొత్తుతో బరిలోకి దిగిన ఇల్లంకయి తమిళ్ అరసు కచ్చి (ఐటాక్) అనేక ప్రాంతాల్లో తన ఆధిక్యాన్ని కొనసాగిస్తోంది. అయితే జాఫ్నా తదితర ప్రాంతాలలో సిలోన్ తమిళ కాంగ్రెస్ గణనీయ ఫలితాలు సాధించగా కేట్స్, డెల్ఫ్ తదితర ప్రాంతాలలో ఈలమ్ పీపుల్స్ డెమొక్రాటిక్ పార్టీ ఆధిక్యంలో వున్నట్లు తెలుస్తోంది.

పాలస్తీనాకు క్యూబా మద్దతు

ఐక్యరాజ్య సమితి : పాలస్తీనా ప్రజలకు తమ మద్దతు వుంటుందని ఐక్యరాజ్య సమితిలో క్యూబా పునరుద్ఘాటించింది. ఐక్యరాజ్య సమితి లో క్యూబా రాయబారి నాన్సి రొడ్రిగజ్ పాలస్తీనా ప్రజల హక్కుల కమిటీ ఉపాధ్యక్షురాలిగా తిరిగి ఎన్నికైన నేపథ్యంలో ఆమె స్పందిస్తూ, పాలస్తీనాకు తమ సంఘీభావం వుంటుందని ప్రకటించారు. ప్రస్తుతం పాలస్తీనా ప్రజలు క్లిష్టమైన పరిస్థితులను ఎదుర్కొంటున్న తరుణంలో మన కృషిని ఇంకా ముమ్మరం చేయాల్సిన అవసరం వుందని కమిటీ సభ్యులను కోరారు. ఇజ్రాయిల్ రాజధానిగా జెరూసలేంను గుర్తిస్తున్నట్లు అమెరికా ఏకపక్షంగా ప్రకటించడాన్ని క్యూబా నిర్ద్వందంగా తిరస్కరిస్తోందని స్పష్టం చేశారు. ఇటువంటి చర్యలు ఐక్యరాజ్య సమితి నిబంధనావళిని తీవ్రంగా ఉల్లంఘిస్తాయని అన్నారు. పాలస్తీనా-ఇజ్రాయిల్ ఘర్షణలకు సక్రమమైన, శాశ్వతమైన పరిష్కార మార్గాన్ని క్యూబా కోరుకుంటోందని చెప్పారు. పాలస్తీనా ప్రజలకు స్వయం నిర్ణయాధికారహక్కు ఉండాలని కోరుకుంటున్నామన్నారు.

యెమెన్‌లో యుద్ధ నివారణకు చర్చలు

టెహరాన్ : యెమెన్‌లో యుద్ధానికి ముగింపు పలికేందుకు జరుపుతున్న కృషిలో భాగంగా శనివారం ఇరాన్ విదేశాంగ మంత్రి మహ్మద్ జావేద్ జరీఫ్, యెమెన్‌లోని హౌతి అన్సరుల్లా మూవ్‌మెంట్ ప్రతినిధి అబ్దుల్ సలామ్‌తో చర్చలు జరిపారు. తక్షణమే యెమెన్‌లో యుద్ధాన్ని ముగించాల్సిన అవసరాన్ని జరీఫ్ నొక్కి చెప్పారు. సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ కూటమి యెమెన్‌పై బాంబు దాడులు ఆపాలని కోరారు. యెమెన్‌లో నెలకొన్న విపత్కర పరిస్థితులను దృష్టిలో వుంచుకుని అంతర్జాతీయ సమాజం వెంటనే మానవతా సాయాన్ని అందచేయాల్సి వుందన్నారు. కాగా అబ్దుల్ సలామ్ ఇరాన్ మంత్రికి ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితులను వివరించారు.

గత ఐదేళ్లలో చైనాలో 7కోట్ల మందికి దారిద్ర్య విముక్తి

అధికార నివేదిక వెల్లడి

బీజింగ్ : చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ అధికారంలోకి వచ్చిన తర్వాత గత ఐదేళ్ళలో చైనాలో దారిద్ర్యం నుండి 6.853కోట్ల మంది ప్రజలు బయటపడ్డారని అధికార నివేదిక పేర్కొంది. అంటే ఏడాదికి దాదాపు కోటీ 30లక్షల మంది మంది దారిద్ర్యం నుండి విముక్తులయ్యారని తెలిపింది. 2012లో దేశంలో దారిద్ర్య రేటు 10.2శాతం వుండగా 2017లో 3.1శాతానికి పడిపోయింది. దారిద్ర్య నిర్మూలనలో ఇది అద్భుతమైన పురోగతి అని ఆ నివేదిక పేర్కొంది. 2020నాటికి చైనాలో సంపూర్ణంగా దారిద్ర్యాన్ని నిర్మూలించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గతేడాది చివరి నాటికి దాదాపు 3కోట్ల మంది చైనీయులు జాతీయ ధారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తున్నారని ప్రభుత్వం వార్తా సంస్థ తెలిపింది. గత మూడు దశాబ్దాల్లో దాదాపు 60కోట్ల మందిని దారిద్ర్యం నుండి బయటపడవేసినట్లు తెలిపింది. 2013లో బాధ్యతలు చేపట్టినప్పటి నుండి దారిద్ర్య నిర్మూలనకు జిన్‌పింగ్ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. వచ్చే మూడేళ్ళలో చైనా ఎదుర్కొనే మూడు అతి క్లిష్టమైన సవాళ్ళలో దారిద్ర్య నిర్మూలన ఒకటని విధాన రూపకర్తలు పేర్కొంటున్నారు. కాలుష్య నియంత్రణ కూడా అతిపెద్ద సవాలుగా మారింది. 2010 ధరల ప్రాతిపదికన చూసినట్టైతే 2300 యువాన్లు లేదా దాదాపు 350 అమెరికన్ డాలర్లు సంపాదించేవారు 2శాతం కన్నా తక్కువ మంది వున్నట్టైతే ఆ దేశాన్ని దారిద్ర్యాన్ని ఎదుర్కొంటున్న దేశాల జాబితాలో నుండి తొలగిస్తారు.



పాక్ మానవ హక్కుల నేత అస్మా జహంగీర్ కన్నుమూత



ఇస్లామాబాద్ : పాకిస్తాన్‌లో ప్రముఖ మానవ హక్కుల నేత, సీనియర్ లాయర్ అస్మా జహంగీర్ ఆదివారం లాహోర్‌లో గుండెపోటుతో కన్నుమూశారు. ఆమె వయస్సు 66 సంవత్సరాలు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు వున్నారు. ఆదివారం ఉదయమే ఆమెకు గుండెపోటు వచ్చిందని, వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ తుది శ్వాస విడిచారని సీనియర్ లాయర్ అదీల్ రాజా తెలిపారు. ఆమె మృతి వార్త తెలిసిన వెంటనే లాయర్లు, మానవ హక్కుల కార్యకర్తలు, రాజకీయ నేతలు అన్ని వర్గాల నుండి సంతాప సందేశాలు వెల్లువెత్తాయి. 1952లో జన్మించిన అస్మా జహంగీర్ 1978లో పంజాబ్ యూనివర్శిటీ నుండి ఎల్‌ఎల్‌బి పట్టా అందుకున్నారు. 1987లో పాకిస్తాన్ మానవ హక్కుల కమిషన్‌కు సహ వ్యవస్థాపకురాలిగా వున్నారు. 1993 వరకు కమిషన్ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. తదనంతర కాలంలో ఛైర్‌పర్సన్‌గా కూడా వున్నారు. దక్షిణాసియా మావన హక్కుల కమిషన్ ఉపాధ్యక్షురాలిగా కూడా ఆమె పనిచేశారు. ఐక్యరాజ్య సమితిలో ప్రత్యేకాధికారిగా ఆమె వ్యవహరించారు.

ఉద్రిక్తతలకు తెరదించండి..!

ఇజ్రాయిల్, సిరియాకు పుతిన్ విజ్ఞప్తి

మాస్కో: పశ్చిమాసియా ప్రాంతంలో రగులుతున్న ఉద్రిక్తతలకు తెరదించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు, సిరియా అధ్యక్షుడు అసద్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాంతంలో కొత్తగా ఉద్రిక్తతలు పెరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని పుతిన్ నెతన్యాహుకు సూచించినట్లు ఇంటర్‌ఫాక్స్ వార్తా సంస్థ వెల్లడించింది. సిరియాలో ఇజ్రాయిల్ పెద్దయెత్తున వైమానిక దాడులకు పాల్పడిన నేపథ్యంలో పుతిన్ ప్రధాని నెతన్యాహుకు ఫోన్ చేసి అక్కడి పరిస్థితిపై చర్చించారని క్రెమ్లిన్ వర్గాలను ఉటంకిస్తూ ఇంటర్‌ఫాక్స్ వెల్లడించింది. సిరియాలో వున్న రష్యన్ వైమానిక స్థావరాలపై ఇజ్రాయిలీ వాయుసేన దాడులు చేసిన నేపథ్యంలో ఇరువురునేతలూ తాజా పరిస్థితిని చర్చించారని ఈ సంస్థ తెలిపింది. తమ ఆధీనంలో వున్న ప్రాంతాలపై బాంబుదాడులు చేసి తిరిగి వస్తున్న ఇజ్రాయిలీ యుద్ధ విమానాన్ని శనివారం సిరియా సేనలు ప్రయోగించిన విమాన విధ్వంసక క్షిపణి కూల్చివేయటంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరుకున్నాయి. అంతకు ముందు ఇరాన్ మద్దతు ప్రకటించిన సిరియా సేనలతో ఇజ్రాయిలీ దళాలు పెద్దయెత్తున తలపడ్డాయి.

ఈజిప్ట్ సైన్యం దాడుల్లో 16మంది ఉగ్రవాదుల మృతి

కైరో : ఈజిప్ట్‌లోని రెస్టివ్ నార్త్ సినాయ్ ప్రాంతంలో ఆదివారం సైన్యం జరిపిన దాడుల్లో 16మంది ఉగ్రవాదులు మరణించారు. సరిహద్దు జిల్లాల్లో పరిస్థితులను అదుపు చేసేందుకు చేపట్టిన ఆపరేషన్‌లో భాగంగా ఈ దాడులు జరిగాయి. ఈ దాడుల సందర్భంగా ఉగ్రవాదులు ఉపయోగించిన లైసెన్స్ లేని మోటార్ బైక్‌లను, 11 వాహనాలను, ఆయుధాగారాలను, 66 ఉగ్రవాద కేంద్రాలను నాశనం చేసి అనుమానిస్తున్న 30మందిని అదుపులోకి తీసుకున్నారు. ఆపరేషన్ సినాయ్ 2018 సందర్భంగా



అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు పోలీసులు, సైన్యం తెలిపింది. 2011లో తిరుగుబాటు జరిగినప్పటి నుండి ఉత్తర సినాయ్‌లో అనేక ఉగ్రవాదదాడులు జరిగాయి. ఈ దాడులన్నీ ప్రధానంగా పోలీసులు, సైన్యాన్ని లక్ష్యంగా చేసుకునే జరిగాయి. 2013లో అప్పటి అధ్యక్షుడు మహ్మద్ మోర్సీని పదవీచ్యుతుడిని చేసిన తర్వాత మరింతగా పెరిగాయి. అప్పటి నుండి వందలాదిమంది పోలీసులు, సైనిక సిబ్బంది మరణించారు. దాంతో ఉత్తర సినాయ్‌లో సైనిక ఆపరేషన్లను చేపట్టారు.

మొదటి పేజీ తరువాయి

దుబాయ్ చమురు కంపెనీల్లో వాటా

10 శాతం వాటా ఇచ్చే విషయమై అవగాహనా ఒప్పంద పత్రం (ఎంఓయూ)పై రెండు దేశాలు సంతకాలు చేశాయి. తన విదేశీ పర్యటనలో భాగంగా మోడీ మూడు దేశాలలో పర్యటిస్తున్నారు. తొలుత జోర్డాన్ పర్యటించిన ఆయన అక్కడ నుంచి అరబ్ ఎమిరేట్స్ చేరుకున్నారు. అక్కడ ఆయనకు మహమ్మద్ బిన్ జియాద్ స్వాగతం పలికారు. తనకు స్వాగతం పలికిన జోర్డాన్ రాజుకు మోడీ కృతజ్ఞతలు తెలిపారు. తన పర్యటన రెండు దేశాల మధ్య సంబంధాలపై సానుకూల ప్రభావం చూపుతుందని మోడీ అన్నారు. భారత్-యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు మధ్య ఉన్న సంబంధం అమ్మకం దారు, కొనుగోలు దారుకు మధ్య ఉన్న సంబంధానికి మించిందని ప్రధాని మోడీ అన్నారు. అరబ్బు దేశాలతో భారత్ సంబంధాలు వృద్ధి చెందడాన్ని ఆయన ప్రశంసించారు. రెండు దేశాల మధ్య సంబంధాలు ప్రగాఢమైనవి, విస్తారమైనవని పేర్కొన్నారు. దుబాయ్‌లోని ఒపెరా హౌస్‌లో ఆదివారం అక్కడ నివసిస్తున్న భారతీయులతో మోడీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ ప్రపంచ దేశాలలో భారత్‌కు ఒక ప్రామాణికతను తెచ్చేందుకు తమ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. అరబ్ దేశాలలో నివసిస్తున్న భారతీయులు తమ కలలు నిజం చేసుకునే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ప్రపంచ బ్యాంకు రూపొందించిన సరళీకృత వాణిజ్య దేశాల ర్యాంకింగ్‌లో భారత్ ఇంతకుముందెన్నడూ లేని విధంగా 142వ స్థానం నుంచి 100వ స్థానానికి చేరుకుందన్నారు. దీంతోనే తాము సంతృప్తి చెందడం లేదని చెప్పారు. దాదాపు 20 నిముషాలపాటు మోడీ భారతీయులనుద్దేశించి ప్రసంగించారు. తమ ప్రభుత్వం అమలు చేసిన నోట్ల రద్దు, జిఎస్‌టి నిర్ణయాలను సమర్థించుకున్నారు.

ఆ లెక్కల నిగ్గు తేల్చండి

ఎంపిలను సిఎం అభినందించారు. బడ్జెట్ తొలి విడత సమావేశాల్లో జాతీయ స్థాయిలో గొంతెత్తి చాటామని, అదే స్ఫూర్తితో తదుపరి సమావేశాల్లోనూ నిరసనలు తెలిపి, డిమాండ్లను సాధించుకురావాలని వారికి పిలుపునిచ్చారు. నాలుగేళ్లలో రాష్ట్రానికి కేంద్రం ఏమేమి ఇచ్చిందో తెలుపుతూ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కంభంపాటి హరిబాబు విడుదల చేసిన ప్రకటనపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ ప్రచారం ప్రజల్లోకి తప్పుడు సంకేతాలను తీసుకువెడుతుందని, దీనిని అడ్డుకోవాలని అన్నారు. సమావేశానంతరం టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కళా వెంకట్రావు మీడియాతో మాట్లాడుతూ బిజెపి చెబుతున్నవన్నీ తప్పుడు లెక్కలేనన్నారు. అసంబద్ధ విభజనతో విడిపోయిన ఎపిని ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్రానిదేనని గుర్తు చేశారు. బడ్జెట్ కేటాయింపులపై అసంతృప్తిగా ఉన్నామని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాలకు అవసరమైన నిధుల కేటాయింపులు కేంద్ర బడ్జెట్‌లో లేవని తెలిపారు. విభజన చట్టం, ప్రత్యేక ప్యాకేజీలో పేర్కొన్నవన్నీ కేంద్రం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు పోరాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు.

రష్యాలో కూలిన విమానం

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సంతాపం తెలిపారు. ప్రమాద వార్త తెలిసిన వెంటనే రష్యా రవాణా మంత్రి మాక్సిమ్ సోకలోవ్ సంఘటనా స్థలానికి బయలుదేరి వెళ్లారు. కాగా, ప్రమాదానికి గురైన విమానం కొత్తదేనని సరతోవ్ విమాన సంస్థ ప్రకటించింది. ఈ విమానాన్ని సర్వీసులోకి తీసుకుని ఎనిమిది సంవత్సరాలు మాత్రమే అవుతుందని తెలిపింది. ఈ విమానాన్ని పలు అంతర్జాతీయ సర్వీసులకు కూడా నడిపినట్లు పేర్కొంది.

మరో ఇద్దరు జవాన్ల మృతి

గాలింపు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా మధ్యమధ్యలో కాల్పులు కొనసాగాయి. సంజువాన్ శిబిరంలోకి ఉగ్రవాదులు వెనుకవైపు నుంచి చొరబడినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. శనివారం తెల్లవారుఝామున 4.55 గంటలకు అక్కడున్న సెంట్రీలు అనుమానాస్పద కదలికలను పరిశీలిస్తుండగానే బంకర్ పేలుడు ఘటన జరిగింది. సంజువాన్ సైనిక శిబిరంలో దాదాపు 150కి పైగా నివాసాలుండగా, ఈ ఘటన అనంతరం అందులో నివసిస్తున్న వారు అక్కడి నుండి సురక్షిత ప్రాంతానికి తరలివెళ్లారు. ఈ క్రమంలో కొంతమంది పిల్లలకు, మహిళలకు గాయాలయ్యాయి. గాయపడిన వారిలో ఒక జూనియర్ సైనికాధికారి కుమార్తె కూడా ఉన్నారు. ఉగ్రవాదుల దాడి నేపథ్యంలో జమ్మూలో హై అలర్ట్ ప్రకటించారు. శిబిరానికి సమీపంలోని పాఠశాలలను, షాపింగ్ కాంప్లెక్స్‌లను మూసివేశారు. ఉగ్రవాదుల దాడిలో గాయపడిన ఒక మహిళ అక్కడే శిశువుకు జన్మనిచ్చింది. సైనిక శిబిరంలో ఉన్న ఆసుపత్రి వైద్యులు ఆమెకు వైద్య సహాయం అందించారు. రైఫిల్‌మాన్‌గా పేరున్న నజీర్ అహ్మద్, గర్భవతి అయిన అతని భార్య ఉగ్రవాదుల దాడిలో తీవ్ర గాయాలకు గురయ్యారు.

కార్పొరేట్ సేవలో మోడీ సర్కార్

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చినట్టుగా గొప్పగా చెప్పుకుంటున్నారని, అయితే, ఇది మాటల గారడి మాత్రమేనని చెప్పారు. వ్యవసాయ పంటలకు ఉత్పత్తిధర పైన అదనంగా 50 శాతం కలిపి మద్దతు ధర ఇచ్చినట్లు చెప్పిన కేంద్ర ప్రభుత్వం దీనికి 2వేల కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించిందని చెప్పారు. దేశ వ్యాప్తంగా ఈ పథకం పూర్తిస్థాయిలో అమలు కావడానికి కనీసం లక్ష కోట్ల రూపాయలు అవసరమవుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారని, ఆ దిశలో కేటాయింపులు చేయకుండా భారీగా ప్రచారం చేసుకోవడం రైతాంగాన్ని మభ్య పెట్టడానికేనని చెప్పారు. వాస్తవానికి స్వామినాథన్ కమిషన్ నివేదికలో ఈ అంశమే అత్యంత కీలకమైనదని, దీని అమలు కోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న రైతాంగాన్ని ప్రభుత్వం మోసం చేసిందని చెప్పారు. బడ్జెట్‌లో పేర్కొన్న ఆరోగ్యబీమా పథకం కూడా ఇటువంటిదేనని అన్నారు. ఈ పథకం ద్వారా 50 లక్షల మందికి లబ్ధి చేకూరు తుందని మోడీ చెప్పారని, ఆ మేరకు నిధులు కేటాయించలేదని తెలిపారు. దీనికి అవసరమైన నిధుల్లో 40 శాతం మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు భరించాల్సిఉందని, మిగి లిన నిధుల కేటాయింపు విషయంలోనూ స్పష్టత లేదని అన్నారు. ఆచరణలో ఈ పథకం కార్పొరేట్ ఆస్పత్రుల యాజమాన్యాలకే ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రభు త్వ వైద్య రంగాన్ని బలోపేతం చేసి, మౌలికవసతులు కల్పించకుండా కార్పొరేట్లకు మేలు చేసే ఈ తరహా పథకంతో సామాన్య ప్రజలకు పెద్దగా ప్రయోజనాలు చేకూరవని అన్నారు.

ఇన్నాళ్లు నిద్రపోతున్నారా...!

విభజన చట్టంలోని హామీల అమలుకోసం తెలుగుదేశం పార్టీ ఎంపీలు చేస్తున్న ఆందోళనను ప్రస్తావిస్తూ 'ఇన్నాళ్లు నిద్రపోతున్నారా?' అని కరత్ ప్రశ్నించారు. పార్లమెంటులో టిడిపి ఎంపీల ఆందోళనకు వామపక్ష పార్టీలు మద్దతు ఇవ్వడం లేదని తెలుగుదేశం నేతలు చెబుతున్నారన్న ప్రశ్నకు స్పందిస్తూ 'బిజెపికి టిడిపి మిత్రపక్షం. నాలుగేళ్లగా రాష్ట్ర ప్రజలను మాయమాటలు చెబుతూ మోసం చేశారు. ప్రత్యేకహోదాతో చట్టంలోని హామీల అమలు కోసం డిమాండ్ చేస్తూ వామపక్షాలు ఇచ్చిన బంద్ పిలుపునకు అనూహ్య స్పందన రావడంతో తెలుగుదేశం పార్టీ ఇప్పుడు మాట్లాడుతోంది. ప్రజలను మరోసారి మభ్యపెట్టడానికి ప్రయత్నిస్తోంది. వాస్తవానికి ఈ అంశాలపై మొదటినుండి మాట్లాడుతోంది వామపక్షాలు మాత్రమే' అని చెప్పారు. ప్రత్యేక హోదాకు బదులుగా ప్యాకేజిని ఇస్తామంటే రాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకుందని, ఇప్పుడు ప్యాకేజి కూడా లేదని, అదనపు నిధులు మాత్రమే ఇస్తామని కేంద్రం చెబుతోందని తెలిపారు. బిజెపి, టిడిపిలు కలిసి రాష్ట్ర ప్రజలను మోసం చేశాయని అన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధాన వైఫల్యం

జమ్మూ కాశ్మీర్లో ఆర్మీ క్యాంపుపై ఉగ్రవాదులు చేసిన దాడిని కేంద్ర ప్రభుత్వ విధాన వైఫల్యంగా ఆయన పేర్కొన్నారు. ఈ దాడిలో సైనికులు మృతి చెందడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సర్జికల్ స్ట్రైక్స్‌తో ఉగ్రవాదులను నిర్మూలించినట్లుగా కేంద్రం చేసిన ప్రకటనలో వాస్తవం లేదని తేలిపోయిందని అన్నారు. సర్జికల్ స్ట్రైక్స్ తరువాత ఈ తరహా దాడులు పెరిగాయని, దీనివల్ల సైనికులను నష్టపోవడంతో పాటు, సాధారణ ప్రజానీకం కూడా అనేక సమస్యలను ఎదుర్కొంటోందని తెలిపారు. పాకిస్తాన్‌తో చర్చలు జరపడం ద్వారా ఈ సమస్యను పరిష్కరించుకోవాల్సి ఉందని అన్నారు. మోడీ సర్కారు దీనికి సిద్ధపడటం లేదని అన్నారు. 2019 సాధారణ ఎన్నికలపై అడిగిన ప్రశ్నకు ఆయన జవాబిస్తూ హైదరాబాద్‌లో జరిగే అఖిలభారత పార్టీ మహాసభలో ఎన్నికల వ్యూహం ఖరారవుతుందని, దాని ఆధారంగానే కార్యాచరణ ఉంటుందని చెప్పారు. బిజెపిని ఓడించాలన్నది తమ విధానమని, దానికనుగుణంగానే ఎన్నికల వ్యూహాలుంటాయని వివరించారు. ఈ సందర్భంగా త్రిపురలో జరుగుతున్న ఎన్నికలను ఆయన ప్రస్తావించారు. 'మొట్టమొదటిసారిగా త్రిపురలో వామపక్షం, బిజెపి ముఖాముఖి తలపడుతోంది.

ఈ ఎన్నికల్లో గెలవడానికి బిజెపి పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడుతోంది. అయినా, త్రిపుర ప్రజానీకం వీటిని తిప్పికొడతారు. 8వ వామపక్ష ప్రభుత్వం ఏర్పడుతుంది' అని చెప్పారు. రాఫెల్ వ్యవహారంపై అడిగిన ప్రశ్నకు జవాబిస్తూ ఈ వ్యవహారంలో వాస్తవాలు వెల్లడించడానికి కేంద్ర సర్కారు సిద్ధపడటం లేదని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థ తయారుచేస్తున్న వాటిని కాదని, కార్పొరేట్లకు అనుకూలంగా ఈ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అన్నారు. అనిల్ అంబానీకి చెందిన సంస్థకు 21వేల కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వం చెల్లించనుందని, దీనిపైనే తాము ప్రశ్నించామని అన్నారు. ఆర్థికాంశాలకు సంబంధించిన ఈ ప్రశ్నకు జవాబివ్వడానికి బదులుగా రక్షణ రహస్యాల చాటున ప్రభుత్వం దాక్కుంటోందని అన్నారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై. వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు మంతెన సీతారం పాల్గొన్నారు.





సిపిఎం మహాసభలో విభజన చట్టం హామీలు, ప్రత్యేక హోదా అమలుపై తీర్మానం ప్రవేశపెడుతున్న కెఎస్ లక్ష్మణరావు, బలపరుస్తున్న ఓబులు

యుద్ధం ప్రారంభమైంది : గల్లా జయదేవ్

(మొదటి పేజీ తరువాయి)

పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై పార్లమెంట్‌లో మాట్లాడిన జయదేవ్‌ను గుంటూరులోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం సాయంత్రం టిడిపి నాయకులు సన్మానించారు. సభకు ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జయదేవ్ మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో అప్పటి ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఇచ్చిన హామీలు విభజన చట్టంలో భాగమేనన్నారు. మన్మోహన్ సింగ్ హామీలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుంటే విభజన చట్టానికే అర్థం ఉండదని, అప్పుడు విభజన చట్టం అమలులో లేనట్లేనని, బిల్లు మాత్రమే ప్రవేశపెట్టినట్లు అవుతుందని పేర్కొన్నారు. రాష్ట్రానికి కేంద్రం చేస్తున్న అన్యాయంపై బిజెపి, వైసిపి మినహా మిగిలిన పార్టీలు సానుకూలంగా స్పందించాయన్నారు. ప్రధాని మోడీ, బిజెపి అధ్యక్షులు అమిత్‌షా స్పందన శూన్యమని చెప్పారు. తాము సభలో గొడవ చేస్తున్నప్పుడు ప్రధాని మోడీ ఉన్నా స్పందించలేదని అన్నారు. వైసిపితో చేతులు కలపాలని బిజెపి నాయకులు చూస్తున్నారని, అందుకే టిడిపి ఎంపిల ఆవేదనను పట్టించుకోవడం లేదని విమర్శించారు. జాతీయ రహదారులకు రూ.లక్ష కోట్లు ఇచ్చినట్లు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు హరిబాబు చేసిన ప్రకటన పచ్చి అబద్ధమన్నారు. రాష్ట్రానికి కేవలం రూ.ఆరు వేల కోట్లు మాత్రమే ఇచ్చారని స్పష్టం చేశారు. మంత్రి నక్కా ఆనంద్‌బాబు మాట్లాడుతూ ఎన్నికల రాజకీయాలు చేయడం బిజెపి అలవాటుగా పెట్టుకుందని, అన్యాయాన్ని సరిదిద్దకుంటే తిరుగుబాటు చేస్తామని హెచ్చరించారు.

ఆర్థిక లోటుపై స్పష్టతకు కమిటీ : రామ్మోహన్‌నాయుడు డిమాండ్

శ్రీకాకుళం ఎంపి కింజరపు రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ ఆర్థిక లోటుపై స్పష్టత రాకుంటే కేంద్రం కమిటి వేసి స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. మిత్ర పక్షంలో ఉండి కూడా ప్రజల కోసం పార్లమెంటులో పోరాడామన్నారు. ఇప్పటికైనా తెలుగు ప్రజల మనోభావాలకు కేంద్రం మర్యాద ఇవ్వాలన్నారు. ఎపికి రూ 16 వేల కోట్లు లోటు ఉందని కేంద్ర సంస్థలే తేల్చాయన్నారు. ఆ లోటును భర్తీ చేయాలని విభజన చట్టంలో ఉన్నా కేంద్రం పట్టించుకోలేదని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌ను రాష్ట్ర ప్రజలంతా నిరాకరించారన్నారు. ముఖ్యమంత్రి 29 సార్లు ఢిల్లీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలిసినా పట్టించుకోవడంలేదన్నారు. ఇంకా ఎన్ని సార్లు సిఎం వారి చుట్టూ తిరగాలని ప్రశ్నించారు. కంభంపాటి విడుదల చేసిన వివరాల్లో అన్ని రాష్ట్రాలకు ఇచ్చినవే తప్ప ఎపికి ప్రత్యేకంగా ఇచ్చినవేమీ లేవన్నారు. ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు కుటుంబరావు మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక లోటును ఎలా భర్తీ చేస్తారో అరుణ్ జైట్లీ చెప్పడంలేదన్నారు. ప్రత్యేక ప్యాకేజీ కింద కేవలం రూ 400 కోట్లు మించి రాష్ట్రానికి రాలేదన్నారు. కంభంపాటి నివేదిక చూస్తే సినిమా స్క్రిప్టును తలపిస్తోందని ఎద్దేవా చేశారు.



సిపిఎం మహాసభల ప్రాంగణంలో అమరవీరులకు నివాళులర్పిస్తున్న బాలలు


అను ఇమ్మాన్యుయేల్, అల్లు అర్జున్

అంతిమ పోరాటం

అల్లు అర్జున్, అను ఇమ్మాన్యుయేల్ హీరో హీరోయిన్లుగా చేస్తున్న సినిమా 'నా పేరు సూర్య – నా ఇల్లు ఇండియా'. వక్కంతం వంశీ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. కె.నాగబాబు సమర్పణలో, రామలక్ష్మీ సినీ క్రియేషన్స్ బ్యానర్లో తెరకెక్కుతోంది. శిరీష శ్రీధర్ నిర్మాతగా, బన్నీ వాసు సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంలో యాక్షన్ కింగ్ అర్జున్, శరత్ కుమార్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. సోమవారం నుంచి హైదరాబాద్‌లో భారీ షూటింగ్‌కు ప్లాన్ చేశారు. ఇందులో భాగంగా అంతిమ పోరాట ఘట్టాలను చిత్రీకరించనున్నారు. ఈ చిత్రంలోని రెండో పాట లవర్ ఆల్సో... ఫైటర్ ఆల్సో అనే పాటను ప్రేమికుల దినోత్సవ కానుకగా ఈనెల14న విడుదల చేయనున్నారు. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 27న విడుదల చేస్తున్నారు. బాలీవుడ్ సంగీత ద్వయం విశాల్ – శేఖర్ ఈ చిత్రానికి బాణీలు సమకూరుస్తున్నారు.

చల్ మోహన్ రంగ



నితిన్, మేఘా ఆకాష్

నితిన్, మేఘా ఆకాష్ జంటగా రూపొందుతోన్న సినిమా 'చల్ మోహన్ రంగ'. శ్రేష్ట్ మూవీస్, పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. మాటల మాంత్రికుడు, దర్శకుడు త్రివిక్రమ్ ఈ చిత్రానికి కథను అందించారు. నిఖితారెడ్డి సమర్పణలో ఎన్. సుధాకర్ రెడ్డి నిర్మిస్తున్నారు. కృష్ణ చైతన్య దర్శకత్వం వహిస్తున్నారు. ఇది నితిన్‌కు 25వ చిత్రం కావటం విశేషం. ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను పవన్ కల్యాణ్ తన ట్విట్టర్‌లో ఆదివారం విడుదల చేసి చిత్ర యూనిట్‌కు అభినందనలు తెలిపారు. నా అభిమాన కథానాయకుడు కల్యాణ్ ఈ చిత్రం ప్రచార చిత్రాలను ట్విట్టర్ ద్వారా విడుదల చేయటం ఎంతో సంతోషంగా ఉందని నితిన్ పేర్కొన్నారు. ఈ నెల 14న ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేయబోతున్నారు. ఏప్రిల్ 5న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నామని నిర్మాత సుధాకర్ రెడ్డి చెప్పారు. హైదరాబాద్, ఊటీ, అమెరికాలలో ఇప్పటివరకూ షూటింగ్ జరుపుకున్న ఈ సినిమా ప్రేమికుల రోజు నుంచి హైదరాబాద్‌లో చిత్రీకరించనున్నారు. ఈ చిత్రానికి సంగీతం : తమన్, కెమెరా : ఎం.నటరాజ సుబ్రమణియన్, , కూర్పు : ఎస్.ఆర్.శేఖర్, నృత్యాలు : శేఖర్.వి.జె, పోరాటాలు: స్టంట్ సిల్వ, రవివర్మబీ.


అమలాపాల్

ఫాతిమా సేన పాత్ర ఏంటి?




'థగ్స్ ఆఫ్ హిందుస్తాన్'లో ఫాతిమా సేన, అమిర్ ఖాన్

'దంగల్' చిత్రంలో అమిర్ ఖాన్, ఫాతిమా సేన షైఖ్ తండ్రీకూతుళ్లుగా చేశారు. మెప్పించారు. ఇప్పుడు అమిర్ ఖాన్, కత్రినా కైఫ్, ఫాతిమా సేన, అమితాబ్ బచ్చన్ కలసి 'థగ్స్ ఆఫ్ హిందుస్తాన్' చిత్రంలో చేస్తున్నారు. విజయ్ కృష్ణ ఆచార్య దర్శకత్వం వహిస్తున్నారు. 1839లో ఫిలిప్ మీడోస్ టైలర్ రాసిన కన్‌సిషన్ ఆఫ్ ఏ థగ్స్ అనే నవల ఆధారంగా తెరకెక్కుతోన్న హిస్టారికల్ ఎడవంచర్ చిత్రమిది. ఈ సినిమా చిత్రీకరణలో తీసిన కొన్ని ఫొటోలు సామాజిక మాధ్యమంలో ప్రత్యక్షమయ్యాయి. ఇటీవల ఈ చిత్రంలో నటిస్తున్న కత్రినా కైఫ్ గ్లిట్టరీ గోల్డ్ డ్రెస్‌లో ఉన్న ఫొటోలను తనే పోస్టు చేసింది. ఇప్పుడు తాజాగా అమిర్ ఖాన్, ఫాతిమ సేన కలసి ఓ పాట కోసం డాన్స్ చేస్తున్నట్టు సెట్స్‌లో ఫొటోలు ప్రత్యక్షమయ్యాయి. ఇంత వరకూ ఓకే. 'దంగల్'లో తండ్రీ కూతుళ్లుగా నటించిన అమిర్, పాతిమ ఇందులో చేసే పాత్రలేంటి అన్నదానిపై ఈ మిస్టర్ పెర్‌ఫెక్ట్ అభిమానులు సామాజిక మాధ్యమాల్లో తెగ ఆరా తీస్తున్నారు. దీనిపై చిత్రబృందం ఇంకా స్పందించలేదు. అభిమానులు మాత్రం ట్వీట్స్ ఆపడమూ లేదు. ప్రభుదేవా ఈ గీతానికి కొరియోగ్రాఫర్‌గా వ్యవహరిస్తున్నారు.

యువత ఆలోచనలే 'కార్తీక'


ప్రియాంక శర్మ

విజయ్ భాస్కర్ రెడ్డి, ప్రియాంక శర్మ, సింధు హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రం 'కార్తీక'. బేబీ అవంతిక ఆర్ట్స్ సమర్పణలో మచెందర్ నట్టాల నిర్మిస్తున్న చిత్రం. టీజర్‌ను ఇటీవలే దర్శకుడు వినాయక్ హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ పనులు జరుపుకుంటుంది. ఈ సందర్భంగా నిర్మాత మాచెందార్ నట్టుల మాట్లాడుతూ 'కథకు తగినట్లుగా సుభాష్ చక్కటి బాణీలు అందించారు. సినిమా కోసం అందరూ కష్టపడ్డారు.. బాగొచ్చింది. త్వరలో ఆడియో వేడుకతో ప్రేక్షకుల ముందుకు వస్తామ'ని తెలిపారు. చిత్ర దర్శకుడు కొత్త పరశురాం మాట్లాడుతూ 'యువత ఆలోచనలు, వారి అలవాట్ల నేపథ్యంలో చిత్రం రూపొందింది. ఇందులో ప్రధానంగా ఒక చిన్న పిల్ల పాత్ర ఉంటుంది త్వరలో సినిమాను విడుదల చేస్తామ'ని తెలిపారు.

ఏ అమ్మాయి అయినా తమన్‌ని హర్ట్ చేసిందేమో!

వెంకీ అట్లూరి

"సినిమాలో మూడు లుక్స్‌లో హీరో హీరోయిన్స్ కనపడాలి. ఇంటర్ చదివే టైం లుక్ కోసం ఇద్దరికీ చబ్బి లుక్ ఇచ్చాం. అలాగే ఇంజనీరింగ్ చదివే లుక్ కోసం ఇద్దరూ వెయిట్ తగ్గారు. ఇక లండన్‌లో కనపడిన లుక్ కోసం కాస్త గడ్డం పెంచాడు వరుణ్. రాశి.. కాస్త బొద్దుగా పెరిగింది. ఇలాంటి వేరియేషన్స్ చూపించాల్సి సమయంలో ఎవరైనా ఇలాంటివే ఫాలో అవుతారు" అని చెప్పారు వెంకీ అట్లూరి. ఆయన దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'తొలిప్రేమ'. ఈనెల 10న విడుదలైంది. ఈ సందర్భంగా పాత్రికేయులతో దర్శకుడు ఆదివారం మాట్లాడారు.

'తొలిప్రేమ' సక్సెస్ రెస్పాన్స్ ఎలా ఉంది?
చాలా హ్యాపీగా ఉన్నాను. భీమవరం ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో మెగా ఫ్యాన్స్‌కు ఒక ప్రామిస్ చేశాను. పవన్ కల్యాణ్ 'తొలిప్రేమ' గౌరవాన్ని కాపాడుతానని. అన్నట్లుగానే కాపాడానని అనుకుంటున్నాను. సక్సెస్ రావాలని ఎవరైనా కోరుకుంటారు. దేవి థియేటర్‌లో సినిమా చూస్తున్నప్పుడు ఆడియెన్స్ అప్రిసియేన్స్ మేం కోరుకున్న దాని కంటే ఎక్కువ వచ్చింది.

ఈ కథను ఎలా తయారు చేశారు?
హ్యారీ మిక్స్ హ్యారీ బెన్ సినిమా చూసిన తర్వాత ఇష్టపడ్డాను. దాన్ని బట్టే మనకు తగ్గట్టు కథను తయారు చేసుకుంటూ వచ్చాను. ఇదొక ఫిక్షన్ స్టోరీ. నా స్వీయానుభవం కాదు. నేను భారతి విద్యాభవన్‌లో చదువుకున్నాను. అక్కడ నా కంటే లేడి సీనియర్స్‌ను దీదీ అనే పిలిచేవాడిని. అబ్బాయిలనైతే భయ్యా! అని పిలిచేవాడిని.

ఇటువంటి సినిమాలు తమన్ తక్కువ చేశారు కదా?
లవ్‌స్టోరీస్ ఒకటో రెండో చేసుంటారేమో తమన్.. కానీ నేను చెప్పగానే కొత్తగా అనిపించి, ఎగ్జయిట్‌మెంట్‌తో చేద్దామని అన్నారు. మ్యూజిక్ సిట్టింగ్స్‌లో కూర్చున్నప్పుడు ట్యూన్స్ అన్నీ దాదాపు సింగిల్ సిట్టింగ్‌లోనే ఓకే అయ్యాయి. రీరికార్డింగ్ వినగానే.. తను కథను ఎంత నమ్మాడో... ఎంత ఎగ్జయిట్‌మెంట్ అయ్యాడో తెలిసింది. మరి తమన్‌ని ఎవరైనా అమ్మాయి హర్ట్ చేసిందో తెలియదు. తన స్వంత కథకు మ్యూజిక్ ఇచ్చినట్టు తమన్ ఫీలై చేశాడు..

సినిమా కోసం ఎక్కువ నిరీక్షించనట్టు ఉంది?
వెయిటింగ్‌లో ఉన్నప్పుడు ఎవరైనా ఫ్రస్టేట్ అవుతారు. అయితే చేసేదేమీ ఉండదు. ఎందుకంటే.. వరుణ్‌కి కాలు ఫ్రాక్చర్ అయ్యింది. షూటింగ్‌లు ఆగిపోయాయి. లేకుంటే కాస్త ముందుగా షూటింగ్ స్టార్ట్ అయ్యేది. అయితే ఆ గ్యాప్‌లో స్టోరీని చిన్న చిన్న చేంజస్‌తో ఇంకా బెటర్‌గా చేసుకోవడానికి ప్రయత్నించాను.

వరుణ్ తేజ్‌కు ఈ కథ రాయాలని ఎలా అనిపించింది?
నేను కథ తయారు చేసుకునేటప్పటికీ వరుణ్‌తేజ్ 'ముకుంద' కూడా విడుదల కాలేదు. ఓ టీజర్ మాత్రమే విడుదలైంది. ఆ టీజర్ చూసి ఇలాంటి హీరో మనకు ఉంటే ఇంకా కథను బాగా చెప్పొచ్చు అని అనుకున్నాను. అయితే మెగా ఫ్యామిలీ నుండి వస్తోన్న హీరో కదా! లవ్‌స్టోరీస్ చేస్తాడో? లేదో? అనే భయం కూడా వచ్చింది. అయితే 'కంచె' రిలీజ్ అయిన తర్వాత కాస్త ధైర్యం వచ్చింది. తను డిఫరెంట్ సినిమాలు చేయడానికి సిద్ధం అని తెలిసింది. 'లోఫర్' టైంలో తనను కలిసి ఈ కథ చెప్పాను.

ఈ కథని ముందు ఎవరికి చెప్పారు?
కథ ముందు దిల్‌రాజుకి చెప్పాను. ఆయనకు కథ నచ్చింది. అయితే ఆయన చేతిలో సినిమాలు ఎక్కువగా ఉండటం.. మరి ఎక్కువ డిలే అవుతుందనే కారణంతో ప్రసాద్ అబ్బాయి బాపినీడుని కలిసి కథ చెప్పాను. తనకు కూడా నచ్చింది. అప్పటికే వరుణ్‌కు కథ చెప్పేశాను. తనకి నచ్చేసింది. అలా అన్నీ చక్కగా కుదిరాయి.

రైటర్‌గా ఉండే మీరు డైరెక్టర్ అవ్వాలని ఎలా అనిపించింది?
నాకు సినిమా ఇండస్ట్రీలోకి రావాలనే కోరిక ఉండేది కానీ.. ఎలా అనే దానిపై క్లారిటీ ఉండేది కాదు. 'స్నేహగీతం' సినిమాలో యాక్టర్‌గా నటించాను. అదే సమయంలో ఆ సినిమా కోసం డైలాగ్స్ కూడా రాశాను. అలా రాయడం వల్లనేమో కానీ.. నాకు యాక్టింగ్‌పై ఆసక్తి తగ్గిపోతూ వచ్చింది. రైటర్‌గా 'ఇట్స్ మై లవ్‌స్టోరీ', 'స్నేహగీతం', 'కేరింత' సినిమాలు చేశాను. 'కేరింత' సినిమా సమయంలోనే సెట్స్‌లో ఏం జరుగుతుందో గమనించేవాడిని. నాకు రైటర్‌గా లవ్‌స్టోరీ, డ్రామా, పొలిటికల్ నేపథ్యంలో ఉన్న కాన్సెప్ట్‌లను బాగా ఇష్టపడతాను.

సినిమా చూశాక కాంప్లిమెంట్స్ ఏమైనా వచ్చాయా?
రాఘవేంద్రరావు ఫోన్ చేసి సినిమా చాలా బావుందని కాంప్లిమెంట్ ఇచ్చారు. తెలుగు ఇండస్ట్రీకి ఫస్ట్ షో మ్యాన్ అయినా రాఘవేంద్రరావు ఫోన్ చేయడం హ్యాపీగా అనిపించింది. తర్వాత ఆర్.నారాయణమూర్తి ఫోన్ చేసి అభినందించారు. ఇలా చాలా మంది ఫోన్ చేశారు. సినిమా ఇలా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా కె.టి.ఆర్ సినిమా చూసి ట్వీట్ చేశారు. అలాంటి పెద్ద పొలిటిషియన్ మనల్ని అభినందిస్తూ ట్వీట్ చేయడం గ్రేట్ అనిపించింది.


వెంకీ అట్లూరి

నాతో వ్యాపారం చేయాలనుకున్నాడు : పాల్

బాలీవుడ్‌లో కంగనా రనౌత్, దక్షిణాదిలో అమలాపాల్... వీరిద్దరికీ పోలికేంటి అనుకుంటున్నారా? ధైర్య సాహసాల్లో సారూప్యత. వ్యక్తిగత విషయాలను, వేధింపులను నిర్భయంగా వెల్లడించే తత్వం వీరిద్దరిలోనూ ఉన్నాయి. కాకపోతే కంగనా అంత కాకపోయినా సమస్యకు ఎదురెళ్లి పోరాడే వ్యక్తి అమలాపాల్ అని ఇప్పుడు అందరూ అంటున్నారు. చిత్రసీమలో ఎదుర్కొన్న వేధింపులపై కంగనా రనౌత్ బహిరంగంగా మాట్లాడేసింది. అందులో ఇండస్ట్రీ పెద్దలు, పోలీస్‌లు పేర్లు కూడా చెప్పేసింది. అదీ నిర్భయంగా. ఇప్పుడు అమలాపాల్ కూడా అంతే... తనను వేధించిన వ్యక్తి ఎలా తనను ఉపయోగించుకోబోయాడో ట్విట్టర్‌లో స్పష్టం చేసింది.

డాన్స్ స్కూల్ యజమాని అళగేశన్ తనను లైగింకంగా వేధిస్తున్నట్టు పోలీసులకు అమల ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ స్కూల్ మద్రాస్‌లోని టీ నగర్‌లో ఉంది. మలేషియాలో మహిళాభివృద్ధికి సంబంధించి 'డ్యాన్సింగ్ తమిళచ్చి' కార్యక్రమంలో అమలాపాల్ పాల్గొనాల్సి ఉంది. దీని కోసం ఈ స్కూల్‌లో శిక్షణ కోసం చేరింది. ఆ పాఠశాల నిర్వాహకుడు అళగేశన్ ఈమెను లైంగికంగా వేధింపులకు పాల్పడ్డాడు. ఆ విషయమే పోలీసుల ఫిర్యాదులో పేర్కొందామె. ఫిర్యాదు చేసిన కొన్ని గంటల వ్యవధిలోనే నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. ఈమె ధైర్య సాహసాలపై కథానాయకుడు విశాల్ ప్రశంసించారు. ఎటువంటి బెరుకు లేకుండా ధైర్యంగా ఫిర్యాదు చేసినందుకు హ్యాట్సాఫ్ చెప్పారు. లైంగిక వేధింపులను బయటపెట్టడానికి నిజంగా చాలా తెగింపు ఉండాలన్నారు. ఈ అభినందనపై తాజాగా స్పందించింది. విశాల్‌కు ధన్యవాదాలు చెబుతూ మీటూ అనే హ్యాష్‌ట్యాగ్‌ను జత చేసింది. ఈ ట్వీట్‌లో అసలు ఏం జరిగిందో వివరించింది. 'నా తరఫున మాట్లాడినందుకు ధన్యవాదాలు విశాల్. ఇది ప్రతి మహిళ బాధ్యతగా భావిస్తున్నా. వేధింపులపై మౌనం వహించి, వదిలివేయడం సరికాదని నాకు తెలిసేలా చేశావు. అళగేశన్ నాతో వ్యాపారం చేయాలి అనుకున్నాడు. ఆయనకు ఉన్న గుర్తింపు, ఆయన చేసే పనులు చూసి చాలా భయపడిపోయా' అని అమలాపాల్ చేసిన ట్వీట్‌లో పేర్కొంది.

బ్యాంకాక్‌లో 'రేస్'


డైసీ షా, సల్మాన్ ఖాన్, బాబీ డియోల్, సాక్విబ్ సలీమ్

మొదటి షెడ్యూల్ పూర్తి చేసుకున్న 'రేస్ 3' చిత్రం రెండో షెడ్యూల్ కోసం బ్యాంకాక్ వెళ్లింది. ఈ విషయాన్ని సల్మాన్ ఖాన్ వెల్లడించారు. సల్మాన్, బాబీ డియోల్, జాక్విల్ ఫెర్నాండేజ్, డైసీ షా, సాక్విబ్ సలీమ్ ముఖ్య తారాగణంగా ఈ సినిమాలో చేస్తున్నారు. బ్యాంకాక్‌లో డైసీ షా, సల్మాన్ ఖాన్‌పై రెండు పాటలను చిత్రీకరించనున్నారు. ఇందులో జాక్విలిన్ ఫెర్నాండేజ్ చేయబోయే పోలే డాన్స్ చిత్రానికే హైలైట్‌గా నిలవనుందని డైరెక్టర్ రెమో డిసౌజ్ చెప్పారు. ఆమె చాలా కష్టపడే వ్యక్తి అని, తక్కువ సమయంలోనే పోలే డాన్స్ చేయడంలో నైపుణ్యం సాధించిందని ఆయన పేర్కొన్నారు. ఆమె డాన్సే ఈ చిత్రాన్ని మరో స్థాయికి తీసుకెళుతుందని చెప్పారు. సల్మాన్ ఖాన్, రిమో డిసౌజ్ కాంబినేషన్ తెరకెక్కుతోన్న మొదటి సినిమా ఇది. సల్మాన్ ఖానే ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రీతి చక్రవర్తి బాణీలు సమకూరుస్తున్నారు.

రూపాయి



పొదుపుగా లెక్కలు కట్టండి!!

జీవితంలో మనం ప్రయాణించే 'ఆర్థిక నావ' అటూ ఇటూ ఊగకుండా, పల్టీలు కొట్టకుండా ఉండటానికి సమతూకమైన డబ్బుల లెక్కలు ఉండాలి. అలా మనం ఖర్చుచేసే ప్రతిపైసాకీ ఓ లెక్క. అలా ఉంటేనే జీవితంలో ఆర్థిక కష్టాల నుంచి సులువుగా గట్టెక్కగలం అంటున్నారు నిపుణులు. బడిలోనో, ఆఫీసులోనో ఎవరైనా బుద్ధిమంతుడు కనపడితే "రాముడు మంచి బాలుడు.." అని కితాబిస్తాం. అలాగే డబ్బులు ఖర్చుపెట్టే విషయంలో ఆచితూచి వ్యవహరించే వారిని చూసి "మంచి పొదుపరోయ్.." అని మెచ్చుకుంటాం. ఇలాంటి మెచ్చుకోలు మనకూ దక్కాలంటే గురితప్పని లెక్కలు వేయాల్సిందే. ఏంటా లెక్కలంటారా? మరి అలాంటి లెక్కలు కట్టి జీవితంలో చక్కటి ఆర్థికప్రణాళికతో ఎలా కొనసాగాలో ఇవాల్టి 'రూపాయి' కథనంలో తెలుసుకుందాం!!

రమణి, రాఘవ భార్యాభర్తలు. ఇద్దరూ ఉద్యోగాలు చేస్తున్నవారే. పెళ్ళయ్యి ఐదారేళ్లయ్యింది. ఇద్దరి సంపాదన కూడితే ఇంటి అద్దె, నిర్వహణ, వినోదపు ఖర్చులు పోగా అంతా ఇంతో మిగిలే పరిస్థితి. కానీ నెలాఖరు వచ్చేసరికి ఇద్దరి బ్యాంక్ అకౌంట్లలో కనీసం మినిమమ్ బ్యాలెన్సే ఉండదు. వచ్చేనెల నుంచైనా ఇద్దరి ఖాతాలో కొంత డబ్బులు ఉండాలని భీష్మ ప్రతిజ్ఞ చేసినా అది ఆచరణలో సాధ్యపడటం లేదు.

✧✧✧

రమేష్, ఇంద్రాణి భార్యభర్తలు. రమేష్ చేస్తున్నది ప్రయివేట్ ఉద్యోగం. ఇంద్రాణి గృహిణి. ఇద్దరు మగపిల్లలు. ఇద్దరూ ప్రయివేట్ స్కూల్లో చదువుతున్నారు. రమేష్, ఇంద్రాణిలకు పెళ్ళయ్యి దాదాపు పదిహేనేళ్ళు. ఇప్పటిదాకా ఏరోజూ ఆర్థికపరమైన ఇబ్బందులు చవిచూడలేదు. అలాగని పెద్దల నుంచి వారసత్వంగా వచ్చిన ఆస్తులు కలిసొచ్చాయనీ అనుకోవద్దు. రమేష్ రెక్కల కష్టం మీదనే ఆ కుటుంబం నడవాలి. కుటుంబంలో తన ఒక్కడిదే సంపాదన అయినా ఇప్పటిదాకా ఏ లోటూ రాలేదు.

✧✧✧

ఈ రెండు ఉదాహరణల్లో రమణి, రాఘవ దంపతులిద్దరూ ఉద్యోగస్తులైనా నెలాఖరుకి బ్యాంక్ అకౌంట్‌లో పైసా ఉండని పరిస్థితి. ఇక చివరిగా రమేష్ కుటుంబంలో తనొక్కడి సంపాదనే అయినా ఆర్థిక సమస్యే తలెత్తకుండా ఆ కుటుంబం సాఫీగా సాగిపోతోంది. ఇలా విరుద్ధమైన తేడాలు కనపడ్డానికి కారణం వారి వారి ఆర్థికపరమైన లెక్కల్లో తేడా ఉండటమే.



లెక్కలు వేయాలి!

సంపాదన, ఖర్చు అనే విషయంలో కుటుంబంలోని ఏ ఇద్దరు వ్యక్తులు కూడా ఒకలా వ్యవహరించరు. మిగతా విషయాల్లో మా జీవితం మా ఇష్టం అన్నట్టుగా ఉన్నా.. ఆర్థికపరమైన విషయాల్లో ముఖ్యంగా ఖర్చులు, పొదుపు అనే విషయాల్లో ప్రతి ఒక్కరూ శాస్త్రీయమైన పద్ధతుల్ని పాటిస్తేనే వారి వారి రంగాల్లో ఆర్థిక సమతుల్యత సాధించగలుగుతారు అంటారు ఆర్థిక నిపుణులు. వారసత్వంగా కోట్ల రూపాయల ఆస్తులు సంక్రమించిన వారు కూడా సరైన జాగ్రత్తలు పాటించకపోతే ఆర్థికంగా కుదేలైనవారే, అలాగే సొంతకాళ్ళపై రూపాయి రూపాయి సంపాదించి కుబేరులైన వాళ్ళూ ఉన్నారు. గరీబు కుబేరుడవ్వడానికి.. కుబేరుడు గరీబవ్వడానికి కారణాలు ఒక్కటే, ఒకరు లెక్కల్లో తప్పడం. మరొకరు పాసవ్వడం. బడిలో చెప్పే లెక్కల్ని తప్పినా.. మరొకసారి పరీక్షల్లో పాసవ్వొచ్చు. కానీ డబ్బుల విషయంలో లెక్కలు తప్పితే మాత్రం తొందరగా తేరుకోవడం కష్టం. అందుకే ఖర్చుపెట్టే ప్రతి రూపాయికి లెక్క ఉంటేనే జీవితం పొదుపు మార్గమవు తుందన్నది అనుభవజ్ఞుల మాట.



ఖర్చులు.. వివరంగా!

కోట్లకు పడగలెత్తిన వ్యక్తులైనా, చిరుద్యోగైనా రోజువారీ చేసే ఖర్చుకు ఓ లెక్క, జమ ఉండాలి. రోజువారీ చేసే చిన్నపాటి ఖర్చును కూడా వివరంగా రాసుకునే అలవాటు చేసుకోవాలి. ఐదు, పది రూపాయలే కదా?! అని తేలిగ్గా తీసుకుంటే ఒక్కొక్కసారి ఆ ఐదు, పది రూపాయల కోసం జేబులు తడుముకునే పరిస్థితులు రావొచ్చు. ఖర్చు చిన్నదైనా, పెద్దదైనా లెక్కా పత్రం ఉంటేనే మనం రోజుకు, వారానికి, నెలకి ఎంత ఖర్చు చేస్తున్నాం అనే లెక్క తేలేది. ఆ లెక్కలో వున్న వివరాలు ఆధారంగా దేనికి ఎంత ఖర్చుపెట్టాం? అనవసరపు ఖర్చులు ఎంత చేశాం..? అనే విషయాల పట్ల అవగాహనకు రాగలం. దానివల్ల వృథా ఖర్చుల్ని అదుపులో ఉంచుకోగలం.

ఇలా చేద్దాం!

- ఆదాయానికి, ఖర్చులకు బేరీజు వేసుకోండి.
- నెలవారీ ఖర్చుల వివరాలను ఒక్కొక్కటిగా రాసుకోండి.
- ఇంటి అద్దె, కుటుంబ నిర్వహణ, విందు, వినోదపు ఖర్చులకు ఎంత ఖర్చు అవుతుందో లెక్కకట్టండి.
- ఆదాయానికి మించి ఖర్చు తేలినట్లైతే వృథా ఖర్చులు తగ్గించుకోండి.
- నెలవారీ ఖర్చులకు పోగా ఎంత మిగులుతుందో లెక్కకట్టండి.
- ఆదాయం నుంచి మిగిలేది చిన్నమొత్తమైనా పొదుపు చేయడానికి కేటాయించండి.
- ఈ రోజు చిన్నమొత్తంగా మొదలయ్యే పొదుపు రేపటిరోజున పెద్దమొత్తంగా మారే అవకాశం మీ చేతుల్లోనే ఉంది.

- వి.చైతన్య



'సంపాదించింది ఇంటికే సరిపోవడంలేదు.. ఇంకెక్కడ లెక్కలు, పొదుపు?' అనుకుంటే భవిష్యత్తులో చిక్కులు తప్పవు. వర్తమానంలో అనవసరపు ఖర్చులు తగ్గించుకునే లెక్కలే రేపటి రోజున భవిష్యత్తును భేషుగ్గా మలిచే జీవితపు లెక్కలని మరచిపోవొద్దు. అందుకే చక్కటి పొదుపు కోసం ఈ రోజు నుంచే లెక్కలు వేద్దాం.

చిట్టీలు-మతలబులు

ఏమాత్రం చట్టబద్ధత లేకుండా విచ్చలవిడిగా చిట్టీల వ్యాపారం కొనసాగడం వల్ల వీటితో లాభపడేవారి సంగతెలా ఉన్నా నష్టపోయేవారి సంఖ్య ఇటీవల ఎక్కువవుతోంది. అందుకే చిట్స్(చిట్టీలు) వేసే ముందు గ్యారంటీ అంశాలు కచ్చితంగా పరిశీలించాలి.

చిట్ అంటే?!

చిట్, చిట్‌ఫండ్, చిట్టీ, కురి... పేరు ఏదైనా అర్థం మాత్రం ఒకటే. ఆర్థిక పదజాలం ప్రకారం చిట్ అంటే డబ్బును మార్పిడి చేయడం. అంటే ఒకరి చేతుల్లోంచి మరొకరి చేతుల్లోకి మార్చే క్రమం. ఇలా మార్చే క్రమానికి చట్టబద్ధత ఉన్నప్పుడే చిట్‌ఫండ్ స్కీంలో పెట్టుబడి పెట్టే డబ్బులకు అంతో ఇంతో గ్యారంటీ ఉంటుందని చెప్పగలం. చట్టబద్ధత లేనప్పుడు బాధితులు న్యాయపరమైన పోరాటం చేయలేరు. పోయిన డబ్బును దక్కించుకోడానికి అవకాశాలు అంతగా ఉండవు. ఈ అంశాలను కేవలం సివిల్ మేటర్స్‌గానే కోర్టులు పరిగణిస్తాయి.



చిట్టీలు నిర్వహించే వారి వల్లగానీ, చిట్టీలు కట్టే జనాల వల్లగానీ ఏదైనా ఆర్థిక సమస్య వస్తే ఆ భారాన్ని మోసి, ఏ ఒక్కరికీ నష్టం రానీయకుండా సర్దుబాటు చేసుకోగల పరిస్థితులు, భరించే శక్తి సదరు చిట్ నిర్వాహకులకు ఉండాలి. అది లేని పక్షంలో చివరికి నష్టపోయేది చిట్టీని కట్టుకున్న వ్యక్తులే. ఒక్కొక్కసారి చిట్టీ కట్టే వ్యక్తుల వల్ల కూడా నిర్వహించే వ్యక్తులు భారీగా నష్టపోయే ప్రమాదం ఉంది.

చట్టబద్ధత అంటే?

చిట్‌ఫండ్ అనేది పూర్తిగా వ్యాపారపరమైన అంశం. చట్టపరిధిలో నిర్వర్తించాల్సిన వ్యాపారంగా ఆదేశించబడింది. 1982 చట్టం అనుసరించి, విధి విధానాలను ఆ కంపెనీ అమలు చేస్తున్నప్పుడే చిట్‌ఫండ్ వ్యాపారానికి గుర్తింపు. ఇది పూర్తిగా నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సి) పరిధిలోకి వస్తుంది. అంటే బ్యాంకింగ్ రంగాల్లో రిజర్వ్‌బ్యాంక్ నుంచి దిశానిర్దేశాలు ఉంటాయి. రిజర్వ్‌బ్యాంక్ నుంచి అంతిమంగా ఖాతాదారుకు రక్షణ ఉంటుంది. కానీ చిట్‌ఫండ్ ఈ కోవలోకి రాదు. ప్రయివేట్ లిమిటెడ్‌గా ప్రారంభమయ్యే చిట్‌ఫండ్ కంపెనీలు ఏవైనా సంబంధిత చట్టాన్ని అనుసరించే ఎన్‌బీఎఫ్‌సీలో నమోదవుతాయి. ఇలా నమోదైన కంపెనీల ద్వారా కట్టుకున్న చిట్టీలకు మాత్రమే అంతో ఇంతో చట్టపరమైన భద్రత, తగిన న్యాయపరమైన లావాదేవీలు జరుపుకునే అవకాశం ఉంది. అలా కాకుండా ప్రయివేటు వ్యక్తులు నడిపే చిట్టీలకు చట్టబద్ధత ఉండదు. అలాగే చట్టం, న్యాయపరమైన చేయూత కూడా దక్కదు.

చిట్టీలు వేసే విషయంలో, నడిపే విషయంలో పూర్తిగా అవగాహన ఉంటేనే దాంట్లోకి దిగాలి. ముఖ్యంగా చిట్‌ఫండ్ కంపెనీ స్థితిగతులపై, లాభనష్టాలపై ఆర్థికనిపుణుల సలహాల తీసుకోవడం మంచిది. మనం చెల్లించే డబ్బుకు గ్యారంటీ ఇవ్వని వ్యక్తులు, సంస్థల్లో చిట్టీల పేరుతో పెట్టుబడులు పెట్టి మోసపోవద్దనేది నిపుణుల మాట. అందుకే చిట్టీల విషయంలో జరభద్రం!!



'రూపాయి'కి మీరూ రాయొచ్చు!



బ్యాంకు, పోస్టాఫీసు, షేర్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్, ఎల్ఐసీ, ఇతర బీమాపథకాలు, ఇన్‌కంటాక్స్ వంటి ఆర్థిక విషయాలపై మీరూ మీ అనుభవాలను 'రూపాయి' ఫీచర్‌కి పంపండి. సంబంధిత విషయాలపై సలహా, సూచనల్ని తెలియజేయండి. ఏవైనా సందేహాలు ఉంటే రాయండి.

మా చిరునామా

రూపాయి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట,
విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com
ఫోన్ నెం. 9490099006

చిన్నారి



పొడుపు కథ


ఒకరు వేస్తారు,
వేరొకరు కొడతారు,
పట్టుకోడానికి చుట్టూ ఉంటారు,
ఈ ఆటను అధికులు ఇష్టపడతారు?

జవాబు : క్రికెట్

జోక్ :

టీచర్ : ఒరేయ్ టింకూ!పెద్దయ్యాక నువ్వేమవ్వాలను కుంటున్నావ్?
టింకు : మా నాన్నలా డాక్టర్..
టీచర్ : మీ నాన్న డాక్టరా?
టింకు : కాదు టీచర్! ఆయన కూడా నాలాగే డాక్టర్ అవ్వాలనుకున్నారు..!

దారిచూపరూ?!



పిల్లలూ..! పక్కనున్న చిత్రంలోని కుక్కపిల్లకు బయటకు వెళ్లేందుకు దారిని చూపించండి!

టైటానిక్‌ను ముంచింది ఇవేనట!!



పిల్లలూ..! టీవీ న్యూస్ పేపర్లలో అప్పుడప్పుడూ చెబుతుంటారు. ఫలానా సముద్రంలో ఈరోజు నౌక మునిగిపోయి ఇంతమంది చనిపోయారని. అసలు సముద్రంలో నౌకలు ఎందుకు మునిగిపోతాయో మీకు తెలుసా? సుమారు 90శాతం సముద్రపు ఉపరితలం అడుగున ఐస్‌బర్గ్‌లు (మంచు కొండలు) దాగి ఉంటాయి. ఇవి నౌకలకు చాలా ప్రమాదాన్ని కలుగచేస్తాయి. చూడటానికి స్థిరంగా ఉన్నట్టు కనిపిస్తాయి. కానీ ఇవి వందల మిలియన్ టన్నుల బరువు ఉండి, కొండంత పరిమాణంలో కనిపిస్తాయి. మీకు ఇంకొక విషయం తెలుసా, ఇవి లోపల కదులుతూ తలకిందులవుతుంటాయట. అంతేకాదు పిల్లలూ.. ఇవి సునామీలను సృష్టిస్తాయట. వీటికి దగ్గరగా వచ్చే నౌకలను ముంచేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. ఒకప్పుడు సముద్రంలో ఐస్‌బర్గ్‌ను ఢీకొట్టడం మూలంగా టైటానిక్ ఓడ జలసమాధి అయిందట. ఆ ప్రమాదంలో వందల సంఖ్యలో ప్రయాణికులు చనిపోయారు. 2011లో చికాగో విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు ఐస్‌బర్గ్‌ల మీద అనేక పరిశోధనలు చేశారు. వారు చెప్పినదానిని బట్టి దాని కదలిక ఫలితంగా విడుదలయ్యే శక్తి ఒక అణుబాంబు కంటే ఎక్కువగా ఉంటుందని తేల్చారు. ★



నా కొత్త ప్రయాణం

మా ఉపాధ్యాయులు, కొంతమంది విద్యార్థులం కలిసి ఒకరోజు ఎక్కడికైనా ఉదయాన్నే సరదాగా వెళదాం అనుకున్నాం. అలాగే ఒక ఆదివారం ఉదయం 4.30కే నిద్రలేచి బస్సులో అర్ధగంటలో విజయవాడకు దగ్గరలోనున్న పెదపులిపాకకు చేరాం. అక్కడ కృష్ణానది ఇసుకపై మా నడక మొదలెట్టాం. దారిలో చాలా ఆటోలు కనిపించాయి. వాటినిండా చీరల మూటలు ఉన్నాయి. ఆ చీరలను కొంతమంది తీసుకెళ్లి అక్కడ ఉన్న నీటి గుంటలలో ఉతుకుతున్నారు. వాటిని అక్కడ ఇసుకలోనే ఆరేస్తున్నారు. సుమారు వెయ్యి చీరలు ఉన్నాయి. అన్ని చీరలు ఒకేసారి చూడటం మాకు అదే తొలిసారి. మేం కూడా ఆ నీటిగుంతలను దాటి ఇంకొంచెం ముందుకెళ్లాం. ఆ ఇసుకలో నడవాలంటే చాలా కష్టంగా అనిపించింది. ఇంకొంచెం దూరం వెళ్లిన తర్వాత గడ్డిపొదలు కనిపించాయి. అలా నడుస్తూ నడుస్తూ మేం అనుకున్న చోటుకి చేరాం. అక్కడ ఇసుకలో మేం అందరం కలిసి లాంగ్‌జంప్ ఆడుకున్నాం. ఫోటోలు చాలానే తీసుకున్నాం. మళ్లీ బస్సు దగ్గరకు తిరిగి ప్రయాణం మొదలెట్టాం. దారిలో మాకు పెద్దపాము కనిపించింది. భలే భయమేసింది. మా ఉపాధ్యాయులు ధైర్యం చెప్పి ముందుకు నడిపించారు. ఉదయాన్నే మంచులో నదీతీరాన, నదిలోన నడవటం ఎంతో హాయిగా అనిపించింది. స్నేహితులతో, టీచర్లతో అలా వెళ్ళటం ఆనందంగానూ, ఆరోగ్యంగానూ ఉంటుందనిపించింది. ఈ ప్రయాణం నాకో క్రొత్త అనుభవాన్ని మిగిల్చింది.



సి. చక్రవర్ధన్ రెడ్డి
7వ తరగతి, అంబి ఎత్రా స్కూల్, కుంచనపల్లి

పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపవలసిన మా చిరునామా

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com

స్పిన్నర్లనే నమ్మడంతో...

- చేజేతులా ఓడిన టీమిండియా
- 11.3 ఓవర్లలో 119 పిండుకున్న సఫారీలు



జోహాన్స్‌బర్గ్ : నాల్గో వన్డేలో టీమిండియా 5 వికెట్ల తేడాతో పరాజయం పాలైంది. 290 విజయలక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా జట్టు 7.2 ఓవర్లలో 43 పరుగులకు మార్క్రమ్(22) తొలి వికెట్‌గా పెవిలియన్‌కు చేరాడు. అనంతరం వర్షం కారణంగా మ్యాచ్‌కు అంతరాయం కలగడంతో దాదాపు గంటన్నరసేపు మ్యాచ్ నిలిచిపోయింది. అక్కడే టీమిండియా చేతిలోంచి మ్యాచ్ జారిపోయింది. వర్షం నిలిచిన అనంతరం మ్యాచ్ ప్రారంభం కావడంతో సమీకరణలు ఒక్కసారిగా మారిపోయాయి. దీంతో దక్షిణాఫ్రికా జట్టు డక్‌వర్త్-లూయిస్ పద్ధతిలో 28 ఓవర్లలో 202 పరుగులు చేయాల్సి వచ్చింది. లక్ష్యాన్ని కుదించడంతో వన్డే మ్యాచ్ కాస్తా టీ20 మ్యాచ్‌లా మారిపోయింది. సఫారీజట్టు ఆటగాళ్ల మైండ్‌సెట్ కూడా మారింది. 25.3 ఓవర్లలోనే 5 వికెట్ల నష్టానికి 207 పరుగులు చేసి నాల్గో వన్డేలో సఫారీ జట్టు తొలి విజయాన్ని నమోదు చేసుకుంది.

నాల్గో వన్డేలో టీమిండియా స్పిన్నర్లను సఫారీజట్టు బ్యాట్స్‌మన్లు సమర్థవంతంగా ఎదుర్కొన్నారని చెప్పక తప్పదు. చాహల్ 5.3 ఓవర్లలో 68 పరుగులు సమర్పించుకోగా... కుల్దీప్ యాదవ్ 6 ఓవర్లలో 51 పరుగులు ప్రత్యర్థి జట్టుకు ఇచ్చాడు. స్పిన్నర్ల జోడీ 11.3 ఓవర్లలో 119 సమర్పించుకొని ఓటమికి కారణమైందనక తప్పదు. ఏది ఏమైనా ఆరు వన్డేల సిరీస్‌లో 3-1 ఆధిక్యతలో ఉన్న టీమిండియా మరో మ్యాచ్ గెలిస్తే చరిత్ర సృష్టించే అవకాశముండగా... ఐదోవన్డే మంగళవారం పోర్ట్ ఎలిజిబెత్‌లో జరగనుంది.

డివిలియర్స్ రాకతో జట్టుకు పుటెన్సీ...

వర్షం కారణంగా మ్యాచ్ నిలిచిన అనంతరం తిరిగి ప్రారంభమయ్యాక సఫారీజట్టుకు డివిలియర్స్ పుటెన్సీ ఇచ్చాడు. అతడు కేవలం 16 బంతుల్లో 28 పరుగులు చేసి చాహల్ బౌలింగ్‌ను కకావికలం చేశాడు. అదే స్ఫూర్తితో డేవిడ్ మిల్లర్, వికెట్ కీపర్ క్లేశన్, ఫెల్యూక్వాయోలు రెచ్చిపోయారు. మిల్లర్ రెండుసార్లు అవుటయ్యే ప్రమాదంనుండి తప్పించుకోవడంతో ఆకాశమే హద్దుగా ఆడాడు. అతడు 28 బంతుల్లో 39 పరుగులు చేయగా... అతని ఇన్నింగ్స్‌లో రెండు సిక్సర్లు, నాలుగు బౌండరీలున్నాయి. మిల్లర్, డివిలియర్స్ ధాటిగా ఆడడంతో క్లేశన్ సైతం జూలు విదిల్చాడు. అతడు 27 బంతుల్లో 43 పరుగులు చేస్తే... ఫెల్యూక్వాయో కేవలం 5 బంతుల్లో 23 పరుగులు చేసి మ్యాచ్‌ను గెలిపించారు. అతని ఇన్నింగ్స్‌లో మూడు సిక్సర్లు ఒక ఫోర్ ఉన్నాయి.

అందివచ్చిన అవకాశాల్ని చేజార్చుకున్నాం : కోహ్లీ

ఈ సందర్భంగా టీమిండియా సారథి విరాట్ కోహ్లీ మాట్లాడుతూ మ్యాచ్‌లో అందివచ్చిన అవకాశాలను పొరపాటున కూడా చేజార్చుకోకూడదన్నాడు. ప్రత్యర్థులను కట్టడి చేయాలనుకుంటున్న తరుణంలో ఒకే ఓవర్లో డేవిడ్ మిల్లర్ రెండుసార్లు ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకోవడం జట్టు పరాజయంపై తీవ్ర ప్రభావాన్ని చూపిందన్నాడు. చాహల్ బౌలింగ్‌లో డేవిడ్ మిల్లర్ 6 పరుగులతో ఉండగా అతడి క్యాచ్‌ను శ్రేయాస్ అయ్యర్ వదిలేశాడు.. మళ్లీ అదే ఓవర్లో మిల్లర్ బౌల్డయినప్పటికీ.. అది నోబాల్‌గా తేలడంతో అతను మరోసారి బతికిపోయాడు. ఈ రెండు అవకాశాలే మ్యాచ్‌ను మలుపు తిప్పాయన్నాడు.

సఫారీ జట్టుకు జరిమానా

భారత్‌తో జరిగిన నాలుగో వన్డేలో దక్షిణాఫ్రికా జట్టుకు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్(ఐసీసీ) జరిమానా విధించింది. శనివారం వాండరర్స్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో తొలుత టీమిండియా బ్యాటింగ్ చేసింది. నిర్ణీత సమయానికి మించి ఒక ఓవర్ ఆలస్యంగా వేసినందుకు ఐసీసీ మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఐసీసీ నిబంధనల ప్రకారం స్లో ఓవర్ రేట్ కారణంగా సఫారీ జట్టులోని ప్రతి ఆటగాడికి వారి మ్యాచ్ ఫీజులో 10శాతం, కెప్టెన్‌కు 20శాతం జరిమానా పడనుంది.



నిరాశపరిచిన కేశవన్

ప్యాంగ్‌చాంగ్ (దక్షిణకొరియా) : వింటర్ ఒలింపిక్స్‌లో ఆదివారం జరిగిన 'లూజ్' ఈవెంట్ ఫైనల్లో భారత్‌కు చెందిన కేశవన్ నిరాశపరిచాడు. శనివారం రెండు రౌండ్ల హీట్‌లు ముగిసే సరికి 34వ స్థానంలో నిలిచిన కేశవన్ ఆదివారం జరిగిన మరో రెండు హీట్స్‌ను 48.900 సెకన్లతో పూర్తి చేసి ఓవరాల్‌గా 31వ స్థానంలో నిలిచి నిరాశపరిచాడు. ఈ ఈవెంట్‌లో బంగారు పతకం గెలిచిన గ్లిశ్చర్(ఆస్ట్రియా)కంటే 1.366 సెకన్ల వెనుకబడి ఓటమిపాలయ్యాడు. ఇదే విభాగంలో ఆస్ట్రియాకు చెందిన డేవిడ్ గ్లిశ్చర్ (బంగారు), అమెరికాకు చెందిన క్రిస్ మజ్గర్ (రజిత), జర్మనీకి చెందిన జొహాన్నెస్ లుడ్వింగ్ (కాంస్య) పతకాలను సాధించారు.



ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్స్
ఇండోనేషియా, జపాన్



అలోర్ సెటార్ (మలేషియా) : ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ ఛాంపియన్లుగా పురుషుల విభాగంలో ఇండోనేషియా జట్టు, మహిళల విభాగంలో జపాన్ జట్లు బంగారు పతకాలను సాధించాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో ఇండోనేషియా జట్టు 3-1 తో చైనాను, జపాన్ జట్టు 3-0తో చైనా జట్టును ఓడించాయి. పురుషుల సింగిల్స్ విభాగంలో ఇండోనేషియాకు చెందిన క్రిష్టి 16-21, 21-17, 21-18తో షీ యకీ (చైనా)పై గెలుగెలిచి 1-0 ఆధిక్యతను సంపాదించారు. మరో సింగిల్స్ డియోబిన్ (చైనా) 21-12, 11-21, 21-14 పాయింట్ల తేడాతో గెలిచాడు. ఆ తర్వాత జరిగిన డబుల్స్ రెండు మ్యాచ్‌లలో ఇండోనేషియా షట్లర్లు గెలవడంతో 3-1తో ఇండోనేషియా జట్టు విజేతగా నిలిచింది. మహిళల ఫైనల్లో నెంబర్‌వన్ సీడ్ యమగుచి(జపాన్) 21-16, 12-21, 21-14 పాయింట్ల తేడాతో చెన్‌యుఫి(చైనా)పై గెలిచి 1-0 ఆధిక్యతను సంపాదించింది. డబుల్స్ మ్యాచ్‌లో జపాన్ జట్టు 21-13, 21-16తో... మరో సింగిల్స్ మ్యాచ్‌లో ఒకుహరా 19-21, 21-16, 21-10 పాయింట్ల తేడాతో గెలిచి 3-0 ఆధిక్యతతో టీమ్ ఛాంపియన్‌షిప్‌ను సాధించాయి. పురుషుల విభాగంలో ఇండోనేసియాకు బంగారు, చైనాకు రజిత, మలేషియా, దక్షిణ కొరియాలకు కాంస్య పతకాలు లభించాయి. మహిళల విభాగంలో జపాన్‌కు బంగారు, చైనాకు రజిత, ఇండోనేషియా, దక్షిణ కొరియాలకు కాంస్యపతకాలు లభించాయి. క్వార్టర్‌ఫైనల్లో ఓడిన భారత పురుషజట్టు 5వ స్థానంలో, మహిళల జట్టు 6వ స్థానంలో నిలిచాయి.

విజయ్ హజారే ట్రోఫీ టాప్‌లో ఆంధ్ర

చెన్నై : విజయ్ హజారే ట్రోఫీలో ఆంధ్రజట్టు మరో విజయాన్ని నమోదు చేసుకుంది. ఆదివారం తమిళనాడుతో తలపడి 29 పరుగుల తేడాతో గెలిచింది. తొలిగా బ్యాటింగ్ చేసి 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 276 పరుగులు చేసింది. ఓపెనర్ శిఖర్ భరత్ 82 పరుగులతో ఆకట్టుకున్నాడు. 277 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన తమిళనాడు జట్టు 48.5 ఓవర్లలో 247 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో గ్రూప్-సి నుండి ఆంధ్రజట్టు నాలుగు మ్యాచ్‌లలో గెలిచి 16 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది.

శుభ్‌మన్ గిల్ మెరుపులు...

పంజాబ్-కర్ణాటక జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో పంజాబ్ జట్టు 4 పరుగుల తేడాతో కర్ణాటకను ఓడించింది. పంజాబ్ తరపున ఇటీవల అండర్-19 క్రికెట్‌లో రాణించిన శుభ్‌మన్ గిల్ అజేయంగా 123 పరుగులు చేశాడు. దీంతో తొలిగా బ్యాటింగ్ చేసిన పంజాబ్ జట్టు 50 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 269 పరుగులు చేసింది. ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో కర్ణాటక జట్టు 265 పరుగులకే పరిమితమైంది.

తొమ్మిదేళ్ల తర్వాత...

కరాచి: పాకిస్తాన్ సూపర్‌లీగ్ (పిఎస్ఎల్) మూడో సీజన్ ఫైనల్ మ్యాచ్ కరాచీలో జరగనుంది. భద్రతా కారణాలరీత్యా 2009 నుండి పాకిస్తాన్‌లో అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లు జరగడం లేదు. ఈ నేపథ్యంలో కరాచీలో మ్యాచ్‌ల నిర్వహణ కోసం చేస్తున్న భద్రతా ఏర్పాట్లను ఆదివారం విదేశీ ప్రతినిధుల బృందం పరిశీలించింది. ఈ నగరంలో దాదాపు తొమ్మిదేళ్ల తర్వాత ఓ అంతర్జాతీయస్థాయి క్రికెట్ మ్యాచ్ జరగబోతోంది. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) నిర్వహిస్తోన్న ట్వంటీ20 లీగ్ పాకిస్థాన్ సూపర్ లీగ్(పీఎస్ఎల్) మూడో సీజన్ ఈనెల 22న యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో ప్రారంభంకానుంది. అయితే టోర్నమెంట్లోని రెండు ప్లే-ఆఫ్ మ్యాచ్‌లను మార్చి 20-21న ఫైనల్‌ను కరాచి వేదికగా మార్చి 25న నిర్వహించనున్నారు. లాహోర్‌లో 2009లో శ్రీలంక ఆటగాళ్లపై జరిగిన ఉగ్రవాదుల దాడి అనంతరం అక్కడ అంతర్జాతీయ మ్యాచ్‌లు జరగని విషయం తెలిసిందే. గతేడాది పీఎస్ఎల్ ఫైనల్ మ్యాచ్‌ను లాహోర్‌లో నిర్వహించారు. కొంత మంది విదేశీ ఆటగాళ్లు ఇక్కడ పర్యటించగా ఎక్కువ మంది భద్రత కారణాలను చూపుతూ దూరంగా ఉన్నారు. పీఎస్ఎల్‌లో ఆరు ఫ్రాంచైజీలు ఉండగా ప్రతి జట్టులో నలుగురు విదేశీ ఆటగాళ్లను తుదిజట్టులోకి తీసుకోవచ్చు.

ఆయేషా కేసు తెనాలికి సిట్

ప్రజాశక్తి-తెనాలిటౌన్ (గుంటూరు జిల్లా)

ఆయేషామీరా హత్య కేసు పునర్విచారణలో భాగంగా హైకోర్టు ఏర్పాటు చేసిన సిట్ బృందం గుంటూరు జిల్లా తెనాలి పట్టణం మారీసుపేటలోని ఆయేషామీరా నివాసానికి ఆదివారం వచ్చింది. ఆమె తల్లిదండ్రులు షంషాద్‌బేగం, ఇక్బాల్‌భాషాను కలిసి దాదాపు ఐదు గంటల పాటు విచారించారు. తెనాలికి చెందిన ఆయేషా మీరా బిఫార్మసీ చదువుతూ, ఇబ్రహీంపట్నంలోని ప్రైవేటు హాస్టల్‌లో ఉంటూ, 2007 డిసెంబర్‌లో దారుణహత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ కేసులో సత్యంబాబును నిర్దోషిగా హైకోర్టు ప్రకటించిన నేపథ్యంలో కేసు పునర్విచారణ బాధ్యతను సిట్‌కు అప్పగించింది. సిట్ అధికారి డీఐజీ సీహెచ్ శ్రీకాంత్, డిఎస్పీలు శ్రీలక్ష్మి, హైమావతి ఆయేషా తల్లిదండ్రులను ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటలవరకూ సుదీర్ఘంగా విచారించారు.

దళారీ వ్యవస్థను నిర్మూలిస్తా: జగన్

ప్రజాశక్తి - జలదంకి

తమ పార్టీ అధికారంలోకి వస్తే దళారీ వ్యవస్థను నిర్మూలిస్తామని వైసిపి అధినేత జగన్ మోహన్ రెడ్డి రైతులకు హామీ ఇచ్చారు. గిట్టుబాటు ధర కల్పించి వారిని ఆదుకుంటామని తెలిపారు. నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలోని జలదంకి మండలం కొత్తపాలెం గ్రామంలో ఆదివారం ఆయన పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ సమస్యలను జగన్‌కు విన్నవించారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర అందడం లేదని, దళారులతో మోసపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రుణమాఫీని అందచేస్తామని తెలుగుదేశం ప్రభుత్వం తమను మభ్యపెట్టిందని తెలిపారు. నేటికి పూర్తిగా రుణమాఫీ చేయలేదని తెలిపారు. గ్రామంలోని వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, తమకు పింఛన్ ఇవ్వడం లేదని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వ పథకాలు పేదలకు చేరడం లేదంటూ కొంతమంది తమ ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ స్పందిస్తూ తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే రైతులకు గిట్టుబాటు ధర కల్పించి దళారీ వ్యవస్థను రద్దు చేస్తామని, అర్హులైన వారందరికీ పింఛన్లు, గృహాలు, మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు.

ఎడ్లబండిపై జగన్



స్మార్ట్ సిటీస్ మిషన్ కోసం ఏపికి 588 కోట్లు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ సిటీస్ మిషన్‌లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు రూ.588 కోట్లు విడుదల చేసింది. ఆదివారం ఈ మేరకు దేశంలో వివిధ రాష్ట్రాలకు రూ.9,940 కోట్లు విడుదల చేసింది. అత్యధికంగా మహారాష్ట్రకు రూ.1,378కోట్లు కేటాయించగా, ఆ తర్వాత మధ్యప్రదేశ్‌కు రూ.984కోట్లు కేటాయించినట్లు ప్రభుత్వ గణాంకాల ద్వారా వెల్లడైంది. స్మార్ట్ సిటీస్ కార్యక్రమం కింది కేంద్ర గహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ 99 నగరాలను గుర్తించింది. ఈ నగరాల అభివద్ధికి రూ.2.03 లక్షల కోట్ల నిధులను కేటాయించడం ద్వారా మౌలిక సదుపాయాలను మెరుగుపరచనున్నారు. మహారాష్ట్రలో పుణే, నాసిక్ సహా ఎనిమిది నగరాలను ఇందుకు ఎంపిక చేయగా, వాటి అభివద్ధికి రూ.1,378కోట్లు, మధ్యప్రదేశ్‌లో ఏడు నగరాల అభివద్ధికి గానూ రూ.984 కోట్లు కేటాయించినట్లు మంత్రిత్వ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. ఇక తమిళనాడులో అత్యధికంగా 11 నగరాలను ఈ మిషన్ కింద అభివద్ధి చేయనుండగా, ఇందు కోసం రూ.848 కోట్లు, కర్ణాటకలోని ఏడు నగరాలకు రూ.836 కోట్లు, రాజస్థాన్‌లోని నాలుగు నగరాలకు రూ.784కోట్ల నిధులు విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని నాలుగు నగరాల అభివద్ధికి రూ.588 కోట్లు కేటాయించారు. ఉత్తరప్రదేశ్‌లోని 10 నగరాలకు రూ.547కోట్లు, గుజరాత్‌కు రూ.509 కోట్లు కేటాయించారు.

కేంద్రం విడుదల చేసిన ఈ నిధులతో ఆయా నగరాల్లో స్మార్ట్ రోడ్లు, తాగునీటి సరఫరాను మెరుగు పరచడం, సైకిల్ ట్రాక్స్, పాదచారుల కోసం ట్రాక్, స్మార్ట్ క్లాస్ రూమ్స్, నైపుణ్యాభివద్ధి కేంద్రాలు, ఆరోగ్య సౌకర్యాల మెరుగు, పాన్ సిటీ ప్రాజెక్టులను నిర్మించనున్నారు. తాజా పథకం కింద ప్రతీ నగరానికి రూ.500 కోట్లు కేటాయించనున్నారు. ఎంపిక చేసుకున్న దాని ప్రకారం మొదట రూ.200 కోట్లు ఇవ్వనుండగా, తర్వాత మూడేళ్ల కాలంలో రూ.100 కోట్లు చొప్పున కేటాయించనున్నారు.

సైన్స్ సిటీకి చెల్లుచీటీయేనా..?

కేంద్రం నుంచి విడుదల కాని నిధులు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహన, విజ్ఞానం పెంపొందించడమే లక్ష్యంగా నిర్మించ తలపెట్టిన ఆంధ్రప్రదేశ్ సైన్స్ సిటీ ప్రాజెక్టును ప్రతిపాదించి మూడేళ్లవుతుంది. కానీ ఇంతవరకు ఒక్క అడుగూ ముందుకు పడలేదు. అసలు ఈ ప్రాజెక్టును ప్రారంభిస్తారా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఏర్పాటు చేయాల్సిన సైన్స్ సిటీకి ఇప్పటి వరకు కేంద్రం నుంచి నిధులు విడుదల కాలేదు. మరోవైపు రాష్ట్రంలో పోలవరం వంటి ప్రాజెక్టులకే కేంద్రం నిధులు విడుదల చేయడంలేదు. ఇక ఈ సైన్స్ సిటీ ప్రాజెక్టుకు ఇప్పట్లో నిధులు ఇవ్వకపోవచ్చుని పలువురు అధికారులూ పెదవి విరుస్తున్నారు.

అంతర్జాతీయ స్థాయిలో శాస్త్ర సాంకేతిక పరిశోధనలు, సైన్స్ మ్యూజియమ్ తదితర ప్రతిపాదనలతో సైన్స్ సిటీ ప్రాజెక్టు నిర్మించాలని 2015లోనే ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో తొలుత రూ. 200 కోట్లతో మెగా సైన్స్ ప్రాజెక్టుగా అభివృద్ధి చేసేందుకు గతేడాది జూన్‌లో అంకురార్పణ చేశారు. తిరుపతిలో ఏర్పాటు చేసే ఈ సైన్స్ సిటీకి అనుసంధానంగా అమరావతి, విశాఖలో శాస్త్ర సాంకేతిక పరిశోధన కేంద్రాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. తిరుపతిలో 104 ఎకరాల్లో ఈ ప్రాజెక్టుకు సంబంధించి సైన్స్ మ్యూజియం, పరిశోధనా కేంద్రం, కన్వెన్షన్ సెంటర్లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించింది. అందుకు సవివర ప్రాజెక్టు నివేదిక (డిపిఆర్) కేంద్రానికి పంపింది. సైన్స్ ప్రచార కేంద్రం, పరిశోధనా కేంద్రం, విజ్ఞాన కేంద్రాలుగా మూడు కార్యక్రమాలను నిర్వహించాలని డిపిఆర్‌లో ప్రతిపాదించారు. అందులో సైన్స్ ప్రచారంలో భాగంగా స్పేస్, అర్త్, బయోడైవర్శిటీ తదితర ఏడు రకాల మ్యూజియంలను నెలకొల్పాలని పేర్కొన్నారు. పర్యాటకంతోపాటు శాస్త్ర సాంకేతిక విజ్ఞానం మేళవింపు ఉండాలనే దృష్టితో ఈ డిజైన్లను సిద్ధం చేశారు. ఇందులో దేశవిదేశాల్లోని వివిధ యూనివర్శిటీలు కూడా తమ కేంద్రాలను ఏర్పాటు చేసుకునే అవకాశాన్ని కల్పించేలా డిజైన్లు రూపొందించారు.

సైన్స్ సిటీ ఏర్పాటుకు తొలుత రూ 200 కోట్లు ప్రతిపాదించినప్పటికీ పూర్తి ప్రణాళికలు సిద్ధం చేసిన తర్వాత మాత్రం ఆ అంచనాలను కాస్తా రూ 553 కోట్లకు పెంచారు.

కేంద్ర ప్రభుత్వ వాటా రూ 400 కోట్లు కాగా మిగిలిన మొత్తం రాష్ట్ర వాటా కింద నిధులు మంజూరు చేయాలి. అయితే ఈ ప్రాజెక్టు ప్రతిపాదించి మూడేళ్లవుతున్నా కేంద్ర ప్రభుత్వం మాత్రం ఇప్పటివరకు సైన్స్ సిటీకి నిధులు విడుదలచేయలేదు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం డిపిఆర్ సిద్ధం చేసేందుకు, సిబ్బంది జీతభత్యాలు, పాలనా వ్యవహారాల కోసం మాత్రం రూ 20 కోట్లు ఖర్చు చేసింది. కేంద్రం నుంచి నిధులు విడుదలకానిదే ఈ ప్రాజెక్టు ముందుకు సాగే అవకాశం లేదని అధికారులు అభిప్రాయ పడుతున్నారు.



మహిళల మోటార్ బైక్ ర్యాలీకి స్వాగతం పలుకుతున్న టూరిజం ఉన్నతాధికారులు

రోడ్ టు మెకాంగ్ మోటార్ సైకిల్ యాత్రకు టూరిజం శాఖ స్వాగతం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

' రోడ్ టు మెకాంగ్' పేరుతో నలుగురు మహిళలు చేపట్టిన మోటార్ బైక్ ర్యాలీకి ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ ఉన్నతాధికారులు ప్రకాశం బ్యారేజ్ వద్ద ఆదివారం స్వాగతం పలికారు. జయ భారతి ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీలో శిల్పా బాలకృష్ణన్, ఎఎస్‌డి శాంతి, ప్రియా బహుదూర్ ఉన్నారు. వీరు టూరిజం బోట్ పాయింట్ వద్ద మీడియాతో మాట్లాడారు. ఆదివారం రాత్రికి బెర్మ్ పార్క్‌లో బసచేసి సోమవారం విశాఖకు బయల్దేరతామన్నారు. భారత్‌తో పాటు ప్రపంచం మొత్తం మహిళలు స్వేచ్ఛగా ప్రయాణించగలరని తెలపటమే తమ బృందం ఉద్దేశమన్నారు. ఈ సందర్భంగా పర్యాటక శాఖ ఉన్నతాధికారులు ఎస్‌వి లక్ష్మణ్ మూర్తి, మల్లికార్జున్, పర్యాటక శాఖకార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా విజయవాడతో పాటు ఎపిలోని పలు పర్యాటక ప్రదేశాలను గురించి వారికి వివరించారు.

కేంద్రమంత్రిని అడ్డుకున్న వైసిపి నేతలు!

- మచిలీపట్నంలో ఉద్రిక్తత..

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

కృష్ణా జిల్లా అసెంబ్లీ బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొనేందుకు మచిలీపట్నం వచ్చిన కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి ఆర్‌కె సింగ్‌ను ఆదివారం వైసిపి నేతలు అడ్డుకునే యత్నం చేశారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు మొండిచేయి చూపించారని, విభజన చట్టంలోని హామీలను అమలుచేయాలని నినాదాలు చేశారు. దీంతో మాజీ విప్, నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని వెంకట్రామయ్య(నాని), మాజీ మున్సిపల్ చైర్మన్ షేక్ సిలార్‌దాదాలతో పాటు పలువురు నాయకులను చిలకలపూడి, ఇనగుదురుపేట పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

అనంతరం ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో కేంద్రమంత్రి ఆర్‌కె సింగ్ మాట్లాడారు.

దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న 4 కోట్ల గృహాలకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు అందించనున్నామని ఆయన తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో సౌభాగ్య పథకం కింద నిరుపేదల గృహాలకు ఉచితంగా విద్యుత్ కనెక్షన్ అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు హరిబాబు మాట్లాడుతూ రాష్ట్రానికి నిధులివ్వడం లేదంటూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేస్తున్న విమర్శల్లో పసలేదన్నారు. బిజెపి అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రానికి జరిపిన కేటాయింపుల చిట్టా తన దగ్గర ఉందని, బుకాయింపులతో వాస్తవాలను మరుగునపర్చలేమన్నారు.



వైసిపి నాయకులు పేర్ని నానిని అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించిన పోలీసులు

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68